RNI.No. APTEL/2014/57702
Estd.: 2000
www.voodayam.com /voodayam /Voodayam




# వుదయం

Simultaneously published from Guntur, Hyderabad, Adilabad, Khammam, Karimnagar & Warangal




సంపుటి : 12 ‖ సంచిక : 74 ‖ గుంటూరు ‖ గురువారం, జూలై 17, 2025 ‖ VOODAYAM Telugu Daily ‖ వెల : రూ. 1.00 ‖ పేజీలు : 12


# బనకచర్లతో ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం ఉండదు

- దిల్లీలో సమావేశమైన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు
- గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అనుసంధానం సింగిల్ పాయింట్ అజెండాను ప్రతిపాదించిన ఏపీ..
- సముద్రంలో వృథాగా కలిసే జలాలనే వినియోగిస్తామని వివరించింది
- ఈ సందర్భంగా గోదావరిలో వందేళ్ల సరాసరి ప్రవాహాల గణాంకాలను పేర్కొంది
- ఏటా 3వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని తెలిపింది
- బనకచర్ల ద్వారా గరిష్ఠంగా 200 టీఎంసీలే తరలిస్తామని వివరించింది.

**దిల్లీ:**

తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న జల అంశాలపై చర్చించేందుకు ఏపీ, తెలంగాణ సీఎంలు భేటీ అయ్యారు. దిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో ఏపీ సీఎం చంద్రబాబు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. భేటీ ప్రారంభంలో సీఆర్ పాటిల్‌తో పాటు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి పరస్పరం కరచాలనం చేసుకున్నారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అనుసంధానం సింగిల్ పాయింట్ అజెండాను ఏపీ.. 13 అంశాలను తెలంగాణ ప్రతిపాదించాయి. ఇరు రాష్ట్రాల ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం అజెండాలో చేర్చింది. ఈ భేటీకి ఏపీ, తెలంగాణ జలవనరుల శాఖ మంత్రులు నిమ్మల రామానాయుడు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇరు రాష్ట్రాల సీఎస్‌లు, జలవనరుల శాఖ కార్యదర్శులు, ఇంజినీర్లు హాజరయ్యారు. సమావేశానికి ముందు ఆయా రాష్ట్రాల అధికారులతో ఇరువురు సీఎంలు సమావేశమయ్యారు. భేటీలో లేవనెత్తాల్సిన అంశాలు, సాంకేతికంగా ఇవ్వాల్సిన సమాధానాలపై చర్చించారు. సీఎంలు తమ అధికారిక నివాసాల్లో సుమారు - మిగతా3లో





## ఈ నెల 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

- ఎనిమిది బిల్లులను ప్రవేశపెట్టనున్న కేంద్రం..!
- మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు సంబంధించిన బిల్లు సైతం
- మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించాలని ప్రభుత్వం పరిశీలిస్తోంది
- ప్రస్తుతం ఈ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను తొలగించే ఉద్దేశం కేంద్రానికి లేదని తెలుస్తోంది

# ఏడాదిలో 10లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం

- "ప్రస్తుతం కాలంలో సాంకేతికత అనేది గేమ్ ఛేంజర్
- ఈ సాంకేతిక యుగంలో ప్రభుత్వాల వద్ద ప్రజల డేటా ఉంటుంది
- రాష్ట్రంలో ఆగస్టు 15 నుంచి వాట్సప్‌లో మరిన్ని పౌర సేవలు అందుబాటులో వస్తాయి
- కుప్పం నుంచి డిజిటల్ హెల్త్ కార్డుల కార్యక్రమం చేపడతాం.




**దిల్లీ**

ఏపీలో తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడాదిలో 10లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని సీఎం చంద్రబాబు తెలిపారు. వచ్చే ఏడాది 13 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. 'స్వర్ణాంధ్రప్రదేశ్-2047'పై టాటా సంస్థల ఛైర్మన్ చంద్రశేఖరన్ నేతృత్వంలో ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ తమ నివేదికను సీఎంకు దిల్లీలో అందజేసింది. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధికి నివేదికలో టాస్క్‌ఫోర్స్ పలు సూచనలు చేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. "ప్రస్తుతం కాలంలో సాంకేతికత అనేది గేమ్ ఛేంజర్. ఈ సాంకేతిక యుగంలో ప్రభుత్వాల వద్ద ప్రజల డేటా ఉంటుంది. రాష్ట్రంలో ఆగస్టు 15 నుంచి వాట్సప్‌లో మరిన్ని పౌర సేవలు అందుబాటులో వస్తాయి. కుప్పం నుంచి డిజిటల్ హెల్త్ కార్డుల కార్యక్రమం చేపడతాం. ఏపీలో - మిగతా3లో



## వైసీపీ నేతల నిందల్ని మోస్తూ సేవాతత్వంతో ముందుకు

- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి
- మెట్ట ప్రాంతమైన ఆత్మకూరుకు తాగు, సాగునీరు అందించేందుకు రూ.1800 కోట్లతో హైలెవల్ కెనాల్ తెచ్చామని
- గత ప్రభుత్వం పనులు నిలిపేయగా, ఇప్పుడు మళ్లీ పనులు ప్రారంభించాం
- హై లెవల్ కెనాల్‌తో లక్ష కుటుంబాలకు సాగునీరు, తాగునీరు అందించవచ్చని మంత్రి వెల్లడి



## బెంగాలీల పట్ల బీజేపీ వైఖరికి సిగ్గుపడుతున్నా

- పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ
- బెంగాలీ మాట్లాడే వారందరినీ బంగ్లాదేశీ రోహింగ్యాలు అని బీజేపీ పిలుస్తున్నది
- రోహింగ్యాలు మయన్మార్‌లో నివసిస్తారు
- పశ్చిమ బెంగాల్ పౌరులందరికీ సరైన గుర్తింపు కార్డులు, గుర్తింపు ఉన్నాయి



## గల్వాన్ ఘర్షణల తర్వాత తొలిసారి.. చైనా పర్యటనకు మోదీ..!

భారత్-చైనా మధ్య స్తంభించిన దౌత్య సంబంధాలను పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు

వచ్చే నెలలో జరిగే ఎస్‌సీఓ సదస్సుకు ప్రధాని హాజరుకానున్నట్లు సమాచారం.

ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనాలు

## కృష్ణ,గోదావరి నదీ జలాలపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చలు సఫలం

- కెఆర్ఎంబి అమరావతిలో, జిఆర్ఎంబి హైదరాబాదులో
- రిజర్వాయర్ల అవుట్ ఫ్లోల కు టెలీ మీటర్లు
- పోలవరం- బనకచర్ల ప్రాజెక్ట్ సాంకేతిక అంశాలు, సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక కమిటీ
- ఢిల్లీ లో కేంద్ర మంత్రి తో సమావేశం వివరాలు వెల్లడించిన మంత్రి నిమ్మల రామానాయుడు

**దిల్లీ**

కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించి కేంద్ర జల శక్తి మంత్రి సి ఆర్ పాటిల్ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ఫలప్రదమైనట్లు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. కేంద్ర జలశక్తి మంత్రి సి ఆర్ పాటిల్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖామంత్రులు, సి డబ్ల్యూ సి అధికారులు, ఇంజనీర్లు, అలాగే ఇరు రాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు పాల్గొన్న ఈ సమావేశం స్నేహపూరిత, సుహృద్భావ వాతావరణంలో జరిగిందని మంత్రి రామానాయుడు చెప్పారు. ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ సమావేశంలో మూడు ముఖ్యాంశాలపై - మిగతా3లో



# కరేడు రైతులను తరిమేయాలని చూస్తున్నారు



- వాళ్ల కోసం సేకరించిన భూములు వాళ్లకే ఇవ్వడం లేదు
- రైతులను ఒత్తిడి తెచ్చి వెళ్లగొట్టాలని చూస్తున్నారు.
- చంద్రబాబుకు పరిశ్రమలను ఏర్పాటు చేయాలనే ఉద్దేశమే లేదు
- వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్

**తాడేపల్లి**

చంద్రబాబు ప్రభుత్వం కుట్రతో కరేడు రైతులను తరిమేయాలని చూస్తున్నారని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు. వాళ్ల కోసం సేకరించిన భూములు వాళ్లకే ఇవ్వడం లేదు.. రైతులను ఒత్తిడి తెచ్చి వెళ్లగొట్టాలని చూస్తున్నారని తెలిపారు. ఇండోసోల్‌కు పొగ పెట్టి పొమ్మంటోంది అంటూ కూటమి సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు పరిశ్రమలను ఏర్పాటు చేయాలనే ఉద్దేశమే లేదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. 'కరేడు చాలా విచిత్రమైన విషయం. రైతులపై ఒత్తిడి తెచ్చి వెళ్లగొట్టాలని చూస్తున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రామాయుపట్నం పోర్టుకు సంబంధించి ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా భూసేకరణ చేసి నిర్వాసితులకు న్యాయం చేశాం. పోర్టుకు అనుకుని ఇండోసోల్ కంపెనీ - మిగతా3లో

# సంపాదకీయం

## ట్రంప్ ఏకపక్ష వాణిజ్య విధానం

అమెరికాతో భారత్ కుదుర్చుకోవలసిన వాణిజ్య ఒప్పందంలో ట్రంప్ విధించిన గడువు జూలై తొమ్మిదితో ముగిసింది. ఈ విషయంలో ఉభయ దేశాల మధ్య చర్చలు జరుగుతుండగానే ట్రంప్ ఏకపక్షంగా భారత్‌లో వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించారు. దీనిపై ప్రధాని మోడీ స్పందించలేదు. ఈ ఒప్పందం ప్రకారమైతే అమెరికా కోసం భారత్ మార్కెట్‌ను తెరవాలి. తన వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకోవడానికి అవకాశం కల్పించాలి. మన మార్కెట్‌లోకి అమెరికా ఉత్పత్తులైన డెయిరీ, పౌల్ట్రీ, మొక్కజొన్న, సోయాబీన్, బియ్యం, గోధుమలు, ఇథనాల్, సిట్రస్ పండ్లు, బాదం, యాపిల్,ద్రాక్ష, క్యానడ్ పీచస్,చాక్‌లెట్స్ ఇవి దిగుమతి అయితే దేశ వ్యవ సాయ రంగానికి తీవ్రనష్టం. ఎందు కంటే, భారత జనాభా 146కోట్ల మందికి సరిపడా ఆహార ధాన్యాలు ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని అమెరికా నుండి దిగుమతి చేసుకుంటే వ్యవసాయ రంగంపై ఆధారపడిన సన్న,చిన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతారు. అమెరికాలో సబ్సిడీలెక్కువ. అందులో వ్యవసాయంపై ఆధారపడిన వారు కేవలం ఐదు శాతం మాత్రమే. అక్కడ యావరేజ్ కమతం 187 హెక్టార్లు. భారతదేశంలో ఒక హెక్టార్‌లోపు మాత్రమే వస్తుంది. కాబట్టి అమెరికాలో దిగుబడి బాగా ఉంటుంది. భారత మార్కెట్ లో వ్యవసాయం, పాల ఉత్పత్తుల రంగంలో తమ ఉత్పత్తులను తెరవాలనేది అమెరికా డిమాండ్.ఈ ఉత్పత్తుల దిగుమతులపై విధిస్తున్న సుంకాలను తగ్గించమని భారత్‌పై ఒత్తిడి తెస్తోంది.అమెరికా ప్రధానంగా గోధుమ,బియ్యం,పాల ఉత్పత్తులు,సోయా,పిస్తా,బాదం వంటి ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను తగ్గించాలని కోరుతోంది. అమెరికన్ కంపెనీలు అమెజాన్,వాల్‌మార్ట్ వంటి సంస్థలు నేరుగా భారత మార్కెట్‌లోకి ప్రవేశించి తమ ఉత్పత్తులను సులభంగా విక్రయించేందుకు ఇది సహాయపడుతుంది.అయితే ఈ ఉత్పత్తులు చౌకధరలకు అందిస్తే భారతదేశ రైతులు తీవ్రనష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆహార భద్రత కింద వ్యవసాయ ఉత్పత్తుల ధరలను కూడా కేంద్ర ప్రభుత్వం నియంత్రణలో ఉంచుతుంది. దీంతో మన రైతులకు గిట్టుబాటు ధరలు కూడా రావడం లేదు.జన్యుపరమైన మార్పులతో అమెరికా పండించిన ఆహార పంటలను ఉత్పత్తి చేస్తుంది.ప్రధానంగా మొక్కజొన్న, సోయాబీన్స్ వంటివి వీటితో పాటు పశువులకు అవసరమైన దానా సప్లరు చేయడానికి ఒప్పందం చేసుకోవాలని చూస్తుంది. గతంలో మనదేశం డెయిరీ ఎగుమతులపై ఆంక్షలు విధించింది. ఇప్పుడు దాన్ని ఎత్తివేయాలని అమెరికా కోరుతున్నది. ఇండియా సాధారణంగా 17శాతం టారిఫ్ వేస్తున్నది.దీన్ని ఇప్పుడు టారిఫ్ కిందకు తీసుకురావాలని చెప్ప కుండా 3.3శాతం టారిఫ్ అమలు చేయాలంటోంది.అమెరికా మన ఎగుమతులపై 26శాతం టారిఫ్‌లు పెంచింది. తమ వాణిజ్యలోటును తగ్గించుకునేందుకు వ్యవసాయ ఉత్పత్తులను భారత్‌కు ఎగుమతి చేయాలనుకుంటోంది.దీంతో అమెరికా లోని రైతులకు లాభం చేకూరుతుంది. అమెరికా ఉత్పత్తులు మన దేశంలోకి వస్తే మన పంటలకు ధరలు లేక రైతుల ఆదాయాలు పడిపోతాయి. పైగా రైతులు అనివార్యంగా వ్యవసాయ రంగం నుంచి తప్పుకుని ఆహార పంటలను తగ్గించాల్సి వస్తుంది. అమెరికాలో మొక్క జొన్న, సోయాబీన్, గోధుమ, బియ్యం వంటి పంటలపై నూతన వ్యవసాయ బిల్లులతో 61డాలర్ల నుండి 175డాలర్లకు సబ్సిడీ పెంచారు.అంటే 150శాతం.పంట బీమా సబ్సీడీ,అగ్రికల్చర్ రిస్క్ కవరేజీ కూడా కనీస దిగుబడి కంటే తక్కువ వస్తే మాత్రమే అంత మొత్తం సబ్సీడీ ఇస్తారు.ధర కోల్పో యిన కవరేజ్ కూడా జాతీయ సగటు ధర కంటే మార్కెట్‌లో తక్కువ ధరకు సరుకు అమ్మితే ఆ మొత్తం సబ్సీడీ ఇస్తారు.పంట ఉత్పత్తి, పర్యావరణహిత పంటలకు మాత్రమే సబ్సిడీ ఇస్తారు.అమెరికాలో చిన్న రైతులకు కేవలం 39శాతం సబ్సీడీలిస్తే పెద్ద రైతులకు 69శాతం సబ్సిడీ ఇస్తున్నారు.ఈ సంఖ్య చాలా పెద్దగా ఉంటుంది. అమెరికాలో చిన్నరైతు అంటే 500 ఎకరాలలోపు ఉన్నవారే.అమెరికా బడ్జెట్‌లో 6.8ట్రిలియన్ డాలర్లు కేటాయించినది.ఒక ట్రిలియన్ అంటే రూ.వెయ్యి కోట్లు.అంటే 6లక్షల 80వేల కోట్ల డాలర్లు.అయితే భారతదేశం వ్యవసాయ రంగానికి కేవలం 2.5శాతం మాత్రమే సబ్సీడీ ఇస్తున్నది.ఈ రకంగా భారతీయ వస్తువులపై అమెరికా ప్రతీకార సుంకాలు విధించిన పక్షంలో వ్యవసాయ ఉత్పత్తులు, రసాయనాలు, ఫార్మా,వైద్య పరికరాలు,విద్యుత్తు పరికరాలు,యంత్రాలతోసహా అనేక రంగాలకు చెందిన వస్తువులపై ప్రతి కూల ప్రభావం పడుతుంది. అమెరికా,భారత్ విధించే దిగుమతి సుంకాల రేట్ల మధ్య చాలా తేడా ఉన్న కారణంగా ట్రంప్ ప్రభుత్వం నుంచి అదనపు కస్టమ్స్ సుంకాలను ఈ రంగాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అమెరికా,భారత్ మధ్య రసాయనాలు,ఫార్మసీ వస్తువుల దిగు మతి సుంకంలో 8.6 శాతం తేడా ఉంది.ట్రంప్ విధించే ప్రతీకార సుంకాల కారణంగా అమెరికాకు దిగుమ తయ్యే భారతీయ వస్తువులపై నికరంగా 310 కోట్ల డాలర్ల అంటే సుమారు 26,483 కోట్ల రూపాయలు నష్టం ఏర్పడగలదు. ఇది భారత జీడీపీపై 0.1 శాతం ప్రభావం చూపగలదు. అందుకే ట్రంప్ టారిఫ్‌లను కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించాలి.

# ఉపవాసాలకు ఉద్దిష్టమైనది దక్షిణాయణం



మన పూర్వీకులు సూర్య భగవానుని గమనం ప్రకారం యుగాలుగానూ, యుగాలను సంవత్సరములుగానూ, సంవత్సరములను మాసములు గానూ, మాసములను వారములు గానూ, వారములను రోజులు గానూ, రోజులను జాములు గానూ, జాములను ఘడియలు గానూ కాల గమనాన్ని తెలుసు కోవటానికి విభజించారు. సంవత్సరంలో ఉన్న 12 మాసములను రెండు ఆయనాలుగా విభజించారు. సూర్య భగవానుడు మకర రాశిలో ప్రవేశించినప్పుడు ఉత్తరాయణం, కర్కాటక రాశిలో ప్రవేశించినప్పుడు దక్షిణాయణం ఏర్పడతాయి. ఖగోళ శాస్త్రం ప్రకారం జనవరి 15 నుంచి జూలై 16 వరకు ఉత్తరాయణం, జూలై 17 నుంచి జనవరి 14 వరకు దక్షిణాయనం అని అంటారు. సాయన ఉత్తరాయణం ప్రతి సంవత్సరం డిశంబర్ 21-22 తేదీల్లో ప్రారంభం అవుతుంది. అలాగే సాయన దక్షిణాయణం జూన్ 21-22 తేదీల్లో ప్రారంభం అవుతుంది. అయితే భారతీయ గ్రహగణితం నిర్ణయ గణితం కాబట్టి ఆయనాంశ కారణంగా సాయన, నిర్ణయ సంక్రాంతుల్లో ఇలా మార్పు కననిపిస్తుంది. ఖగోళ శాస్త్రం ప్రకారం.. సూర్యుడి గమనంలో మార్పులే ఉత్తరాయణ, దక్షిణాయనాలు. 'అయనం' అంటే ప్రయాణం అని అర్థం. దక్షిణాయనం అంటే దక్షిణ దిశగా ప్రయాణం చేయడమనే అర్థం వస్తుంది. సూర్యుడు తూర్పు దిశలో ఉదయిస్తాడని తెలుసు. కానీ సూర్యోదయాన్ని గమనిస్తే, అది తూర్పు దిక్కున జరగదు. సూర్యుడు సరిగ్గా తూర్పు దిశ మధ్యలో ఉదయించేది ఏడాదిలో 2 రోజులు మాత్రమే. అవి మార్చి 21, సెప్టెంబరు 23. మిగతా ఆరు నెలలు ఈశాన్యానికి దగ్గరగా, మరో 6 నెలల ఆగ్నేయానికి దగ్గరగా సూర్యోదయం జరుగుతుంది. సూర్యుడు ఈశాన్యానికి దగ్గరగా ఉదయించే కాలాన్ని ఉత్తరాయణం అని, ఆగ్నేయానికి దగ్గరగా ఉదయించే కాలాన్ని దక్షిణాయణం అని అంటారు. ఈ దక్షిణాయనంలో సూర్యుడు భూమధ్య రేఖకు దక్షిణ దిశలో పయనిస్తాడు. సూర్య గమణాన్ని బట్టి మన భారతీయులు కాలాన్ని రెండు భాగాలుగా విభజించారు . భూమధ్యరేఖకు ఉత్తరదిశలో సూర్యుడు కనిపిస్తే ఉత్తరాయణమని, దక్షిణంగా సంచరించినప్పుడు దక్షిణాయమని అన్నారు. ఏడాదిలో 6నెలలు ఉత్తరాయణం.. 6నెలలు దక్షిణాయనం. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించి నప్పుడు ఉత్తరాయణం.. కర్కాటక రాశిలోకి ప్రవేశించి నప్పుడు దక్షిణాయనం ప్రారంభమవుతుంది. సంక్రమణం ప్రవేశించిన తరువాత మొదటి 6గంటల 49 నిముషములు పుణ్యకాలంగా, 2 గంటల 16 నిమిషములు అత్యంత పుణ్యకాలంగా శాస్త్రములందు చెప్పబడింది. ఆ సమయంలో స్నాన, దాన, జపాదులేవైనా అధిక ఫలితాలనిస్తాయి. ఆధ్యాత్మిక పరంగా ఉత్తరాయణం దేవతలకు పగలు అయితే, దక్షిణాయనం దేవతలకు రాత్రి కాలం. ఈ కాలంలో శ్రీమహావిష్ణువు యోగనిద్రలో ఉంటాడు. ఇలాంటి సమయంలో మనిషి ఎదుగుదలకు దైవశక్తి సాయం ఎంతో అవసరం. అందుకే దేవతల శక్తిని ప్రేరేపించడనికి ఈ కాలంలో ఉపాసనలు చేస్తారు. అందువల్ల ఇది ఉపాసన కాలం అయ్యింది. శ్రీహరి ఆషాడ శుద్ధ ఏకాదశి రోజున యోగ నిద్రలోకి వెళ్లి కార్తీక శుద్ధ ఏకాదశి నాడు నిద్రలేస్తారు. ఈ సమయంలో యోగులు, మఠాధిపతులు చాతుర్మాస దీక్షను చేపడతారు. శాస్త్రీయంగా దక్షిణాయనంలో సూర్యకాంతి భూమి మీద తక్కువగా ప్రసరిస్తుంది. ఫలితంగా జీవులలో రోగ నిరోధకశక్తి క్షీణించి రోగాల బారిన పడతారు. వీటిని నిరోధించడానికి ఈ కాలంలో బ్రహ్మచర్యం, ఉపసాన, తరుచుగా ఉపవాసాలు, పూజలు, వ్రతాల పేరుతో పాటించే నియమాలు రోగనిరోధక శక్తిని పెంచి, ఆరోగ్యాన్ని కలిగిస్తాయి. ఎలా చూసిన దక్షిణాయనంలో చేసే జప, దాన, పూజలు ఆరోగ్యాన్ని, అధ్యాత్మిక అనుభూతుని ప్రసాదించడంతో పాటు పరమాత్మ పాదాలను చేరుస్తాయి. దక్షిణాయనంలో పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు చేయడం, సాత్వికాహారం ఫలితాన్నిస్తాయి. ముఖ్యంగా దక్షిణాయనం లోనె పితృ దేవతలు తమ సంతానం ఇచ్చే శ్రాద్ధాలు, విశేష తర్పణాలను స్వీకరించేందుకు భూమిపైకి వస్తారని అంటారు. ఈ సమయంలోనే పితృదేవతారాధనకు సంబంధించిన మహాలయ పక్షాలు వస్తాయి. పితృదేవతలను సంతృప్తిపరిస్తే, వారి అను గ్రహంతో సంతానాభివృద్ధి జరుగుతుంది. శ్రాద్ధాదులు నిర్వహించక పోవడం కూడా సంతాన లేమికి ఒక కారణమని పెద్దలు పేర్కొంటారు. బతికుండగా తల్లిదండ్రుల సేవ, మరణించాక శ్రాద్ధాలు చేయడం విధి, ఎంతో ముఖ్యం, శుభప్రదం. పితృ రుణం తీర్చుకోవడానికి అది మార్గం. అంతేకాదు కని పెంచిన తల్లిదండ్రులకు అది ఒక కృతజ్ఞతా పూర్వక చర్య. ధ్యానం, మంత్ర జపాలు, సూర్యోదయానికి ముందే లేచి పవిత్ర నదుల్లో స్నానాలు, పిండ ప్రదానాలు, పితృ తర్పణాలు, సాత్వికాహారం (శాకాహారం) తీసుకోవడం, అవసరంలో ఉన్న వారికి దానం చేయడం, అన్నదానం, తిల (నువ్వుల ) దానం, వస్త్ర దానం, విష్ణు పూజ, విష్ణు సహస్రనామ పారాయణ, సూర్యరాధన, ఆదిత్య హృదయ పారాయణం చేస్తే అవి శరీరానికి, మనసుకు మేలు చేస్తాయని, పాపాలు తొలగి పోతాయని శాస్త్రాలు తెలుపుతున్నాయి. ఈ ఏడు జూలై 16న దక్షిణాయనం ప్రారంభం అయింది.



రామ కిష్టయ్య సంగన భట్ల...

# ప్రపంచ శాంతి అందని ద్రాక్షేనా !



డా: బుర్ర మధుసూదన్ రెడ్డి


ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో అశాంతి, అనహనాలు అసాధారణంగా పెరుగుతున్నాయి. యుద్ధాల్లో చిన్నారులు సహితం సమిధలు అవుతున్నారు. మారణహోమాలు యధేచ్ఛగా రెక్కలు విచ్చుకుంటున్నాయి. మానవత్వాలు మంటగలుస్తున్నాయి. ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. మానవ హక్కుల హననాలు నిత్యకృత్యం అవుతున్నాయి. రాజకీయ కీచులాటలు రక్తం చిందుస్తున్నాయి. యుద్ధ నేరాలు పెచ్చరిల్లుతున్నాయి. అంతర్జాతీయంగా న్యాయ దేవత ఒంటరి పోతున్నది.అంతర్జాతీయ న్యాయం దూరపు కొండ వలె కనిపిస్తున్నది. అంతర్జాతీయ న్యాయం అనగా మారణహోమం, మానవాళికా వ్యతిరేకంగా నేరాలు, యుద్ధ నేరాలు, హింస, బలవంతపు కిడ్నాపులు లాంటి తీవ్రమైన నేరాలకు జవాబుదారీతనం పొందడం అని అర్థం చేసుకోవాలి. పలు దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలు, పలు జాతుల మధ్య కొనసాగుతున్న సంఘర్షణలు ప్రపంచ శాంతికి విఘాతంగా నిలుస్తున్నాయి. యుద్ధాలు నేరాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నాయి. యుద్ధాల్లో జరుగుతున్న అఘాయిత్యాలకు అంతర్జాతీయ పౌర సమాజమే బాధ్యత వహించాలి. న్యాయం కోసం ప్రపంచ మానవాళి గళం విప్పాలి. "ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు (ఐసిసి)" తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ, మానవ హక్కులను పునర్ ప్రతిష్ఠించాలి. ఉక్రెయిన్, గాజా, ఆఫ్రికాల్లో సధారణ పౌర సమాజం ఆక్రందనాలు హద్దులు దాటుతున్నాయి. ప్రపంచ స్థాయిలో మానవాళి ఎదుర్కొంటున్న ఇలాంటి వేదనలకు అంతర్జాతీయ స్థాయిలో న్యాయం కల్పించడానికి 1998 నుంచి ప్రతి ఏట 17 జూలై రోజున "ప్రపంచ అంతర్జాతీయ న్యాయ దినోత్సవం" లేదా "వరల్డ్ డే ఫర్ ఇంటర్నేషనల్ జస్టిస్"ను పాటించడం జరుగుతున్నది. 17 జూలై 1998న అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు స్థాపించబడడంతో దానికి గుర్తుగా ఈ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం. నేటి డిజిటల్ ప్రపంచంలో బహు పాక్షికవాదం, న్యాయ సూత్రాలు పలు సవాళ్లను ఎదుర్కొంటున్న వేళ ప్రపంచ శాంతి, జవాబుదారీతనం, బాధితులకు హక్కులను కల్పించడం మరో సవాళుగా నిలుస్తున్నది. దేశాల సరిహద్దులు దాటి రాజకీయ ప్రాధాన్యాలను మరిచి సమ న్యాయ కల్పనకు నడుం బిగించాల్సిన సమయం ఆసన్నం అయ్యింది. నేడు సాధారణ పౌరులకు న్యాయం, జవాబుదారీతనం, మానవ హక్కుల పరిరక్షణలు పొందే కనీస హక్కులను వారికి కల్పించాలి. మారణోమం, ఊచకోతల్ని మనందరం నిర్భయంగా వ్యతిరేకించాలి. ఐసిసికి పూర్తి స్వేచ్ఛను కల్పించి సత్వర న్యాయాన్ని సుసాధ్యం చేయాలి. తీవ్రమైన నేరాలను అంతర్జాతీయ న్యాయ స్థానం తీవ్రమైనవిగా భావించాలి. చట్ట పాలన, మానవ హక్కుల రక్షణ, తీవ్రమైన నేరాలకు జవాబుదారీతనం, దురాక్రమణ చర్యలను నివారించడం, మారణహోమాలకు ఐసిసి నిబద్ధతను పునరుద్ఘాటించాలి. అంతర్జాతీయ నేరాలకు పాల్పడిన వ్యక్తులకు తగు శిక్షలు విధించాలి. ప్రపంచ స్థాయిలో శాంతి భద్రతలను కాపాడడం, భవిష్యత్తు దురాగతాలను నివారించడానికి ఐసిసి మెరుగైన పాత్రను నిర్వహించాలి.

ప్రపంచ అంతర్జాతీయ న్యాయ దినోత్సవ వేదికగా అవగాహనలు పెంచడం, మానవ హక్కుల పరిరక్షణ సంస్థలకు మద్దతు ఇవ్వడం, సెమినార్లు/కార్యశాలలు నిర్వహించడం, ఐసిసిని బలోపేతం చేయడం, ప్రపంచ న్యాయం కోసం పరితపించడం లాంటివి విధిగా నిర్వహించాలి. అంతర్జాతీయ న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడం, అమాయక బాధితులకు సత్వర న్యాయం కల్పించడంమారణహోమాలకు అడ్డుకట్ట వేయడం, మానవీతకు పట్టం కట్టడం, మానవాళి శ్రేయస్సుకు గొడుగులు పట్టడం లాంటివి నిరంతరం కొనసాగితేనే ప్రపంచ శాంతి పావురం స్వేచ్ఛగా తిరుగుతుంది.

# లక్ష్యానికి దూరంగా అంతర్జాతీయ క్రిమినల్ న్యాయ స్థానం

ఒక్క అమాయకుడికి కూడా అన్యాయము జరగకూడదన్న సూత్రము న్యాయ వయ్వస్థకు పునాది. అంతర్జాతీయ న్యాయ దినోత్సవం, అనేది "అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ దినోత్సవం" అని కూడా పిలువ బడుతుంది. దీనిని ప్రపంచ వ్యాప్తంగా జూలై 17 న జరుపుకుంటారు. యుద్ధ నేరాల ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజకీయ నేతలపై విచారణ జరిపేందుకు ఒక అంతర్జాతీయ న్యాయస్థానం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను మొట్టమొదటిసారి 1919లో జరిగిన పారిస్ శాంతి సదస్సులో కమిషన్ ఆఫ్ రెస్పాన్సిబిలిటీస్ తెరపైకి తీసుకొచ్చింది. లీగ్ ఆఫ్ నేషన్స్ ఆధ్వర్యంలో నవంబరు 1-16, 1937 మధ్య జెనీవాలో జరిగిన సదస్సులో ఈ అంశాన్ని మరోసారి ప్రస్తావించారు. రెండో ప్రపంచ యుద్ధం సందర్భంగా చోటుచేసుకున్న దురాగతాలపై విచారణ జరిపేందుకు ఒక శాశ్వత అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని 1948లో మొదటిసారి ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో గుర్తించారు. రెండో ప్రపంచ యుద్ధం తరువాత నాజీ యుద్ధ నేరాలపై దర్యాప్తు జరిపిన ఒక పరిశోధకుడు, న్యూరెంబర్గ్‌లో అమెరికా అధికారిక యంత్రాంగం జరిపిన పన్నెండు సైనిక విచారణల్లో ఒకట్కైన ఐన్‌శాట్జ్‌గ్రూపెన్ విచారణలో అమెరికా సంయుక్త రాష్ట్రాల ఆర్మీ ప్రధాన న్యాయవాదిగా వ్యవహరించిన బెంజమిన్ బి. ఫెరెంజ్... ఒక అంతర్జాతీయ చట్ట పాలన, ఒక అంతర్జాతీయ క్రిమినల్ న్యాయ స్థానం ఏర్పాటుకు ప్రధాన మద్దతుదారుగా మారారు.1975లో ప్రచురించిన 'డిఫైనింగ్ ఇంటర్నేషనల్ అగ్రెషన్ - ది సెర్చ్ ఫర్ వరల్డ్ పీస్' అనే తన మొదటి పుస్తకంలో, ఒక అంతర్జాతీయ న్యాయస్థానం ఏర్పాటు కోసం వాదించారు. అలా ఒక శాశ్వత అంతర్జాతీయ న్యాయస్థానాన్ని సృష్టించాలని ప్రతిపాదన రావడంతో, 1989లో ఈ ఆలోచనకు రూప కల్పన చేసేందుకు, ముసాయిదాను తయారు చేసేందుకు నడుం బిగించ బడింది. యుగోస్లావియా, రువాండాల్లో యుద్ధ నేరాలపై విచారణ జరిపేందుకు న్యాయస్థానాలు తొలుత ఏర్పడ్డాయి. దీంతో ఒక శాశ్వత అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానం ఏర్పాటు అవసరం మరింత ప్రాధాన్యత పొందింది. ఇందుకు సంబంధించి ఒక ఒప్పందాన్ని ఖరారు చేసే లక్ష్యంతో ఐక్య రాజ్య సమితి సాధారణ సభ జూన్ 1998లో రోమ్ నగరంలో ఒక సదస్సును ఏర్పాటు చేసింది. 21 దేశాలు ఈ ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. ఒప్పందానికి చైనా, ఇరాక్, ఇజ్రాయెల్, లిబియా, ఖతర్, యునైటెడ్ స్టేట్స్, యెమెన్ ఏడు దేశాలు వ్యతిరేకంగా ఓటు వేశాయి. జూలై 17, 1998న అంతర్జాతీయ క్రిమినల్ న్యాయ స్థానం రోమ్ శాసనం, 120 - 7 ఓట్ల తేడాతో ఆమోదిం చబడింది. ఇదే రోజున అంతర్జాతీయ న్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. ఏప్రిల్ 11, 2002న రోమ్ శాసనం సభ్య దేశాల ఆమోదంతో ఒక బంధన ఒప్పందంగా మారింది. శాసనం న్యాయబద్ధంగా జుల్కై 1, 2002 నుంచి అమల్లోకి వచ్చింది. ఐసీసీ (ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు) కు ఆ రోజు తరువాత జరిగిన నేరాలపై మాత్రమే విచారణ జరిపే అధికారాన్ని కల్పించారు. 18 మంది న్యాయమూర్తులతో కూడిన మొదటి ధర్మాసనాన్ని సభ్యదేశాల సభలో ఫిబ్రవరి 2003లో ఎన్నుకోవడం జరిగింది. ఈ న్యాయమూర్తులు మార్చి 1, 2003న న్యాయస్థాన ప్రారంభ సెషన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు.

అంతర్జాతీయ న్యాయస్థానం, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు రెండూ వేరు వేరు సంస్థలు. వీటి రెండిటికీ పరిధి ఉంది. అంతర్జాతీయ న్యాయస్థానం లేదా ప్రపంచ న్యాయస్థానం ఐక్యరాజ్యసమితి ప్రాథమిక న్యాయ అంగంగా నెదర్లాండ్ లోని హేగ్ నగరంలోగల, శాంతి సౌధం లో యున్నది. దీని ప్రధాన కార్యక్రమం, సభ్యదేశాల ద్వారా సమర్పించబడిన "న్యాయపర వాదనలు" ఆలకించడం, తీర్పు చెప్పడం. అయితే దీని యొక్క విచారణలు ఎక్కడైనా జరగవచ్చు. ఆగస్టు 2010 నాటికి, 113 దేశాలు న్యాయస్థానంలో సభ్య దేశాలయ్యాయి, దాదాపుగా అన్ని ఐరోపా మరియు దక్షిణ అమెరికా దేశాలు, ఆఫ్రికాలోని సగం దేశాలు ఇప్పుడు దీనిలో సభ్య దేశాలుగా ఉన్నాయి. మానవాళి చరిత్రలో మొట్టమొదటిసారి, ఒక అంతర్జాతీయ న్యాయస్థానానికి ఒక వ్యక్తికి నష్టపరిహారాన్ని మరో వ్యక్తి చెల్లించాలని ఆదేశించే అధికారాన్ని కల్పించారు. ఒక అంతర్జాతీయ న్యాయస్థానానికి ఇటువంటి అధికారం కల్పించడం కూడా ఇదే మొదటిసారి. కనీసం 139 దేశాల్లో అనుమానిత నేరాల గురించి న్యాయస్థానానికి ఫిర్యాదులు అందాయి. న్యాయస్థానం ఐదు కేసులపై విచారణలు ప్రారంభించింది: ఉత్తర ఉగాండా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, దార్ఫూర్ (సూడాన్) మరియు రిపబ్లిక్ ఆఫ్ కెన్యా కేసులపై ఈ న్యాయస్థానం విచారణలు చేపట్టింది. న్యాయస్థానం పదహారు మంది వ్యక్తులను దోషులుగా నిర్ధారించింది. వీరిలో ఏడుగురు పరారీలో ఉండగా, ఇద్దరు మరణించారు (లేదా మరణించినట్లు విశ్వసిస్తున్నారు), నలుగురు నిర్బంధంలో ఉన్నారు. ముగ్గురు స్వచ్ఛందంగా న్యాయస్థానం ఎదుట లొంగి పోయారు.2007 అక్టోబరు 4నాటికి కనీసం 139 దేశాల్లో అనుమానిత నేరాలకు సంబంధించి విచారణకర్తకు 2889 సమాచారాలు వచ్చాయి. అయితే ప్రాథమిక సమీక్ష తరువాత, ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులను న్యాయస్థానం యొక్క అధికార పరిధికి వెలుపల ఉన్న పరిస్థితులుగా గుర్తించి తోసిపుచ్చడం జరిగింది. ఐసిసికి 123 సభ్య దేశాల మద్దతు ఉందని చెపుతున్నా, ఐసిసి ఒక న్యాయ వ్యవస్థగా రోమ్ స్టాచ్యూట్‌కు కట్టుబడి, స్వతంత్రంగా, నిష్పాక్షికంగా పని చేస్తుందని ప్రకటిస్తున్నా, లక్ష్య సాధనకు బహుదూరంలో ఉంది. అమెరికా ఆంక్షల నీడలు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) మీద కూడా పడడం, సభ్య దేశాల సహకార లోపం తదితర కారణాలతో ఆశించిన ఫలితం రావడం లేదు.




# విలక్షణ నటుడు రంగనాథ్

ఒక విలక్షణమైన నటునిగా, హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా, కవిగా రచయితగా దర్శకుడిగా తెలుగు ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందారు రంగనాథ్ గా సుపరిచితులయిన తిరుమల సుందర శ్రీరంగనాథ్. అవకాశం చేతులోకి వచ్చీ, సమయాను కూలంగా లేక రెండు సినిమాలలో హీరోగా నటించే అవకాశం కోల్పోవడం, రెండు చిత్రాలలో నటించిన ఇరువురు హీరోలుగా దూసుకు వెళ్ళిన సంఘటనలను రంగనాథ్ పలు సందర్భాలలో వెల్లడించే వారు. రంగనాథ్ కుటుంబంలో ఎవరు సినీ నేపథ్యం ఉన్న వారు కారు. తాతగారి ఇంట్లో ఆయన పెరిగిన వాతావరణం ఆయనను కళాకారుడిగా మారేలా చేసింది. తాతగారి ఇంట్లో అందరూ గాయకులు కావడంతో రంగనాథ్ కూడా ఏదో ఒక కళలో రాణించాలి అనే భావించ గా, చిన్నతనంలో నాటకరంగం వైపు దృషి నిలిపి, అనేక నాటకాలలో వివిధ పాత్రలను వేసారు.

అక్కడినుంచి సినీరంగం వైపు రావాలనే ఆకాంక్ష మొదలైంది. తల్లి ప్రోత్సాహం కూడా తోడైంది.

రంగనాథ్ తల్లి జానకి గాయని కావాలనుకునే వారట. అదే టైమ్‌లో ఎస్.జానకి కూడా గాయని అయ్యారు. కొన్ని కారణాల వల్ల ఆవిడ కోరిక నెరవేరక పోవడంతో కొడుకు అయినా ఆర్టిస్టు కావాలనుకుంది. దక్షిణాది సినీ రాజధానిగా ఉన్న చెన్నై నగరంలో 1949లో జూలై 17న టి.ఆర్.సుందరరాజన్, జానకీదేవి దంపతులకు జన్మించిన రంగనాథ్, 1969లో బుద్ధిమంతుడు సినిమాతో తొలిసారి వెండితెరపై కనిపించారు. చందన (1974) చిత్రంలో హీరోగా ప్రేక్షకుల ముందుకొచ్చారు. ఆయన తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం నుండి డిగ్రీ చేశారు. రైల్వేశాఖలో టికెట్ కలెక్టర్‌గా కొంతకాలం పనిచేశారు. బాపు తీసిన అందాల రాముడులో రాముని వేషానికి అయాచితంగా , అనూహ్యంగా అవకాశం తలుపు తట్టింది. అదే సమయంలో గిరిబాబు ఆయనను హీరోగా పెట్టి సినిమా తీయాలని అనుకున్నారు. దానిలో నటిస్తున్న సమయాన హీరో అవకాశాలు తప్పిపోయాయి. రెండు సినిమాలు చేజారి పోయాయి. 'ఇద్దరూ ఇద్దరే'లో కృష్ణంరాజు, నటించి పైకొచ్చారు. 'భారతంలో అమ్మాయి'లో మురళీమోహన్ హీరోగా చేసి క్లిక్ అయ్యారని రంగనాథ్ పలు సందర్భాలలో చెపుతుండే వారు. అలా 1969లో బుద్ధిమంతుడు సినిమాతో వెండితెరకు పరిచయమై సుమారు 300 సినిమాలలో నటించాడు. హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ నటుడిగా సినిమా ప్రేక్షకులను మెప్పించారు. మొగుడ్స్ పెళ్లామ్స్ చిత్రానికి దర్శకత్వం వహించారు. కొన్ని టీ.వీ.సీరియళ్లలో కూడా నటించారు. ఎక్కువగా కుటుంబ కథా చిత్రాల్లో నటించటం ఆయనను మహిళ ప్రేక్షకులకు దగ్గర చేసింది. కానీ సినీ రంగంలో వచ్చిన మార్పులు కారణంగా కెరీర్ స్టార్టింగ్ లోనే ఒడిదుడుకులు వచ్చాయి. దీంతో మరో మార్గం లేక విలన్ గా మారారు. 'గువ్వల జంట' సినిమాతో తొలి సారిగా ప్రతి నాయక పాత్రలో అలరించారు. ఆ తరువాత క్యారెక్టర్ ఆర్టిస్ట్ గాను మెప్పించారు. వెండితెర మీదే కాదు.. బుల్లి తెర మీద కూడా తన నటనతో ఆకట్టుకున్నారు. రంగనాథ్ పౌరాణిక నేపథ్యంతో తెరకెక్కిన భాగవతం సీరియల్ తో పాటు, రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన శాంతినివాసం సీరియల్ లోనూ కీలక పాత్రలో నటించారు. రంగనాథ్ నటుడే కాదు మంచి కవి, రచయిత కూడా. వీరు రచించిన కవితా సుదర్శనం, అంతరంగ మథనం, ఈ చీకటి తొలగాలి, పద పరిమళం, అక్షర సాక్ష్యం, రంగనాథ్ కథలు, రంగనాథ్ నడత పుస్తకాలు అచ్చయ్యాయి. సినీరంగంతో అనుబంధాన్ని కొనసాగిస్తున్న ఆయన అర్థాంతరంగా డిసెంబరు 19, 2015 న హైదరాబాదు లోని తన స్వగృహంలో ఆత్మ హత్యకు పాల్పడి లోకాన్ని వదిలి వెళ్లారు.

# ఘనంగా ఇందిరా శక్తి సంబరాలు



కొత్తకోట మండల జూలై 16వృదయం ప్రతినిధి): కేంద్రంలోని బుధవారం రాయల్ ఫంక్షన్ హాల్ లో కొత్తకోట మరియు మదన పోదాం ఉమ్మడి మండల కేంద్రాలలో ఘనంగా ఇంద్ర శక్తి సంబరాలు జరుపుకున్నారు

ముఖ్యఅతిథిగా దేవరకద్ర నియోజవర్గం ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంద్ర శక్తి సంబరాలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందని ఇవేగాక అన్ని రంగాలలో మహిళలకు రిజర్వేషన్లు తో ముందుకు వెళు న్నారని ఆయన అన్నారు కార్యక్రమానికి వనపర్తి జిల్లా కలెక్టర్ శ్రీ ఆదర్శ్ సురభి హాజరయ్యారు మహిళలకు చెక్కు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు మరియు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్, జూలై 16వృదయం (ప్రతినిధి): మంచిర్యాల పట్టణంలోని రాంనగర్ కు చెందిన ఆటో డ్రైవర్ కలీం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. రాంనగర్ కు చెందిన శ్రీనివాస్ వద్ద ఐదు నెలల క్రితం 50,000 కలీం అప్పుగా తీసుకున్నాడు. చెల్లించడంలో జాప్యం జరగడంతో శ్రీనివాస్ అసభ్యకరంగా మాట్లాడేమే కాకుండా కుటుంబ సభ్యులను బెదిరించాడు. అంతేకాకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తానని బెదిరించడంతో మనస్థాపానికి గురై ఆల్ అవుట్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

# పంచాయతీ రికార్డుల లెక్క పక్కాగా నమోదు చేయాలి

బోథ్, జూలై 16వృదయం (ప్రతినిధి): గ్రామపంచాయతీ రికార్డుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని ఎంపీఓ గోవర్ధన్ అన్నారు. బుధవారం దిలావర్పూర్ మండలం సమందర్ పల్లి గ్రామపంచాయతీ కార్యాలయమును ఆయన సందర్శించారు. అన్ని రికార్డులను పరిశీలించి పంచాయతీ కార్యదర్శి కి పలు సూచనలు చేశారు. అనంతరం అంగన్వాడి కేంద్రం, ఇందిరమైన నిర్మాణాలను, శానిటైజేషన్ పనులను పరిశీలించారు. పిల్లలకు శుభ్రమైన సూచికమైన ఆహారం అందించాలని పేర్కొన్నారు.

# మరికల్ విద్యుత్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మరికల్ మండల జూలై 16వృదయం ప్రతినిధి): కేంద్రంలోని బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు సాయిబాబా సమావేశంలో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగుల ఆర్టిజన్ సమస్య వెంటనే పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగ సంఘం 1104 ఉద్యోగుల నియామకం చేపట్టాలని ఆయన అన్నారు విద్యుత్ ఉద్యోగులకు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు పదోన్నతులు లేక ఉద్యోగులు ఇంక్రిమెంట్లు నష్టపోతున్నారని ఆయన అన్నారు వెంటనే ప్రభుత్వం స్పందించి విద్యుత్ ఉద్యోగులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు



## విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేత

నిర్మల్, జూలై 16వృదయం (ప్రతినిధి):పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర కీలకమని దండేపల్లిలోని జడ్పీ పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ అన్నారు. ఆ పాఠశాలకు చెందిన చాలామంది విద్యార్థులు 'అమ్మ పేరుతో ఒక మొక్క'కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. దీంతో ఆ విద్యార్థులను అభినందిస్తూ కేంద్ర ప్రభుత్వం నుండి ప్రశంసా పత్రాలు వచ్చాయి.

బుధవారం మొక్కలు నాటిన విద్యార్థులకు పాఠశాల ఆవరణలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రశంసా పత్రాలు అందజేశారు.

## బ్లాక్ మార్కెట్ కు వెళ్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

నారాయణఖేడ్, జూలై 16వృదయం (ప్రతినిధి): బ్లాక్ మార్కెట్ కు వెళు న్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లై విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. నారాయణఖేడ్ ఏఎస్ నగర్ లో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేందుకు నిల్వ ఉంచిన 60 సంచుల రేషన్ బియ్యాన్ని, ఆరు మోపెడ్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు, విజిలెన్స్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఎస్టీయు సభ్యత్వ నమోదు కార్యక్రమం

దుబ్బాక, జూలై 16వృదయం (ప్రతినిధి): సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలంలోని ధర్మారం, కాసులాబాద్, కొండాపూర్, మిరుదొడ్డి, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఎస్టీయు ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు బుధవారం చేసింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాడ శ్రీధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి 75 సంవత్సరాల పైగా కృషి చేస్తున్న సంఘం ఎస్ టి యు అని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని, పెండింగ్ బిల్లు విడుదల చేయాలన్నారు.

## ఉపాధ్యాయులను నియమించాలని డీఈఓ కు వినతి



వెల్దండ జూలై 16 (వృదయం ప్రతినిధి) మండల పరిధిలోని అజిలాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్తులు బుధవారం నాగర్ కర్నూల్ లో జిల్లా విద్యాధికారి రమేష్ ను కలిసి వినతి పత్రం అందజేశారు.. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ ఏడాది నుంచి 8వ తరగతి కి అప్ గ్రేడ్ చేయడం జరిగిందన్నారు. దీంతో విద్యాబోధన కోసం తెలుగు, ఇంగ్లీష్, సైన్స్, హిందీ సబ్జెక్టులకు టీచర్స్ లేకపోవడంతో విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని, వెంటనే నలుగురు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కేశమౌని పద్మ, గ్రామస్తులు సిద్ధగోని రమేష్ గౌడ్, కేశమౌని కృష్ణయ్య గౌడ్, కొప్పు కృష్ణయ్య, కుర్వాపూర్ కుమార్, కొప్పుల రామస్వామి, కొప్పుల యాదయ్య,వెంకటయ్య జంగయ్య తదితరులు ఉన్నారు.

# రేచినీలో ఎస్ టి యూ సభ్యత్వ నమోదు

## 75 సంవత్సరాలుగా ఉపాధ్యాయ సమస్యలపై ఎస్టీయూ కృషి సంఘం జిల్లా అధ్యక్షులు భట్టారి వెంకటేశ్వర్లు

బెల్లంపల్లి, జులై 16 (వృదయం ప్రతినిధి)తాండూరు మండలం రేచిని జిల్లా పరిషత్ పాఠశాలలో రాష్ట్రోపాధ్యాయ(ఎస్ టి యూ) సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు భట్టారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం( ఎస్ టి యూ) విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల సాధనకై75 సంవత్సరాలుగా అలుపెరగని కృషి చేస్తుందని తెలిపారు.



ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్మెంట్ పారదర్శకంగా చేయాలని , పాఠశాల స్థాయిలో కాంప్లెక్ ప్రధానోపాధ్యాయులు , మండల స్థాయిలో మండల విద్యాధికారులు , జిల్లా స్థాయిలో జిల్లా విద్యాధికారి ఉపాధ్యాయుల వృత్తిపరమైన పనులను వెనువెంటనే పూర్తిచేయాలని కోరారు. ఉద్యోగ ,

ఉపాధ్యాయులకు రావాల్సిన డిఏ లను పీఆర్సీ ను వెంటనే ప్రకటించి సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు స్థానిక సంస్థల ఎన్నికల కన్నా ముందే ఉపాధ్యాయుల బదిలీలు , ప్రమోషన్లు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నూతన 5 ఎం వి ఏ ట్రాన్స్ఫారం ఏర్పాటు



వెల్దండ జూలై 16 (వృదయం ప్రతినిధి) మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ లో గత గత వారం రోజుల క్రితం కాలిపోయిన5 ఎం వి ఏ ట్రాన్స్ఫారం స్థానంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాలతో మంజూరు చేయించిన నూతన ట్రాన్స్ఫార్మర్ను బుధవారం ఏర్పాటు చేశారు

ఈ మేరకు విద్యుత్ సరఫరా లో ఎలాంటి అంతరాయం లేకుండా ఉంటుందని విద్యుత్ శాఖ లైన్మెన్ లక్ష్మణ్ నాయక్ తెలిపారు విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఆల్ ఇండియా చదరంగం పోటీల్లో పారడైజ్ విద్యార్థుల ప్రతిభ





కరీంనగర్ 16 (వృదయం ప్రతినిధి): ప్యారడైజ్ పాఠశాల విద్యార్థులు ఈనెల 12, 13 తేదీల్లో జిల్లాల్లో జరిగిన ఆలిండియా జూనియర్ ఓపెన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల చైర్మన్ డా?? పి. ఫాతిమా రెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన ఎల్ . విగ్నేష్ ,ఎ. శశివర్ధన్, ఎల్ అనుదీప్,ఎమ్. అనన్య శ్రీ, ఎ. నవదీర్, ఎమ్.డి. ఆరిఫ్ పతకాలు, సర్టిఫికెట్లు సాధించగా ఎమ్ .విగ్నేష్ ట్రోఫీ సాధించినట్లు చైర్మన్ తెలిపారు .ఇట్టి విద్యార్థులను బుధవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమ%శీ%లో అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ డా?? పి .ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ చదరంగం ద్వారా విద్యార్థులకు జ్ఞాపకశక్తి ,ఏకాగ్రత పెరిగి ఒత్తిడి తగ్గుతుందని చదరంగం ఆట యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పి. ఫాతిమా రెడ్డి ప్రిన్సిపాల్ టీ. వసంత, వైస్ ప్రిన్సిపాల్ మధు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# భారతదేశం మొట్టమొదటి లాంగ్ డిస్టెన్స్ రోబోటిక్ బేరియాట్రిక్ టెలి సర్జరీతో భారతదేశం సర్జికల్ శకానికి నాంది

హైదరాబాద్ - జూలై 16, 2025 - ఇండియా ప్రెసిడెంట్ బేరియాట్రిక్, రోబోటిక్ సర్జన్లలో మార్గదర్శకుడు డాక్టర్ మోహిత్ భండారి ప్రపంచంలోని మొదటి సుదూర రోబోటిక్ బేరియాట్రిక్ టెలి సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు, ఇది ప్రపంచ సర్జరీ సంరక్షణ యాక్సెస్ లో కొత్త భవిష్యత్తును పునర్నిర్వచించే మైలురాయి. గురుగ్రామ్ లోని రోబోటిక్ కన్సోల్ ఉపయోగించి డాక్టర్ భండారీ గారు 850 కిలోమీటర్లకు పైగా ఇండోర్ లో ఉన్న ఒక రోగిపై సంక్లిష్టమైన గ్యాస్ట్రిక్ బైపాస్ ను నిర్వహించారు- జీరో పర్సెప్టిబుల్ ల్యాగ్ పూర్తి శస్త్రచికిత్స ఖచ్చితత్వంతో అమలు చేశారు. కొత్త తరం, భారతదేశంలో అభివృద్ధి చేసిన రోబోటిక్ శస్త్రచికిత్స ప్లాట్ఫామ్ అయిన ఎస్ఎస్ఐ మంత్ర ఎం 3 వ్యవస్థను ఉపయోగించి ఈ ప్రక్రియ జరిగింది. మెడికల్ రోబోటిక్స్ డిజిటల్ ఆరోగ్యంలో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న సామర్థ్యాలను హైలైట్ చేయడమే కాకుండా, అధిక-కష్టం ఉన్న డొమైన్లలో రిమోట్ గా దూరం నుంచి శస్త్రచికిత్స సంరక్షణ కోసం కొత్త ప్రపంచ ప్రమాణాలను స్థాపించింది. ఈ మైలురాయి ఆపరేషన్ రెండు ప్రధాన భారతీయ నగరాల మధ్య సుదూర రోబోటిక్ బేరియాట్రిక్ టెలిసర్జరీ యొక్క మొదటి డాక్యుమెంట్ కేసును సూచిస్తుంది, ఇది అధిక-కష్టం ఉన్న రంగాలలో రిమోట్ గా చాలా దూరం నుంచి శస్త్రచికిత్సకు కొత్త ఉదాహరణను ఏర్పరుస్తుంది. మెడికల్ రోబోటిక్స్, ఇన్నోవేషన్, డిజిటల్



హెల్త్ లో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నాయకత్వాన్ని ఇది హైలైట్ చేస్తుంది. 30,000 బేరియాట్రిక్ మెటబాలిక్ విధానాలను చేసిన డాక్టర్ భండారీ, ఈ ప్రత్యేకతలో ఆసియా-పసిఫిక్ లోనే అత్యంత అనుభవజ్ఞుడైన సర్జన్. అతను రోబోటిక్ బేరియాట్రిక్ శస్త్రచికిత్సను భారతదేశానికి పరిచయం చేశాడు సింగిల్-అనాస్టోమోసిస్ డుయోడెనల్-ఇలియాల్ స్విచ్ చేసిన మొదటి భారతీయ సర్జన్ ఈయన. ఇటీవల, వాషింగ్టన్ డి.సి.లో జరిగిన గ్లోబల్ కాంగ్రెస్ (జూన్ 2025) లో ఇంటర్నేషనల్ సర్జన్ అవార్డుతో గౌరవించబడ్డాడు- శస్త్రచికిత్స ఆవిష్కరణలో ట్రయల్ బ్లేజర్ గా అతని ఖ్యాతిని మరింత బలోపేతం చేసింది. దీనిపై డాక్టర్ మోహిత్ భండారీ మాట్లాడుతూ, "శస్త్రచికిత్స చేయడంలో విప్లవాత్మకంగా మార్చడంలో రోబోటిక్ టెలిసర్జరీ యొక్క పరివర్తన సామర్థ్యానికి ఈ విజయం నిదర్శనం, నిపుణులైన శస్త్రచికిత్సలు అదే సమయంలో ఇతర భౌగోళిక ప్రాంతాలలో పనిచేయడానికి వీలు కల్పిస్తుంది పట్టణ ప్రాంతీయ సంరక్షణ కేంద్రాలను నిరాటంకంగా అనుసంధానం చేస్తుంది. భారతదేశం అంతటా మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా శస్త్రచికిత్సా నైపుణ్యానికి యాక్సెస్ ను ఎలా అందుబాటులోకి తీసుకురావాలో ఇది ఒక మంచి ఉదాహరణ". ఈ మైలురాయి ఒక టెక్నాలజీ విజయం కంటే ఎక్కువ- ఇది అధునాతన శస్త్రచికిత్స సంరక్షణను ఎలా అందించవచ్చో మొదటి మార్పును సూచిస్తుంది:

భౌగోళికంగా దూరం ప్రాంతాలలో ఉన్న శస్త్రచికిత్స నిపుణులకు శస్త్రచికిత్స చేయడానికి వీలు కల్పించడం ద్వారా పట్టణ-గ్రామీణ అంతరాన్ని తగ్గించడం మారుమూల ప్రాంతాలలో చికిత్స సమయాన్ని తగ్గించడం ద్వారా రోగి ఫలితాలను మెరుగుపరచడం

సంరక్షణ యొక్క టెక్నాలజీ-ఆధారిత నమూనాల ద్వారా శస్త్రచికిత్సా నైపుణ్యాన్ని పెంచడం

సురక్షితమైన ఖచ్చితమైన టెలిసర్జరీలో గ్లోబల్ బెంచ్ మార్క్ లను సృష్టించడం

# ఎండిపోతున్న వరి నారు

ముథోల్, జూలై 16వృదయం ప్రతినిధి):జన్నారం మండలంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో వరినారు ఎండిపోతోంది. మండలంలోని తపాలాపూర్, తిమ్మాపూర్, రాంపూర్, చింతగూడ, పోన్కల్, టిజిపల్లి, కిష్టాపూర్, కవ్వాల్, దేవుని గూడెం గ్రామాలలో రైతులు పొలాల్లో వరి నారు వేశారు. అయితే వర్షాలు సరిగ్గా పడకపోవడం, కడెం ప్రాజెక్టు నుండి సాగునీటిని విడుదల చేయకపోవడంతో నారు ఎండిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటిని విడుదల చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరారు.

# పత్తి పంట పై రైతులకు అవగాహన

కాసిపేట జులై 16 (వృదయం విలేకరి)



కాసిపేట మండలంలో లోని మల్కేపల్లి గ్రామంలో పత్తి పంటను సందర్శించి రైతులకు ఎరువుల యాజమాన్యం చీడపీడల సస్యరక్షణ చర్యల పై అంతర పంటల పై రైతులకు అవగాహన కల్పించిన వ్యవసాయ అధికారి సి ఎచ్ ప్రభాకర్. పత్తిలో మోతాదుకు మించి ఎరువులు వాడవద్దని అధికంగా ఎరువులు వాడడం వలన చీడపీడలు ముఖ్యంగా రసం పీల్చే పురుగులు ఆశించే అవకాశం ఉందని సూచించారు సిఫార్స్ మేరకే యూరియా వాడాలని అలాగే యూరియాకు బదులుగా నానో యూరియా ప్లస్ వాడాలని, నానో యూరియా ప్లస్ వాడడం వలన పంట దిగుబడి నాణ్యతను పెంచుతుంది అని తెలిపారు, పోషక వినియోగ సామర్థ్యం అధికంగా ఉంటుంది, చీడపీడలు తెగులు ఉధృతిని తగ్గిస్తుందని, పత్తి పంటలో వచ్చే చీడ పీడా లు తెగుల్ల పైన అవగాహన కల్పించారు, పత్తి లో అంతర పంటగా కంది పంట సాగు చేయాలని, రైతులు రైతు గుర్తింపు కార్డు కోసం ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, పట్టా పాస్ పుస్తకం లేకుండా భూమి సాగు చేస్తున్న రైతులు పంట వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు

# మహిళా ఉన్నతి-ప్రగతికి సోపానం


గజ్వేల్, జూలై 16వృదయం (ప్రతినిధి): ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా గజ్వేల్ ప్రభుత్వ హాస్పిటల్లో మహిళా సమైక్య ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ వీఓఏలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మహిళా ఉన్నతి-ప్రగతికి సోపానం అని మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఇంటిల్లిపాది ఆరోగ్యంగా ఉంటారన్నారు. ముఖ్యంగా మహిళల్లో రక్తం తక్కువగా ఉంటుందని, జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

## తునికి నల్ల పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక హారతి

మెదక్, జూలై 16వృదయం (ప్రతినిధి): తునికి నల్ల పోచమ్మ అమ్మవారిని బుధవారం ప్రత్యేకంగా అలంకరించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ కౌడిపల్లి మండల పరిధిలోని తునికి గ్రామంలోని తునికి నల్ల పోచమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతలను నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

# వైద్య సిబ్బంది రోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలి

## జిల్లా కలెక్టర్ బి.ఎమ్. సంతోష్





గద్వాల జూలై 16 (వృదయం ప్రతినిధి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ ఆదేశించారు. మంగళవారం ధరూర్ మండలంలోని ఉప్పేరు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం-ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలో ఆరోగ్య సిబ్బంది హాజరు రిజిస్టర్, ప్రసవాల రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్, తదితర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి రిజిస్టరులో సక్రమంగా పూర్తి వివరాలతో నమోదు చేయాలని సూచించారు. ఆసుపత్రికి ప్రతి రోజు రోగులు ఎంతమంది వస్తున్నారు. ఇన్ పేషంట్స్ వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని, విధుల్లో సమయపాలన కచ్చితంగా పాటించాల్సిందిగా ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన కల్పించి, గర్భిణుల నార్మల్ ప్రసవాలు నిర్వహించి, ప్రసవాల సంఖ్యను గణనీయంగా పెంచాలని ఆదేశించారు. ప్రతి గర్భిణి ప్రసవ తేదీకి అనుగుణంగా డెలివరీ క్యాలెండర్ను ఖచ్చితంగా రూపొందించి, అవసరమైన వైద్య సదుపాయాలు సమయానికి అందించాలని అన్నారు. అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఈ ప్రాంతానికి ఒక ఆంబులెన్స్ ను త్వరితగతిన కేటాయిస్తామన్నారు. వర్షాకాలం లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఫార్మసిస్టు మందుల నిల్వలను జాగ్రత్తగా పర్యవేక్షిస్తూ, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. టీకాలు ఖచ్చితంగా షెడ్యూల్ ప్రకారం సమయానికి వేయాలని సూచించారు.

ఆరోగ్య సేవల నాణ్యతను మెరుగుపరచడం కోసం ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది పూర్తి బాధ్యతతో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి సిద్దప్ప, డాక్టర్లు రాజు, కృష్ణవేణి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సీజన్‌లో విషజ్వరాలను అరికట్టాలి

ఆర్మూర్,జూలై 16వృదయం (ప్రతినిధి):ప్రగశీల మహిళా సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆర్మూర్ మండల కేంద్రంలోని రెవెన్యూ డివిజన్ అధికారి ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, మెమోరాండాన్ని ఆర్డీఓకి ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పిఒడబ్ల్యు ఉమ్మడి సంయుక్త జిల్లా ఉపాధ్యక్షురాలు వి. సత్తెమ్మ మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ ప్రారంభం కాగానే విష జ్వరాలు విస్తృతంగా వ్యాపిస్తున్నాయి అన్నారు.

# రాష్ట్ర గవర్నర్‌కు ఘన స్వాగతం

నిజామాబాద్, జూలై 16వృదయం (ప్రతినిధి):నిజామాబాద్ జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం ఉదయం 11. 05 గంటలకు డిచ్ పల్లిలోని పోలీస్ బెటాలియన్ కు చేరుకున్నారు. గవర్నర్ కు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం, బెటాలియన్ గెస్ట్ హౌస్ ఆవరణలో ఉన్నతాధికారులతో కలిసి గవర్నర్ మొక్కలు నాటారు.

## కామారెడ్డి జిల్లాలో వ్యక్తి దారుణ హత్య

కామారెడ్డి, జూలై 16వృదయం (ప్రతినిధి): బిచ్కుంద మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. 36 ఏళ్ల అడికే రమేష్ను, పెద్ద దేవాడ గ్రామానికి చెందిన గుండెవార్ కాశీనాథ్ కమ్మ కత్తితో మెడపై నరికి హత్య చేశాడు. రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. భూ తగాదా లేదా అక్రమ సంబంధమే కారణమా అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు.

# వల్లంపల్లి రోడ్డుపై సొంత ఖర్చులతో మొరం వేసాం.

- కన్నెత్తి చూడని అధికారులు
-వల్లంపల్లి టిప్పర్ యజమానుల ఆరోపణ
-రోడ్డు నిర్మాణానికి త్వరలో శ్రీకారం ఉట్కూరు ఏఈ అజయ్ రెడ్డి




నారాయణపేట జూలై 16( వుదయం ప్రతినిధి) ఉట్కూరు మండలం వల్లంపల్లి గ్రామానికి మూడు కిలోమీటర్ల రోడ్డును టిప్పర్లు సొంత ఖర్చులతో మొరం వేశామని ఆ గ్రామ టిప్పర్ల యజమానులు అంటున్నారు. రోడ్డు విషయంపై ఎన్నోసార్లు మంత్రి దృష్టికి తీసుకుపోయామని వారు తెలిపారు. కాగా ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మొరం వేయండి తర్వాత నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి టిప్పర్ల యజమానులతో చెప్పినట్లు వారు వుదయం ప్రతినిధికి తెలిపారు. కాగా రోడ్డుపై మొరం వేసి 15 రోజులు గడుస్తున్న ఏ ఒక్క అధికారి కూడా రోడ్డు వైపు కన్నెత్తి చూడలేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మంత్రి సంబంధిత అధికారులు మొరం వేసిన రోడ్డు పనులు పరిశీలించి నిధులు మంజూరు చేయాలని టిప్పర్ యజమానులు కోరుతున్నారు. రోడ్డు నిర్మాణానికి త్వరలో శ్రీకారం.ఉట్కూరు ఏఈ అజయ్ రెడ్డి ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద త్వరలో వల్లంపల్లి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు ఉట్కూర్ ఏఈ అజయ్ రెడ్డి వుదయం ప్రతినిధికి ఫోన్ ద్వారా బుధవారం తెలిపారు. గత ఏడాది క్రితం ఎమ్మెల్యే ఎస్డిఎఫ్ నిధుల కింద నాలుగు లక్షల 50 వేల రూపాయలు మంజూరు అయ్యాయని ఈ నిధులతో ప్రస్తుతం టిప్పర్లతో మొరం రోడ్డు వేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ఏడాది పాటు గ్రామానికి ఈ నిధులను వాడుకోలేదని ప్రస్తుతం వర్షాకాలం సందర్భంగా మొరంతో తాత్కాలిక రోడ్డు వేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా రోడ్డు నామ మాత్రమే వేశారు కదా మూడు కిలోమీటర్ల రోడ్డుకు ఎన్ని టిప్పర్ల మొరం వేస్తారు అనే ప్రశ్నకు ఇంకా లెక్క పెట్టలేదు అని ఆయన సమాధానం ఇచ్చారు. రోడ్డు వేసేందుకు ప్రధానమంత్రి సడక్ యోజన పథకం కింద ప్రతిపాదనలు పంపించినట్లు మరో సంవత్సరంలోపు ఈ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం రోడ్డుకు వేసిన మొరం టిప్పర్ల యజమానులు సొంత ఖర్చులతో వేయలేదని ఎమ్మెల్యే నిధుల కిందనే మొరం వేసినట్లు ఆయన వివరణ ఇచ్చారు.

# ఆయిల్ పామ్ పంట సాగుతో అధిక లాభాలు

-జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
-వేలేరు మండలం గుండ్ల సాగర్ గ్రామంలో ఆయిల్ పామ్ పంట మొదటి కోత ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్

హనుమకొండ, జూలై 16(వుదయం జిల్లా ప్రతినిధి) : ఆయిల్ పామ్ పంట సాగుతో అధిక లాభాలు ఉన్నాయని, రైతులు ఈ పంటను సాగు చేసేందుకు ముందుకు రావాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. బుధవారం హనుమకొండ జిల్లా వేలేరు మండలం గుండ్ల సాగర్ గ్రామంలో 12 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తున్న మంద సారంగపాణి అనే రైతు తన పంట క్షేత్రంలో ఆయిల్ పామ్ గెలల మొదటి కోత కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, అధికారులు, స్థానిక రైతుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటకు ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు. మిగతా పంటల కంటే ఆయిల్ పామ్ పంటకు రైతులకు మంచి గిట్టుబాటు అయ్యే ఆదాయం లభిస్తుందన్నారు. వరి, ఇతర పంటలకు ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తూ అధిక ఆదాయాన్ని పొందవచ్చు అని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహకాలు ఉన్నాయని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ పంట సాగుతో స్థిరమైన ఆదాయం రైతులకు లభిస్తుందన్నారు. అకాల వర్షాలు వడగండ్లు, కోతుల బెడద,పందుల బెడద ఈ పంటపై ప్రభావం చూపదని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ పంట సాగు చేస్తున్న రైతులను ఆదర్శంగా తీసుకొని మిగతా రైతులు ఆ పంట సాగు దిశగా ముందుకు సాగాలన్నారు. వరి సాగులో నీటి వినియోగం ఎక్కువ అని, అదే ఆయిల్ పామ్ పంట సాగులో నీటి వాడకం తక్కువగా ఉంటుందన్నారు. అధిక విస్తీర్ణంలోఆయిల్ పామ్ పంటను సాగు చేసిన రైతు మంద సారంగపాణిని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా



ఆయిల్ పామ్ గెలల కోత కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కొబ్బరికాయను కొట్టి ప్రారంభించారు. పంట కోతను పరిశీలించారు. ఆయిల్ పామ్ పంటను సాగుచేసిన రైతు మంద సారంగపాణి కి కలెక్టర్ చేతుల మీదుగా చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల ఉద్యాన శాఖ అధికారులు అనసూయ, శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, హనుమకొండ డివిజన్ ఉద్యాన శాఖ అధికారి సుస్మిత, కే ఎన్ బయోసైన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ జిల్లా మేనేజర్ రంజిత్ కుమార్, తహసిల్దార్ సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, వ్యవసాయ అధికారులు, వేలేరు, ధర్మసాగర్ భీమదేవరపల్లి, హసన్ పర్తి, ఐనవోలు, కాజీపేట, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాలకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

# మోసం చేస్తున్న సీడు పత్తి కంపెనీలు, ఆర్గనైజర్లు

-రోడ్డుపై ధర్నా చేసిన రైతులు



అలంపూర్ జూలై 16 (వుదయం ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లాలో సీడ్ పత్తి రైతులకు కొన్ని కంపనీలు, ఆర్గనైజర్లు గతంలో ఇచ్చిన మాదిరిగానే రెండు నెలల క్రితమే ఫౌండేషన్ సీడ్ విత్తనాలు ఇవ్వడం జరిగింది. రైతులు విత్తనం విత్తి దాదాపు 45 నుంచి 50 రోజులు కావడంతో ఇప్పుడు అవి పూత దశలో ఉన్న పత్తి మొక్కలను తొలగించాలని కంపెనీలు, ఆర్గనైజర్లు చెప్పడంతో రైతులు తమ ఆత్మ స్థైర్యాన్ని కోల్పోయి ఆవేదనతో రోడ్డెక్కి దర్నాకి దిగారు. అయిజ మండలం బింగిదొడ్డి స్టేజిలో నాగర్ దొడ్డి, తూముకుంట, దేవబండ, తాటికుంట, రావుల చెర్వు తదితర గ్రామాలకు చెందిన రైతులు అయిజ, గద్వాల్ వెళ్ళే రోడ్డు పై బైఠాయించి రైతులు నిరసన తెలిపారు. దీనితో ట్రాఫిక్ రెండు వైపుల మూడు కిలో మీటర్ల వరకు స్తంభించింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సీడ్ పత్తి ఆర్గనైజర్లు, కంపెనీలు ఒక్క ఎకరాకు 2 క్వింటాల విత్తనాలు మాత్రమే తీసుకుంటామని తెలిపారు. గత సంవత్సరం క్రితం సీడ్ పత్తి రైతుల దగ్గర ఎన్ని క్వింటాలు పంట వస్తే అన్ని క్వింటాలు కొనేవారని, ఇప్పుడు మాత్రం కొనుక్కోమని తేల్చి చెప్పడంతో మేము తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు ఇచ్చే ముందు ఈ విషయం తెలిపిన రైతులు ఎవరు విత్తనాలు తీసుకునేవారం కాదని తెలిపారు. కావున మాకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. రైతులకు భారతీయ జనతా పార్టీ, బి ఆర్ ఎస్ పార్టీ మద్దతు తెలుపుతూ రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో జ్యోతి ఆ ప్రాంతానికి చేరుకొని రైతులతో మాట్లాడుతూ కలెక్టర్ కు సమస్య గురించి వివరించామని తెలిపారు. గురువారం సీడ్ ఆర్గనైజర్ లతో మీటింగ్ ఏర్పాటు చేసి సమస్య గురించి చర్చిస్తామని తెలిపిన రైతులు వినడం లేదని తెలిపారు. కలెక్టర్ వచ్చి సమస్యను పరిష్కరించే వరకు ధర్నాను విరమించే ప్రసక్తే లేదని రైతులు తెగేసి చెప్పారు. డిఎస్పీ మొగులయ్య అదనపు కలెక్టర్ తో మాట్లాడిన తర్వాత రైతులు శాంతించి ధర్నాను విరమించారు. ఈ ధర్నాకు బిజెపి, బి ఆర్ ఎస్, పార్టీలు మద్దతు తెలిపాయి. ఎటువంటి సంఘటనలు జరుగకుండా సిఐ టాటా బాబు, ఎస్ ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పర్యవేక్షించారు. ఈ ధర్నాతో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# పారదర్శకంగా ప్రజలకు న్యాయం అందించాలి!

-పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
-కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సందర్శించిన సిపి

హనుమకొండ, జూలై 16(వుదయం జిల్లా ప్రతినిధి) : పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులకు పోలీస్ అధికారులు పారదర్శకంగా న్యాయం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ కాజీపేట పోలీస్ అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం కాజీపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. తనిఖీలకై పోలీస్ స్టేషన్ చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి పూలమొక్కను అందజేసి స్వాగతం పలకగా సాయుధ పోలీసులు సీపీకి గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ పోలీస్ సిబ్బంది నిర్వహించిన పరేడ్ తో పాటు కిట్ ఆర్టికల్స్ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా సీపీ పోలీస్ స్టేషన్ రిసెప్షన్, సిసిటిఎన్ఎస్ విభాగాల పనీతీరును సంబంధిత పోలీస్ సిబ్బందిని సిపి అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు, పెండిరగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులకు సంబంధించి పోలీస్ కమిషనర్ క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అలాగే స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు, అనుమానితులు,కేడీ,డిసిలు, మిస్సింగ్, ఆస్తి నేరాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించిన పోలీస్ కమిషనర్ సిబ్బందిని శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని కలిగించడంతో పాటు, పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలంటే ప్రతి పోలీస్ ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలి. ప్రజల సమస్యలకు తక్షణ



స్పందనతోపాటు, మర్యాదపూర్వకంగా వారి ఫిర్యాదులు ఆలకించాల్సిన బాధ్యత అందరిపై ఉంది" అని సీపీ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా,కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, కాజీపేట ఎస్.ఐలు నవీన్‌కుమార్,లవణ్‌కుమార్,శివ పాల్గొన్నారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ బుధవారం కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ల నిర్వహిస్తున్న పలు రికార్డును సిపి పరిశీలించడంతోపాటు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో స్వాధీనం చేసుకున్న వాహనాలను పార్కింగ్ ఏర్పాట్లు, సిబ్బందిపనితీరుపై కూడా పోలీస్ కమిషనర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకన్నను అడిగి తెలుసుకున్నారు

# విత్తనపత్తి రైతుల ధర్నాకు మద్దతు తెలిపిన

-బిఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య



అలంపూర్ జూలై 16 (వుదయం ప్రతినిధి) విత్తన పత్తి రైతుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం అయిజ మండలం బింగిదొడ్డి స్టేజ్ దగ్గర రైతులు పెద్ద ఎత్తున చేరుకుని రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. వారికి మద్దతుగా బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య చేరుకొని బీఆర్ఎస్ పార్టీ పక్షాన రైతులకు సంపూర్ణ మద్దతు తెలిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య మాట్లాడుతూ నడిగడ్డ ప్రాంతంలో గత 40 సంవత్సరాల నుంచి విత్తన పత్తి రైతులకు ఆర్గనైజర్లు మధ్యవర్తులు దళారులు తీవ్ర అన్యాయం చేస్తూ వస్తున్నారు. ఫౌండేషన్ సీడ్ ఇచ్చేటప్పుడు లేని అగ్రిమెంటు దాదాపు పంట క్రాసింగ్ కి వచ్చే సమయంలో ఎకరాకు రెండు క్వింటాల్లే కొంటామనడం దారుణమన్నారు. ఎకరాకు దాదాపు 6 క్వింటాలు దిగుబడి వస్తుంది. మరి మిగతా పాటయి విత్తనాలు ఎవరు కొంటారని అన్నారు. గత నెల రోజుల కింద కాంగ్రెస్ ప్రభుత్వం రైతు కమిషన్ జిల్లా కేంద్రానికి చేరుకొని రైతులకు న్యాయం చేస్తామని చెప్పి, ఈరోజు నట్టేట ముంచడమంటే ఈ ప్రాంతం రైతులను నాశనం చేయడమే అని అన్నారు. రైతులు నష్టాలు చవిచూసి పొలాన్ని అమ్ముకుంటుంటే మరి ఏమి లేని ఆర్గనైజరు వందల ఎకరాల భూమి, కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. ఇది నడిగడ్డ ప్రాంతంలో జరుగుతున్న భారీ దోపిడీ. రైతులకు న్యాయం జరగని పక్షంలో భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నామని డిమాండ్ చేశారు.

# విత్తన పత్తి రైతుల ధర్నాకు మద్దతు తెలిపిన

-బిఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య

అలంపూర్ జూలై 16 (వుదయం ప్రతినిధి) విత్తన పత్తి రైతుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం అయిజ మండలం బింగిదొడ్డి స్టేజ్ దగ్గర రైతులు పెద్ద ఎత్తున చేరుకుని రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. వారికి మద్దతుగా బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య చేరుకొని బీఆర్ఎస్ పార్టీ పక్షాన రైతులకు సంపూర్ణ మద్దతు తెలిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య మాట్లాడుతూ నడిగడ్డ ప్రాంతంలో గత 40 సంవత్సరాల నుంచి విత్తన పత్తి రైతులకు ఆర్గనైజర్లు మధ్యవర్తులు దళారులు తీవ్ర అన్యాయం చేస్తూ వస్తున్నారు. ఫౌండేషన్ సీడ్ ఇచ్చేటప్పుడు లేని అగ్రిమెంటు దాదాపు పంట క్రాసింగ్ కి వచ్చే సమయంలో ఎకరాకు రెండు క్వింటాల్లే కొంటామనడం దారుణమన్నారు. ఎకరాకు దాదాపు 6 క్వింటాలు దిగుబడి వస్తుంది. మరి మిగతా పాటయి విత్తనాలు ఎవరు కొంటారని అన్నారు. గత నెల రోజుల కింద కాంగ్రెస్ ప్రభుత్వం రైతు కమిషన్ జిల్లా కేంద్రానికి చేరుకొని రైతులకు న్యాయం చేస్తామని చెప్పి, ఈరోజు నట్టేట ముంచడమంటే ఈ ప్రాంతం రైతులను నాశనం చేయడమే అని అన్నారు.



రైతులు నష్టాలు చవిచూసి పొలాన్ని అమ్ముకుంటుంటే మరి ఏమి లేని ఆర్గనైజరు వందల ఎకరాల భూమి, కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. ఇది నడిగడ్డ ప్రాంతంలో జరుగుతున్న భారీ దోపిడీ. రైతులకు న్యాయం జరగని పక్షంలో భవిష్యత్తులో బిఆర్ఎస్ పార్టీ పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నామని డిమాండ్ చేశారు.

# విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి!

-కేయూ రిజిస్ట్రార్



హనుమకొండ, జూలై 16(వుదయం జిల్లా ప్రతినిధి) : ఆధునిక సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం ప్రతి వ్యక్తికి అవసరము అయిందని, విద్యార్థులు డిగ్రీ తోపాటు సాంకేతిక నైపుణ్యత పై అవగాహన కలిగి ఉండాలని కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం అన్నారు. బుధవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ని భౌతిక శాస్త్ర విభాగంలో ఎల్ఈడి బల్బులు తయారు చేసే విధానంపై నిర్వహించిన రెండు రోజుల వర్క్ షాప్ ప్రారంభ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సమావేశానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుంకరి జ్యోతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రామచంద్రం మాట్లాడుతూ మారుతున్న సమాజంపై టెక్నాలజీ ప్రభావం చాలా తీవ్రంగా ఉందని ప్రతిదీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు పోతున్నామని, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యతను పెంపొందించుకుంటే తమకు తాముగా నిలదొక్కుకోవడానికి దోహదపడుతుందన్నారు. డిగ్రీలతో ఉద్యోగ అవకాశాలు చాలా తక్కువ అని ఎంబిబిఎస్ చదివినప్పటికీ వల్ల ఏదన్న ఒక ప్రత్యేక విభాగంపై ఎండి చేస్తేనే డాక్టర్ వృత్తికి ఉపయోగం ఉంటుందన్నారు. సాధారణ బిఎసి డిగ్రీతో ఉద్యోగ అవకాశాలు దొరకడం చాలా కష్టమని, కాబట్టి సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ తో కు పరిశ్రమలు స్థాపించుకోవడానికి ఇటువంటి నైపుణ్య శిక్షణ మీకు ఎంతో దోహదపడుతుంది ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని , ప్రభుత్వ ఉద్యోగాలు దొరకడం ఈ రోజులలో చాలా కష్టంగా ఉంది కాబట్టి ఏదో ఒక రంగంలో విద్యార్థులు నైపుణ్యత కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజిక్స్ (భౌతిక శాస్త్ర) విభాగం ఇంచార్జ్,వర్క్ షాప్ కన్వీనర్ ఆచార్య వరలక్ష్మి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రెహమాన్ మాట్లాడుతూ ఫిజిక్స్ విభాగం నిర్వహించిన ఈ రెండు రోజుల సాంకేతిక శిక్షణ తరగతులను విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈసీఐఎల్ పూర్వ ఉద్యోగి మల్లేశం ఎల్ఈడీ బల్బులు తయారు చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు డాక్టర్ జితేందర్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ ఏ సరిత, డాక్టర్ బి సరిత, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ కర్ణాకర్, డాక్టర్ నాగయ్య డాక్టర్ ఆదిరెడ్డి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ.

-జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్

కోరుట్ల జూలై 16 (వుదయం ప్రతినిధి) మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పాఠశాల తరగతి గదిలో పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించాలని శుభ్రంగా ఉంచాలని అదేవిధంగా మధ్యాహ్న భోజనాన్ని గ్యాస్ పొయ్యి మీదనే చేయాలని వంట సరుకులను ఎప్పటికప్పుడు నాణ్యతతో పరిశీలించాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు అదేవిధంగా కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు బోధించే విద్యా విధానాలను పరిశీలించారు ఉపాధ్యాయులు బోధించే విధానం విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు జిల్లాలో మొదటి స్థానం సాధించాలని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు అదేవిధంగా కిచెన్ గార్డెన్లో కూరగాయ మొక్కలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు జిల్లా కలెక్టర్ పరిశీలన తర్వాత బోధనలో గాని పాఠశాల రెడీ నెస్ శ్రీశీ గాని పిల్లల సౌకర్యాల ఏర్పాట్లు గాని ఎట్టి పొరపాటు లేకుండా తక్షణమే



చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులందరని ఆదేశించారు పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన తప్పకుండా పాటించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తో పాటు మెట్పల్లి రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీనివాస్ మల్లాపూర్ మండల తహసిల్దార్ రమేష్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి ప్రావిణ్యా, జిల్లా కలెక్టర్.

**–గౌతమ్ నగర్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రం ను తనిఖీ చేసిన కలెక్టర్.**

సంగారెడ్డి జిల్లా, పటాన్చెరు టౌన్‌జులై 16 (వుదయం ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలలో సమర్థులైన ఉపాధ్యాయులు ఉన్నారని, వారు విద్యార్థులకు ప్రాణ్యమైన విద్యను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. బుధవారం పటాన్చెరు లోని గౌతమ్ నగర్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రం ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హాజరు రిజిస్టర్, స్టోరూమ్ షోరూమ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని ప్రీ ప్రైమరీ విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రీ ప్రైమరీ విద్య ద్వారా ఆంగ్ల భాష పై విద్యార్థులకు పట్టువచ్చేలా చర్యలు తీసుకున్నది అన్నారు. ప్రాథమిక దశ నుండి ఆంగ్ల విద్యను బోధించడం ద్వారా కార్పొరేట్ పాఠశాలలవిద్యార్థులతో సమానంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల లోవిద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజ, పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

# ఈవిఎమ్ స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలి



గద్వాల జూలై 16 (వు దయం ప్రతినిధి) ఈవీఎంల భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని, కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఈఓ, ఈవీఎం నోడల్ అధికారి హరి సింగ్ పేర్కొన్నారు. బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల గోదాములో ఎలక్ట్రిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎం) లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ను రాష్ట్ర స్థాయి బృందం డిప్యూటీ కలెక్టర్ (సీఈఓ కార్యాలయం) ఎస్.చెన్నయ్య, ఈవీఎం కన్సల్టెంట్ ప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సాధారణ తనిఖీలో భాగంగా ఈ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ భద్రత, ప్రవేశ నియమాలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, నమోదు పత్రాలు మొదలైన అన్ని అంశాలపై సమగ్రంగా పర్యవేక్షణ చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఈఓ హరి సింగ్ మాట్లాడుతూ ఈవీఎంల భద్రత విషయంలో ఎంత మాత్రం నిర్లక్ష్యం లేకుండా, ఎన్నికల కమిషన్ జారీ చేసిన అన్ని మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని అన్నారు. స్ట్రాంగ్ రూమ్ లోపల, బయట భద్రతా ఏర్పాట్లు సమగ్రంగా ఉండాలన్నారు. నిరంతర సీసీ కెమెరా పర్యవేక్షణ జరుగుతుండాలని సూచించారు. ప్రతి రికార్డులో అన్ని వివరాలు స్పష్టంగా అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అలివేలు, గద్వాల తహసిల్దార్ మల్లికార్జున్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్, సురేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అటల్ టింకిల్ ల్యాబ్ శిక్షణ



నారాయణపేట టౌన్ జూలై 16(వుదయం ప్రతినిధి) ఆవిష్కరణలకు అటల్ టింకల్ ల్యాబ్ విద్యార్థులకు ఉపయోగపడాలని జిల్లా సైన్స్ అధికారి హెచ్ భాను ప్రకాష్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దిరిపాడులో అటల్ టింకల్ ల్యాబ్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మక ఆవిష్కరణ అటల్ టింకల్ ల్యాబ్లు చాలా దోహదపడాలని జిల్లాలో రెండు కేంద్రాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మరికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెదిరిపాడు కేంద్రాలలో 2 రోజుల శిక్షణ కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఈ కేంద్రాలలో పీఎం శ్రీ పాఠశాలల నుండి ముగ్గురు ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమానికి హాజరు అయ్యారు. ఈ శిక్షణ కార్యక్రమం రెండు రోజులు ఉంటుందని ఆయన తెలిపారు. 2 రోజుల శిక్షణ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శిక్షణ పొందినటువంటి ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రయోగాలు చేయించి వారికి ఉపయోగపడేటట్లు ఉండాలని తెలియజేశారు. ఈ యొక్క శిక్షణ కార్యక్రమంలో 9 పాఠశాల నుండి 27 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీఎల్ డిస్టిక్ కోఆర్డినేటర్ అరుణ్, శ్రీనివాన్,పురుషోత్తం, వివేక్ పాల్గొన్నారు.

# వర్షాలు రాక ఆందోళన చెందుతున్నరైతులు



గద్వాల జూలై 16 (వుదయం ప్రతినిధి)జోగులాంబ గద్వాల జిల్లా లో మే నెలలో ముందస్తు వర్షాలు కురవడంతో ఆనందం వ్యక్తం చేస్తూ రైతులు భూమిని దుక్కి దున్ని సాగుకు సన్నద్ధం చేశారు. ఇందులో భాగంగా జూన్ నెలలో వేరుశనగ కంది, ఉల్లి, కొర్ర, సజ్జ, పత్తి, ఆముదాలు సాగు చేశారు. సాగు చేసిన అనంతరం కొన్ని రోజులుగా చినుకు జాడ కనపడకపోవడంతో వేసిన పంటలు వాడి పోతుండడంతో రైతులు నష్టపోతున్నారు. ఎండలు కూడా పెరగడంతో మొలచిన మొలకలు ఎండి పోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఒక ఎకరాకు 10 వేలు నుండి 20వేల రూపాయల వరకు ప్రస్తుతం పెట్టుబడి పెట్టామని రైతులు వాపోతున్నారు. ఇంకో పది రోజులు వర్షం రాకపోతే పంటలన్నీ ఎండిపోతాయని కావున వ్యవసాయ అధికారులు పొలాలను సందర్శించి రైతులకు తగిన సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు.

# సిపిఐ జిల్లా మహాసభలకు ముస్తాబైన మధిర

**–సిపిఐ జిల్లా మహాసభలకు ఏర్పాట్లు పూర్తి:సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు**



మధిరజూలై 16 (వుదయం ప్రతినిధి): ఈనెల 19,20 తేదీల్లో మధిర పట్టణం రెడ్డి గార్డెన్ లో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఖమ్మం జిల్లా 23వ జిల్లా మహాసభలకు మధిర పట్టణం ముస్తాబైంది. పార్టీ జిల్లా మహాసభల్లో భాగంగా సభను జయప్రదం చేయాలని బుధవారం పార్టీ శ్రేణులు మధిర పరిధిలోని ఆత్కూరు రింగ్ సర్కిల్ ఏరియా నుండి అంబేద్కర్ సెంటర్ వరకు జెండాలు, తోరణాలు,ఫ్లెక్సీలతో నగరాన్ని ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు మాట్లాడుతూ, జిల్లా మహాసభలకు సంబంధించి గత వారం రోజులుగా పార్టీ కార్యకర్తలతో కలిసి ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. దేశ ప్రజల సామాజిక,రాజకీయ,ఆర్థిక హక్కుల కోసం వందేళ్లుగా సుదీర్ఘమైన పోరాటాలను నడిపించిన సీపీఐ వందేళ్ళ స్ఫూర్తితో ఖమ్మం జిల్లా మహాసభలను జయప్రదం చేయడం కోసం పార్టీ శ్రేణులు సన్నద్ధమయ్యారు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బోనకల్లు మండల కార్యదర్శి యంగల ఆనందరావు,జిల్లా నాయకులు ఎంఏ రహీం, తలారి రమేష్,జల్లా బ్రహ్మం, అన్నవరపు సత్యనారాయణ,రంగు నాగ కృష్ణ,కొండూరినాగేశ్వరరావు,మల్లారం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

**–మాజీ ఎంపీపీ అమ్మ కోళ్ళ శ్రీనివాస్ రెడ్డి**



నారాయణపేట టౌన్ జూలై 16(వుదయం ప్రతినిధి) రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నారాయణపేట మాజీ ఎంపిపి అమ్మకోళ్ళ శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వైఖరి చూస్తుంటే మళ్ళీ బిసి లని మోసం చేసే కుట్రగా స్పష్టమవుతున్నదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు పై రాష్ట్ర ప్రభుత్వం లోనే స్పష్టత లేదన్నారు. ఆర్డినెన్సు ఎప్పుడు తీస్తారో చెప్పకుండానే రిజర్వేషన్లు అమలు అయ్యాయని సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే బిసి రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ ను తొక్కి పెట్టడానికే కాంగ్రెస్ జిమ్మిక్కులు చేస్తున్నదని విమర్శించారు.

## మృతుని చిత్రపటానికి పూలమాలు వేసిన సొసైటీ పర్సన్ ఇంచార్జ్ చైర్మన్ రామస్వామినాయక్.



ఖానాపురం జులై 16 (వుదయం ప్రతినిధి): మండలంలోని అశోక్ నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపెల్లి రవీందర్ రావు తండ్రి తక్కళ్లపెల్లి ఆగరావు ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందగా మృతుని చిత్రపటానికి సొసైటీ పర్సన్ ఇంచార్జ్ చైర్మన్ గూగులోతు రామస్వామినాయక్ పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుడిపూడి నాగేశ్వర్ రావు, యాదగిరిరావు, నారాయణరావు, తక్కలపల్లి ప్రవీణ్ రావు తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ పాఠశాల ఆకస్మికంగా తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



జయశంకర్ భూపాలపల్లి జులై 16(వుదయం ప్రతినిధి) మహాదేవపూర్ లోని కేజీబీవీ పాఠశాలను కాటారం సబ్ కలెక్టర్ మాయాంక్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు బుధవారం మహాదేవపూర్ మండలంలో పర్యటించిన సబ్ కలెక్టర్ మాయాంక్ సింగ్ కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి స్కూల్ పిల్లలతో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి మెనూ, స్టాక్ వివరాలు మరియు హాస్టల్ వసతి వివరముల గురించి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఉపాధ్యాయులతో విద్యా బోధన, హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ గురించి చర్చించారు పాఠశాలకు వచ్చిన విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు, ఒకవేళ ఏమైనా సమస్యలు ఉంటే సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమలో మహాదేవపూర్ డిప్యూటీ తహసీల్దార్, క్రిష్ణ పాల్గొన్నారు.

# ఘనంగా పోచమ్మ తల్లి విగ్రహా ప్రతిష్టపణ



బెల్లంపల్లి, జులై16 (వుదయం ప్రతినిధి)నెన్నెల ఆవడం గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహం ప్రతిష్టపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా మహిళలు పోచమ్మ బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామస్థులు,ఇతరుల సహకారంతో నూతనంగా పోచమ్మ తల్లి గుడి నిర్మించి దేవతనను ప్రతిష్టింప చేశారు. పోచమ్మ తల్లి ప్రతిష్టపన తో పాటు మధునపు పోచమ్మ, పోతురాజుల విగ్రహాలను ప్రతిష్టింప చేశారు. మేకలను కోసి సహాపర్తి భోజనం చేశారు. శని,ఆదివారాల్లో పోచమ్మ గ్రామ కొలుపు కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో పోచమ్మ తల్లి కమిటీ సభ్యులు,గ్రామస్థులు,యూత్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# భవిష్యత్ తరాల కోసమే వనమహోత్సవం

**–జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే**



జయశంకర్ భూపాలపల్లి జులై 16(వుదయం ప్రతినిధి)భవిష్యత్తు తరాల సంక్షేమమే వన మహోత్సవ కార్యక్రమ లక్ష్యమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించగా, పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్పీ మొక్కలు నాటారు ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమంలో జిల్లా పోలీసులు ముందుండాలని, అన్ని పోలీసు స్టేషన్లలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని ఆదేశించారు. అలాగే సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పేర్కొన్నారు. ప్రకృతికి అందం మొక్కలేననీ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పీ ఏ. నరేష్ కుమార్, వర్టికల్ డిఎస్పి నారాయణ నాయక్, జిల్లా పరిధిలోని సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కాకరవాయి గ్రామంలో పల్లె దావఖానా ఆరోగ్య వైద్య శిబిరం.

**–ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ డాక్టర్ వసుంధర.**



జులై 16 (వుదయం ప్రతినిధి):తిరుమలాయపాలెం మండలంలోని కాకరవాయి గ్రామంలో బుధవారం రోజు నిర్వహించిన ఆరోగ్య శిబిరాన్ని ఖమ్మం జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ పరిశీలించారు. ఈ ఆరోగ్య శిబిరం సుబ్లేడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి. వసుంధర నేతృత్వంలో నిర్వహించబడింది. శిబిరంలో గ్రామస్తులకు ఉచిత వైద్య సలహాలు, మలేరియా, టైఫాయిడ్ , రక్త పరీక్షలు, జ్వర పరీక్షలు నిర్వహించి, మందుల పంపిణీ వంటి సేవలు అందించబడ్డాయి. అనంతరం జిల్లా వైద్యాధికారి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం బీరోలు ను పరిశీలించారు. ఈ సందర్భంగా జ్వరాల సర్వే, డ్రై డే చర్యలు, డెంగ్యూ నివారణ చర్యలు, సికిల్ సెల్ స్క్రీనింగ్, ఆరోగ్య డేటా ఆన్‌లైన్ అప్డేషన్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో వైరల్ జ్వరాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరం అని ఆయన సూచించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి. వసుంధర మాట్లాడుతూ, "డెంగ్యూ కేసులు వర్షాకాలంలో పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇంటి చుట్టూ మురుగు నీరు నిల్వ ఉండనీయకుండా చూడాలి. వాటర్ ట్యాంకులు, కూలర్లు, ఖాళీ డబ్బాలు, తీసివేసిన టైర్లు , కొబ్బరి బొండాలు వగైరా లాంటి వాటిల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా మన చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని . దోమల నివారణకు మశరీలు, కాయిళ్లు వాడాలని . జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలోని వైద్యాశాలకి వచ్చి వైద్య సాయం తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యురాలు డాక్టర్ నిరీష, పంచాయతీ కార్యదర్శి శ్రీ అంజి, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మానవ మనుగడకు చెట్లు ఎంతో ముఖ్యం!

**–అసిస్టెంట్ డైరెక్టర్ పద్మనాభ స్వామి**



హనుమకొండ, జూలై 16(వుదయం జిల్లా ప్రతినిధి) : పర్యావరణ పరిరక్షణకు, మానవ మనుగడకు చెట్లు ఎంతో ముఖ్యం అని జాతీయ గణాంక కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ పద్మనాభ స్వామి అన్నారు. జాతీయ గణాంక కార్యా లయం 75 వ వార్షికోత్సవ సందర్భంగా భారత ప్రభుత్వము యొక్క జాతీయ గణాంక కార్యాలయము అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ పద్మనాభ స్వామి వరంగల్ గారు సిబ్బంది తో కలిసి ఈరోజు హనుమకొండ లష్కర్ బజార్ యందు ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల ప్రాంగణములో రావి, నేరేడు, వేప వంటి నీడనిచ్చే చెట్ల కోసము, వాటి మొక్కలను నాటి, వారి సామాజిక బాధ్యతను చాటుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ మనుగడ, అనంత జీవుల మొనగడకు చెట్లు ఎంతో ముఖ్యమైనదని అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమములో సీనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు బిక్రమ్ సింగ్, శ్రవణ్ తదితర అధికారులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భముగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులకు జ్ఞాపికగా గోడ గడియారమును బహుకరించారు.

# రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీకి విద్యార్థిని ఎంపిక



జన్నారం, జూలై 15(వుదయం విలేకరి) జిల్లా స్థాయిలో నిర్వహించిన కామిక్ వ్యాసరచన పోటిల్లో కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి ఆకుల అనన్య జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న తెలిపారు. మాదకద్రవ్యాలు,చెడు వ్యసనాలకు బానిస కాకుండా వాటికీ దూరంగా ఉండాలనే అంశంపై జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన, కామిక్ డ్రాయింగ్ పోటీలలో పాల్గొన్న అనన్య మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థినిని గైడ్ టీచర్స్ దాముక కమలాకర్,డి.మణెమ్మ,జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య,ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, మండల విద్యాధికారి ఎన్.విజయ్ కుమార్,జిల్లా కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి,అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ మంగ,ఉపాధ్యాయులు అభినందించారు.

# సిరిపురంలో పత్తి పంటను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారులు.



మధిర జూలై 16 (వుదయం ప్రతినిధి) జిల్లా వ్యవసాయ అధికారి ఖమ్మం డి. పుల్లయ్య ఆధ్వర్యంలో మధిర మండలంలోని సిరిపురం గ్రామంలో పత్తి పంట పరిశీలించడం జరిగింది. సిరిపురం గ్రామంలో నానో యూరియా క్షేత్ర ప్రదర్శన నిర్వహించడం జరిగింది దీనిలో భాగంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ నానో యూరియా వాడకం వలన మొక్కకు పోషకాలు ఎక్కువ మోతాదులో అందుతాయని,నానో యూరియా వాడకం వలన ఖర్చు తక్కువగాను,నానో యూరియా వాడటం వలన పర్యావరణ కాలుష్యం తక్కువగా ఉంటుందని, నానో యూరియాను ఎంపిక చేసిన కలుపు మందులలో కలిపి పిచికారి చేయవచ్చునని రైతులకు వివరించడం జరిగింది. మధిర రైతు వేదికలో ఏఈఓ,ఏఓలకు ఆయిల్ పామ్ పంటపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ విజయ్ చంద్ర, వ్యవసాయ అధికారి కే సాయి దీక్షిత్, వ్యవసాయ విస్తరణ అధికారులు వేణు,గురుమూర్తి రైతులు పాల్గొనడం జరిగింది.

# టీబీని వ్యాధిని నిర్మూలించడలో ప్రైవేటు వైద్యుల సహకారం ఎంతో అవసరం

**-జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జులై 16(ఉదయం ప్రతినిధి) జిల్లాలో టీబీని వ్యాధిని నిర్మూలించడలో ప్రైవేటు వైద్యుల సహకారం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. బుధవారం ఐడిఓసీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, సింగరేణి వైద్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో టిబిని నిర్మూలించడంలో ప్రైవేటు వైద్యుల పాత్ర ఎంతో అవసరమని అన్నారు. జిల్లాలో టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలంటే ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థతోపాటు ప్రైవేట్ వైద్యుల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. జిల్లాలో 95 వేల మందికి టిబి పరీక్షలు చేయడం లక్ష్యం కాగా ఇప్పటి వరకు 1695 మందికి పరీక్షలు నిర్వహించారని తెలిపారు. జూన్ 9 జిల్లాలో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని 100 రోజుల్లో 95 వేల మందికి టిబి పరీక్షలు చేయాల్సి ఉన్నదని, ఐదు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్స్ రే కేంద్రాలున్నాయని, వీటి వల్ల నిర్ణీత వ్యవధిలో పరీక్షలు పూర్తి చేయలేకపోతున్నామని కాబట్టి ప్రయివేటు వైద్యులు, ఎక్స్ రే కేంద్రాల నిర్వాహకులు సహకారం అందించాలని సూచించారు. టీబీ వ్యాధి గ్రస్థులను త్వరితగతిన గుర్తించి వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. టీబీ నిర్ధారణలో ఎక్స్ రే, నాట్ పరీక్షలు చేయాల్సి ఉందని తెలిపారు. అలాగే గుర్తించిన కేసులను డిజిటల్ నిక్షేపణ యాప్ లో నమోదు చేయాలని, వ్యాధి గ్రస్థులకు పోషకాహారం అందించే లక్ష్యంతో నిక్షయ పోషణ యోజనకు మద్దతు ఇవ్వాలని వైద్యులను కోరారు. ప్రయివేట్ ఆసుపత్రుల్లో చికెన్ గున్యా, మలేరియా, టైఫాయిడ్ సోకిన వ్యక్తులను గుర్తించిన వారి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల సమాచారం మేరకు రోగి నివసించే ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేపట్టి, మెడికల్ క్యాంపులు నిర్వహించి వ్యాధి వ్యాప్తి నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డా నవీన్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా వెంకటేశ్వర్లు, ఇంఛార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా శ్రీదేవి, డా ఉమారాణి, ఐఎంఏ ప్రెసిడెంట్ డా కిరణ్ కుమార్, సింగరేణి సూపరింటెండెంట్ డా గోపి, రెడ్ క్రాస్ చైర్మన్ శ్రీనివాస్, డెమో శ్రీదేవి, ఎక్స్ రే యూనిట్లు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించండి

**-బిజెపి పట్టణ అధ్యక్షులు కంపాటి భగత్ రెడ్డి**



అలంపూర్ జూలై 16 (ఉదయం ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో బిజెపి పట్టణ అధ్యక్షులు కంపాటి భగత్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, ప్రజలతో కలిసి ప్రధాన రహదారిని సందర్శించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ అపోలో ఫార్మసీ దగ్గరలో మనం చూస్తున్నట్లయితే రోడ్డుకు మధ్యలో కరెంటు స్తంభం ఉన్నది. ఇది ఒకటే కాకుండా ప్రధాన రహదారిపై అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్నూలు, రాయచూరు ప్రధాన చౌరస్తా వరకు సుమారు 20 నుంచి 30 కరెంటు స్తంభాల వరకు రోడ్డుకు మధ్యలో ఉన్నవి. వాటిని తొలగించి రోడ్డును వెడల్పు చేయవలసిందిగా అధికారులను మీడియా ద్వారా కోరారు. ఇలా ఉండడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నవి. ఏదేని ప్రమాదం జరిగితే వారి కుటుంబాలకు ఎవరు బాధ్యులు అని అన్నారు. ప్రభుత్వానికి, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ కి, రోడ్డుకు మధ్యలో ఈ స్తంభాలు కనిపించడం లేదని అన్నారు. భారతీయ జనతా పార్టీ జోగులాంబ గద్వాల జిల్లా నాయకులతో కలిసి 01/03/2025 నాడు, జిల్లా ఎస్ ఈ. కార్యాలయంలో సూపరెంట్ ఆఫ్ ఇంజనీర్ ని కలిసి, పరిస్థితిని వివరించి, వారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. కానీ ఎలాంటి చలనం లేదని విమర్శించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్లయితే, ప్రధాన రహదారిపై ఉన్నటువంటి సుమారు 20 నుంచి 30 కరెంటు స్తంభాలను తొలగించాలన్నారు.

ప్రభుత్వం వెంటనే విద్యుత్ స్తంభాలను తొలగించకపోతే, భారతీయ జనతా పార్టీ తరఫున ప్రజల కోసం రోడ్ల పైన ధర్నాలు చేపడతామని, ఈ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అయిజ పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్, ఓబుల్ రెడ్డి, పట్టణ ఓబిసి మోర్చా అధ్యక్షులు బి.వెంకటేష్, బూత్ అధ్యక్షులు కే రాజశేఖర్, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక భద్రతకు ప్రజాప్రభుత్వం కృషి: పెద్దపల్లిలో ఘనంగా ఇందిరా మహిళా శక్తి ఉత్సవాలు



పెద్దపల్లి, జూలై 16 (ఉదయం ప్రతినిది): పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం రోజు నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి ఉత్సవాలు జ్ఞాపకాలకెక్కాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, దాసరి అనసూయ (సీతక్క), శ్రీధర్ బాబు, సెర్ప్ సీఈఓ డి.దివ్య, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులను ప్రారంభించడమేకాక, వడ్డీ లేని రుణాల చెక్కులు, ప్రమాద బీమా మరియు లోన్ బీమా చెక్కులను మహిళలకు పంపిణీ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎన్నికల హామీలను అమలు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా మహిళల పేరుతో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. పామాయిల్ సాగుకు ఎకరానికి నాలుగు సంవత్సరాలలో రూ. 51 వేలు సబ్సిడీగా ఇస్తామని చెప్పారు. పెద్దపల్లిలో తిరుమలాయ సంస్థ పామాయిల్ ఫ్యాక్టరీను నిర్మించనుందని తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా సంఘాలకు రూ. 26 వేల కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించామని, స్వయం సహాయక సంఘాల ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళా సంఘాల సభ్యులు 99 శాతం రుణాలు తిరిగి చెల్లిస్తున్నారని కొనియాడారు. ప్రతి గ్రామంలో దివ్యాంగుల సంఘాలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డ్రోన్ వ్యాపారాల్లోనూ మహిళల్ని ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ శ్రీ హర్ష వివరించారు: జిల్లాలో 16,800 మహిళా సంఘాలకు రూ. 15.74 కోట్ల వడ్డీ సబ్సిడీ అందించామని, 67 మంది సభ్యులకు ప్రమాద బీమా కింద రూ. 87 లక్షల ఆర్థిక సహాయం చేశామని తెలిపారు. ఎమ్మెల్యే విజయరమణా రావు తెలిపారు: పెద్దపల్లి నియోజకవర్గంలో 4521 సంఘాలకు రూ. 4.94 కోట్ల వడ్డీ లేని రుణాలు, 514 సంఘాలకు రూ. 11.75 కోట్ల స్త్రీనిధి పంపిణీ చేశామన్నారు. ఆర్టీసీ అద్దె బస్సుల ద్వారా మొదటి నెలలో వచ్చిన ఆదాయం రూ. 3.47 లక్షలుగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, మండల సమాఖ్యలు, మహిళా సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగి మరింత మంది మహిళలకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని నాయకులు పేర్కొన్నారు.

# స్వచ్ఛమైన గాలి కావాలంటే మొక్కలు నాటాలి.

**-వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన తహసిల్దార్ నంగునూరి రమేష్.**



ఖానాపురం జులై 16 (ఉదయం ప్రతినిధి): ప్రజలకు స్వచ్ఛమైన గాలి కావాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తాహసిల్దార్ నంగునూరి రమేష్ తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పరిధిలోని వనమహోత్సవంలో భాగంగా నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు గ్రామస్తులు గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి తహసిల్దార్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి తహసిల్దార్ మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న వాహనాలతో వాతావరణం కలుషితం అవుతుందని తక్షణమే ప్రజలందరూ మేల్కొని ప్రతి ఒక్కరు ఒక మొక్కలు నాటి దాన్ని సంరక్షించుకునే బాధ్యత మొక్కను నాటిన వ్యక్తి తీసుకోవాలని తెలిపారు, అనంతరం గ్రామస్తులకు పలురకాల పూల మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్కే ముస్తఫా, కార్యదర్శి సట్ల సుప్రజ, అంగన్వాడి టీచర్ మల్లికాంబ, జిపి అటెండర్ షఫీ గ్రామపంచాయతీ సిబ్బంది ఆశా కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారుల పొలం బాట



లక్షెట్టిపేట, జులై 16 (ఉదయం ప్రతినిధి) విద్యుత్ అధికారులు బుధవారం పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని గంపలపల్లిలో విద్యుత్ శాఖ ఎస్ఈ ఉత్తం తోపాటు విద్యుత్ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ... రైతులు పొలంలోని మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవడం వలన నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు. ఏమైనా విద్యుత్ సమస్య వచ్చినప్పుడు సొంతంగా మరమ్మతులు చేయవద్దన్నారు. ఏమైనా సమస్య ఉంటే విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఈ కైసర్, ఏడిఈ ప్రభాకర్, ఏఈ గణేష్, ఎల్ఐ రవికుమార్, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డిఎమ్ హెచ్ఓ.

**-సీజనల్ వ్యాధులపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి.**



పరకాల జులై 16 (ఉదయం ప్రతినిధి): హనుమకొండ డిఎంహెచ్ ఓ డాక్టర్ అప్పయ్య రాయపర్తి పీహెచ్సీ పరిధిలో పర్యటన చేశారు. మొదట ఆరోగ్య ఉప కేంద్రము నార్లాపూర్ మరియు చర్లపల్లి ఆరోగ్య ఉప కేంద్రాలను సందర్శించి సార్వత్రిక వ్యాధి నిరోధక కార్యక్రమాలు ఎలా జరుగుతున్నాయని పరిశీలించారు. ఉపకేంద్రం నకు వచ్చిన లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను రిపోర్టులను పరిశీలించారు. నార్లాపూర్ సబ్ సెంటర్లో విద్యుత్తు సౌకర్యం లేదని సిబ్బంది సార్ దృష్టికి తీసుకురావడం జరిగింది. విద్యుత్ సౌకర్యము త్వరలోనే పునరుద్ధరించేటట్టుగా చేస్తానని డిఎంహెచ్ఓ హామీ ఇచ్చారు. తదనంతరము చర్లపెల్లి ఉపకేంద్రమును సందర్శన చేసి ఉపకేంద్రంలో అందుతున్న ఆరోగ్య సేవలను అక్కడికి వచ్చిన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఉప కేంద్రంలో మరియు గ్రామాల్లో అందుతున్న సేవలను సరైన రికార్డులలో పొందుపరచాలని ప్రజలకు అందుబాటులో వుండాలని ఆదేశించారు. తదనంతరము ప్రతి బుధవారము ప్రతి పి హెచ్సి లో నిర్వహిస్తున్న సిబ్బంది సమావేశమునకు రాయపర్తి పీహెచ్సీకి అటెండ్ కావాలని తగు ఆదేశాలను ఇచ్చారు. సీజనల్ వ్యాధులపై సిబ్బంది అప్రమత్తం గా వుండాలని అన్నారు. ప్రతి ఆశ కార్యకర్తలు మరియు హెల్త్ అసిస్టెంట్ లు ఏఎన్ఎం లు ప్రతి రోజు గృహ సందర్శన చేసి ఫీవర్ కేసులకు చికిత్స అందించాలని అన్నారు. కంఠత్మకూర్ గ్రామం లో ఎక్కువ ఫీవర్ కేసులు వస్తున్నాయని వెంటనే స్పెషల్ ఫీవర్ సర్వే చేపట్టి చికిత్స అందించాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రతి మహిళ గర్భిణీ స్త్రీ ప్రభుత్వ హాస్పిటల్లో డెలివరీ అయ్యే విధంగా బర్త్ ప్లానింగ్ చేయాలని ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. టిబి ముక్తు భారత్ ప్రోగ్రాంలో భాగంగా రేపు అనగా 17 జులై 18 జులై మరియు 19 తేదీలలో పరకాల సివిల్ హాస్పిటల్ లో టీబీ లక్షణాలు గలవారికి మరియు టీబీ వ్యాధి బారిన పడే గ్రూపుల ను వారిని గుర్తించి ముఖ్యంగా గత ఐదు సంవత్సరాలలో టీబీ మందులు వాడిన వారికి వారి కుటుంబ సభ్యులకు మరియు వారితో కాంటాక్ట్ ఉండే కుటుంబ సభ్యులకు, డయాబెటిక్ వ్యాధి మందులు వాడే వారికి పొగాకు మద్యపానము సేవించే వారికి గుర్తించి వారిని పరీక్ష నిమిత్తం మోటివేట్ చేసి పరకాల సివిల్ హాస్పిటల్ లో వైద్య పరీక్షలకు తీసుకురావాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. పరకాల సివిల్ హాస్పిటల్ లో వచ్చే మూడు రోజులు నిర్వహించే టీబీ పరీక్షలను క్యాంపులను ప్రజలు అత్యధికంగా వినియోగించుకొని అవసరం ఉన్నవారికి ప్రైవేట్ హాస్పిటల్ లో పరీక్షలు చేసేందుకు సిద్ధం చేసామని అన్నారు. ఎక్రే మరియు ఇతర పరీక్షలు ఆరోగ్య సేవలను పొందవలసిందిగా ప్రజలను కోరారు. ఈ కార్యక్రమం లో రాయపర్తి పీహెచ్సీ వైద్యాధికారిని డాక్టర్ కొక్కొండ దివ్య మరియు పల్లె దావకాన డాక్టర్లు సూపర్వైజర్లు ఏఎన్ఎంలు హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# పరకాలలో పలు సమస్యలపై కమిషనర్ కి వినతిపత్రం ఇచ్చిన బిజెపి పరకాల పట్టణ శాఖ.



పరకాల జులై 16 (ఉదయంప్రతినిధి): భారతీయ జనతా పార్టీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో పరకాల లో నెలకొన్న పలు సమస్యలపై పరకాల మున్సిపల్ కమిషనర్ కి వినతిపత్రం సమర్పించిన బిజెపి పరకాల పట్టణ నాయకులు. వెల్లంపెల్లి రోడ్డులో బస్టాండ్ వద్ద కొన్ని సంవత్సరాల క్రితం నుండి డబ్బా దుకాణాలు ఏర్పాటు చేసుకొని 50 కి పైగా కుటుంబాలు వ్యాపారాల పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరి కోసం గత ప్రభుత్వం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ వెనుకాల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి వారికి దానిలో స్థానం కల్పిస్తానని చెప్పినప్పటికి అట్టి నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. కావున అట్టి నిర్మాణం త్వరగా పూర్తి చేసి వీరికి ఆ షాపింగ్ కాంప్లెక్స్ లో స్థానం కల్పించాలన్నారు. పరకాల – అంబాల రోడ్డు ఫోర్ లైన్ విస్తరణలో భాగంగా పరకాల బస్టాండ్ జంక్షన్ గా అభివృద్ధి చెందడాని పరకాల ప్రజలంతా స్వాగతిస్తుంది. చెత్త సేకరణ ఆటోలు కాలనీలలో వారం రోజులకు ఒక్కసారి రావడం వలన కాలనీలలో దుర్వాసన వెదజల్లుతూ దుర్భరంగా తయారవుతున్నాయి. తద్వారా ప్రజలకు తీవ్ర అనారోగ్యలకు గురికావాల్సి వస్తుంది. కావున దీని పై తక్షణమే చర్యలు తీసుకోగాలరని, కోటి రూపాయల వ్యయంలో కోనుగోలు చేసిన రోడ్లు క్లీనింగ్ మెషీన్ పనిచేయడం లేదా. ఆ మిషన్ ఎక్కడుంది పరకాల రోడ్లను శుభ్రం చేయడానికి ఆ వాహనాన్ని ఎందుకు వాడడం లేదు. పాత పోస్టుమార్టం రోడ్డులో గొడ్ల ను కోసి వాటి కాళేపారాలను రోడ్డు పై పడేయటం వలన కుక్కలు, పందులు స్వైరవిహారం వలన అటువైపు వేళ్ళే వ్యవసాయదారులకు ఇబ్బంది కలుగుతున్న పట్టింపు లేనట్లు వ్యవహరిస్తున్న పురపాలక సంఘం పరిస్థితి ప్రజా సంక్షేమానికి బాటలేయ్యాల్సింది పోయి బలి చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. రోడ్డు డివైడర్ మధ్యలో ప్రభుత్వం నిషేదించిన కానోకార్పస్ చెట్లను గుర్తించి వెంటనే తొలగించాలని వర్షాకాలం వచ్చినందున సీజనలు వ్యాదులు వచ్చే అవకాశం ఉన్నందు వలన డ్రైనేజీలు, చెత్త సేకరణ నిర్వహణ సక్రమంగా ఉండే విధంగా చుస్తూ, కాలనీలో బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ ఉండేలా చుడాలని, పై సమస్యల పై తక్షణమే కార్యచరణ చేపట్టి పరకాల పట్టణ ప్రజలకు సహకరించగలరని బీజేపీ పరకాల పట్టణ శాఖ డిమాండ్ చేస్తుంది. ఈ యొక్క కార్యక్రమంలో మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, మాజీ కౌన్సిలర్ కొలనుపాక భద్రయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శిలు సంగా పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, కార్యదర్శి ధర్నా సునీల్ కుమార్, బిజెపి నాయకులు మార్త బిక్షపతి, కుక్కల విజయ్ కుమార్, మారేడుగొండ భాస్కరాచారి, కానుగుల గోపీనాథ్, సంగీత, బూత్ అధ్యక్షులు దామ సతీష్, ముత్యాల దేవేందర్, సారంగ నరేష్, సాదా మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# మధిర మార్కెట్ యార్డ్ ను పరిశీలించిన రాష్ట్ర, జిల్లా కోఆర్డినేటర్స్.



మధిర జూలై 16 (ఉదయం ప్రతినిధి) మధిర వ్యవసాయ మార్కెట్ కార్యాలయములో మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావుతో కలిసి సంబంధిత అధికారులు, రాష్ట్ర, జిల్లా పరిశీలకులు ధాన్యం కొనుగోళ్ళ సమయంలో జరుగుతున్న ఇబ్బందుల విషయమై చర్చించినారు. ఖరీఫ్, రబీ సీజన్లలో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాటుచేసిన కేంద్రాల్లో కావాల్సిన యంత్ర పరికరాలు సకాలంలో అందుతున్నాయా, లేదా అన్న అంశంపై రాష్ట్ర కోఆర్డినేటర్ సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.సి.మల్లయ్య, జిల్లా కోఆర్డినేటర్ సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ బీ.ఎన్.రావు మరియు జిల్లా కోఆర్డినేటర్ సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.గణేష్ మధిర వ్యవసాయ మార్కెట్ లో ఉన్న ప్యాడీ క్లీనర్లు, విన్నోఇంగ్ ఫ్యాన్స్, తేమ శాతం నిర్ధారణ యంత్రాలతో పాటు ఎలక్ట్రానిక్ కాంటాలను పరిశీలించానారు. ఆ తర్వాత మార్కెట్ కార్యాలయంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ బండారు నరసింహారావు అధ్యక్షతన సొసైటీల సీఈఓలు, ఐకేపీ, మార్కెట్ ఉద్యోగులతో పాటు రైతులతో సమావేశమై కొనుగోళ్ల కేంద్రాలలో కల్పించిన సౌకర్యాలు, అందిన పరికరాలపై ఆరా తీయడంతో పాటు ఇంకా ఏమైనా సౌకర్యాలు అవసరమా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీం, యస్.ఏం.ఏ ఏం.రామకృష్ణ, మధిర మార్కెట్ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి కే. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపారి ఇంటి ఎదుట రైతుల ఆందోళన



లక్షెట్టిపేట, జులై 16 (ఉదయం ప్రతినిధి) : లక్షెట్టిపేట పట్టణానికి చెందిన ఓ వ్యాపారి రూ.12 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టి ఉడాయించిన వ్యాపారి ఇంటి ముందు లక్షెట్టిపేట, దండేపల్లి మండలాలకు చెందిన రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట పట్టణానికి చెందిన ఓ ధాన్యం వ్యాపారి కొంత కాలంగా రైస్ మిల్లు నిర్వహిస్తున్నారు. లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల్లోని రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు చేసేవాడు. వ్యాపారంలో అందరి నమ్మకాన్ని చూరగొన్న ఆయన ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద రూ.12 కోట్లు అప్పు తీసుకున్నట్టు సమాచారం. ముందస్తు ప్రణాళికలో భాగంగా ఈ మధ్యే సుమారు రూ.18 లక్షలు విలువ చేసే వరిధాన్యం కూడా లోడింగ్ చేయించి తరలించిన ఆయన బ్యాంకులో ఉన్న 60 తులాల బంగారం కూడా విడిపించుకున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో అప్పులు తీసుకున్న వారికి రంగారెడ్డి జిల్లా కోర్టు నుంచి నోటీసులు పంపారు. మొత్తం రూ.6.98 కోట్లు అప్పులుగా తీసుకున్నట్టు ఐపీ నోటీసుల్లో పేర్కొనడం గమనార్హం. కాగా పెద్ద మొత్తంలో రైతులు వ్యాపారులు ఐపీ పెట్టిన వ్యాపారి ఇంటి వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు ఇవ్వాల్సిన డబ్బులను కూడా ఆయన ఐపీ నోటీసులు అప్పుగా చూపించినట్టు తెలుస్తుంది. విషయం బాధితులకు, వ్యాపారులకు తెలియడంతో ఆయన ఇంటి ముందు ఆందోళనకు దిగారు. అంతేకాకుండా మరో బియ్యం వ్యాపారి కూడా వరి ధాన్యం వ్యాపారి కి కోటి 20 లక్షలు రూపాయలు ఇచ్చారని అతని యొక్క పది ఎకరాల భూమిని బాండ్ పేపర్ పై రాయించుకున్నాడని. దీనితో ఆగ్రహం చెందిన దండేపల్లి, లక్షెట్టిపేట రైతులు పెద్ద మొత్తంలో తరలివచ్చి మరో వ్యాపారి ఇంటిపై రాళ్లతో దాడి చేశారు తమకు న్యాయం చేయాలని వ్యాపారికి చెందిన ఆస్తులు రైతులవేనని వ్యాపార సముదాయం బోర్డుపై "థిస్ ప్రాపర్టీ బిలాంగ్స్ టు దండేపల్లి ఫార్మర్స్ " అని రాసి ఆందోళన వ్యక్తం చేశారు .విషయం తెలుసుకున్న లక్షెట్టిపేట ఎస్ ఐ గోపతి సురేష్ సంఘటన స్థలానికి చేరుకొని వ్యాపారుల కు రైతులకు నచ్చ చెప్పారు.

# గ్రామ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్న సబ్ కలెక్టర్



జయశంకర్ భూపాలపల్లి జులై 16(వుదయం ప్రతినిధి) మహాదేవపూర్ మండలంలోని కుంట్లం గ్రామంలో పర్యటించిన కాటారం సబ్ కలెక్టర్ మాయాంక్ సింగ్ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు బుధవారం మండలంలో పర్యటించిన సబ్ కలెక్టర్ కుంట్లం గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామంలోని ఆర్ ఓ ఎఫ్ ఆర్,పట్టాలకు సంబంధించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు అదే కాక కుంట్లం గ్రామ ప్రజలు గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు గ్రామం ముంపునకు గురవుతుందని గ్రామ ప్రజలకు ప్రత్యామ్నాయ స్థలం చూపించాలని హైదరాబాదులోని సీఎంఓ కార్యాలయంలో జరిగే ప్రజా దర్బార్ కార్యక్రమంలో గ్రామ ప్రజలు వినతి పత్రంలో కోరడంతో ఈ విషయంపై సబ్ కలెక్టర్ ఇరిగేషన్ శాఖ అధికారులతో చర్చించి సమగ్ర పరిశీలన నిర్వహించి పూర్తిచేసిన నివేదికను జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు సమర్పించడం జరుగుతుందని సబ్ కలెక్టర్ తెలిపారు ఈ కార్యక్రమంలో నాయక్ తహసిల్దార్ కృష్ణ గ్రామపంచాయతీ కార్యదర్శి సమ్మయ్య తోపాటు గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

# సికిల్‌సెల్ అనీమియా పై విద్యార్థులకు అవగాహన



లక్షెట్టిపేట, జులై 16 (వుదయం ప్రతినిధి): పట్టణంలో స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం సికిల్‌సెల్ అనీమియా పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సికిల్ సెల్ అనీమియా అనేది ఒక జన్యుపరమైన రుగ్మత, ఇది ఎర్ర రక్త కణాల ఆకారాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. ఇది ప్రధానంగా గిరిజన సమాజాల్లో ఎక్కువగా కనిపిస్తున్న సమస్య అన్నారు. ముందస్తుగా రక్త పరీక్షలు చేయించుకొని, వైద్య సలహాలు పాటించడం ద్వారా వ్యాధి ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు అని సూచించారు. ఈ వ్యాధి ఉన్నవాళ్లు పెళ్లి చేసుకుంటే పుట్టే పిల్లలు కూడా సికిల్ సెల్ బారిన పడే అవకాశం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి నాందేవ్, వెంకట్రావు పేట వైద్య అధికారి డాక్టర్. సతీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ మల్లారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ గఫూర్, ఏఎన్ఎంలు సుజాత, సుమిత్ర, పాల్గొన్నారు.

# టైగర్ జోన్ ను ఎత్తివేయాలంటూ నిరాహార దీక్ష



జన్నారం, జూలై 16(వుదయం విలేకరి) జన్నారం మండలంలో టైగర్ జోన్ ను వెంటనే ఎత్తివేయాలంటూ సామాజిక కార్యకర్త భూమాచారి నిరాహార దీక్ష చేపట్టారు.మండల అభివృద్ధికి ఆటంకంగా ఉన్న టైగర్ జోన్ నిబంధనలను వెంటనే ఎత్తివేయాలని ఈ ఆంక్షలు వలన ఉపాధి లేక వ్యాపారులు నిరుద్యోగులు రోడ్డున పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఆంక్షలు వల్ల మండలం అభివృద్ధికి మార్చుకోవడం లేదని వీధి వ్యాపారులు సైతం రోడ్డున పడుతున్నారని అభివృద్ధికి ఆటంకంగా ఉన్న ఆంక్షలు వెంటనే ఎత్తివేసి మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈ నిరాహారదీక్షకు పలువురు నాయకులు సంఘీభావం తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి.

**-ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై అధికారులు దృష్టి సారించాలి.**
**-పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి.**



పరకాల జూలై 15 (వుదయం ప్రతినిధి):బుధవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల టౌన్ మరియు మండలాల పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామాలు, వార్డుల వారిగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై అధికారులు,ఇందిరమ్మ కమిటీ కలిసి సమీక్షించారు.ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.అర్హులైన ప్రతి పేదవారికి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను దశలవారీగా మంజూరు చేస్తామని అన్నారు. మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకుంటే అదనంగా ఆ గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న వారికి దశలవారీగా బిల్లులను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇస్తుందన్నారు. ప్రభుత్వం సూచించిన నిబంధన మేరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పేదింటి వాడి సొంతకాల నెరవేరుతుందని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చని అన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి.

**-పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి.**



పరకాల జులై 16 (వుదయం ప్రతినిధి ): పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల టౌన్ మరియు మండలాల పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామాలు, వార్డుల వారిగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై అధికారులు,ఇందిరమ్మ కమిటీ కలిసి సమీక్షించారు.ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.అర్హులైన ప్రతి పేదవారికి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను దశలవారీగా మంజూరు చేస్తామని అన్నారు. మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకుంటే అదనంగా ఆ గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న వారికి దశలవారీగా బిల్లులను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇస్తుందన్నారు. ప్రభుత్వం సూచించిన నిబంధన మేరకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పేదింటి వాడి సొంతకాల నెరవేరుతుందని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చని అన్నారు.

# సీడ్ పత్తి రైతుల నిరసనకు సంపూర్ణ మద్దతు తెలిపిన

**-జిల్లా మాజీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి**



అలంపూర్ జూలై 16 (వుదయం ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని బింగుదొడ్డి గ్రామంలో బుధవారం సీడు పత్తి రైతులు అయిజ గద్వాల రోడ్డులో భారీ ఎత్తున ధర్నాకు దిగారు. వారికి మద్దతుగా అక్కడికి వచ్చిన బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు రామ చంద్రారెడ్డి మాట్లాడుతూ సీడ్ పత్తి రైతులు గత రెండు నెలలుగా పొలాన్ని కౌలుకు తీసుకొని, లేబర్ కి డబ్బులు ఇచ్చి, ఎరువు,పురుగు మందులు వాడి దాదాపు ఎకరాకు ఇప్పటి వరకు కౌలు తో కొలుపుకొని 90వేల వరకు పెట్టుబడి పెట్టారన్నారు. కానీ ఇప్పుడు ఆర్గనైజర్స్, సీడ్ కంపెనీ వారు కేవలం 200 పాకెట్స్ తీసుకొంటాము లేదా పంట పీకి వేయండి అనడం చాలా దుర్మార్గం అని తెలిపారు. గత 35 సంవత్సరాల నుండి ఆర్గనైజర్స్, కంపెనీ వారు భారీ గా లాభాలు పొంది ఇప్పుడు ఈ విధంగా అనడం సరైనది కాదని తెలిపారు. రైతులు పడించిన పంట మొత్తం కోనేవరకు రైతుల వెంట బీజేపీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అయిజ మండలం బీజేపీ అధ్యక్షులు గోపాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

# బీసీలపై బీఆర్ఎస్ మొసలి కన్నీరు కార్చడం మానుకోవాలి.

**-బీసీల గురించి మాట్లాడే నైతిక విలువ బి.ఆర్.ఎస్ కు లేదు.**
**-నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర దేవేందర్ గౌడ్.**



పరకాల జులై 16 (వుదయం ప్రతినిధి): బీసీల పై మాట్లాడే నైతిక విలువ బి ఆర్ ఎస్ నాయకులకు లేదని నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర దేవేందర్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.బి ఆర్ ఎస్ బీసీలకు ఏం చేసిందో చెప్పిన తర్వాత బిసి వర్గం పై మాట్లాడాలని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు చేస్తున్న 42% రిజర్వేషన్ తో పాటు, ప్రభుత్వంలో వారికి న్యాయబద్ధమైన పదవులను కాంగ్రెస్ ప్రభుత్వం అందించడం వారికి మింగుడు పడటం లేదని, బీసీలపై బి.ఆర్.ఎస్ మొసలి కన్నీరు కార్చడం మానుకోవాలని సూచించారు.గత ఎన్నికల్లో అత్యధికంగా ఉన్న బీసీలు మీకు ఇచ్చిన తీర్పు సరిపోవటం లేదా అని ప్రశ్నించారు.తెలంగాణలోని బీసీల పట్ల మాట్లాడే హక్కు, టీఆర్ఎస్ ను బి ఆర్ ఎస్ గా మార్చిన అప్పుడే కోల్పోయారని పేర్కొన్నారు.మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంతో మంది వివిధ రకాల శాఖల ల్లో పదవులు ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అది మరిచి,కొంత మంది మతిస్థిమితం పోయిన వారి లాగా మాట్లాడడం సిగ్గుచేటని పేర్కొన్నారు.ఇకనైనా ప్రభుత్వానికి సూచనలు ఇస్తూ, తెలంగాణ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని సూచించారు.

# మండల టెంట్ హౌస్ ఓనర్ల కమిటీ ఎన్నిక.



ఖానాపురం జూలై 15 (వుదయం ప్రతినిధి):మండల టెంట్ హౌస్ ఓనర్ల కమిటీ అధ్యక్షుడిగా కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి : పసునూరు వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు ఎండీ యాకూబ్, ఎండీ కమృద్దిన్, జల్లి మధు, పెండ్యాల రాజకుమార్, రాంబాబు, గాంధీ, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

### మృతుని చిత్రపటానికి పూలమాలు వేసిన ఉమ్మడి జిల్లా వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నడిపెల్లి వెంకటేశ్వర్ రావు.



ఖానాపురం జులై 16 (వుదయం ప్రతినిధి):ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తక్కళ్లపెల్లి రవీందర్ రావు తండ్రి తక్కళ్లపెల్లి ఆగరావు ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందగా మృతుని చిత్రపటానికి ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నడిపెల్లి వెంకటేశ్వర్ రావు పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం ఈసీ నెంబర్ పిన్నింటి వెంకటేశ్వర్ రావు, బంధువులు గుడిపూడి నాగేశ్వర్ రావు, యాదగిరిరావు, నారాయణరావు, తక్కలపల్లి ప్రవీణ్ రావు, ఎర్రబెల్లి నరసింహారావు తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుండే న్యాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి.

**-పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి.**




పరకాల జులై 16 (వుదయం ప్రతినిధి): బుధవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని సెయింట్ తెరిసా పాఠశాలలో నిర్వహించిన విద్యార్థి నాయకుల నియామక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం జ్యోతి ప్రజలను చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడం వల్ల భవిష్యత్తులో వ్యక్తిగత మరియు వృత్తిపరమైన జీవితంలో ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు అని అన్నారు. విద్యార్థి నాయకులు పాఠశాల నియమాలు విలువలు పాటిస్తూ తమ బాధ్యతలు నిర్వహించాలన్నారు.నాయకత్వం కేవలం రాజకీయ రంగానికే పరిమితం కాదని,అన్ని రంగాల్లో నాయకత్వ లక్షణం వ్యక్తి ఎదుగుదలకు దోహద పడుతుందన్నారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకొని, తల్లిదండ్రుల యొక్క కలలను సహకారం చేయాలన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు ఉన్నప్పుడే వారు భవిష్యత్తులో అన్ని ఒడిదొడుకులను ఎదుర్కొని ధైర్యంగా నిలబడగలరన్నారు.

# నూతన వస్త్ర పుష్పలంకరణలో పాల్గొన్న బిఆర్ఎస్ నేత శ్రీనివాసరెడ్డి



వరంగల్/రాయపర్తి జూలై 16(వుదయం ప్రతినిధి) : మండలం కొత్తూరుగ్రామంలో గ్రామ పంచాయతీ కారోబార్ కందికట్ల సురేష్ కూతుర్లు సాయి చైతన్య, చందన శ్రీ ల నూతన వస్త్ర ఫల పుష్పలంకరణ కార్యక్రమం లో చిన్నారులను ఆశీర్వదించి, ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్'ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులుపరుపటి శ్రీనివాస్ రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ నాయకులు బద్దం వేణుగోపాల్ రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధి గజావెల్లి ప్రసాద్, తాజా మాజీ సర్పంచ్ కందికట్ల స్వామి, మండల యూత్ ప్రధాన కార్యదర్శి సంకినేని ఎల్ల స్వామి,గ్రామ పార్టీ అధ్యక్షులు దొమ్మటి సుభాష్, నాయకులు చిప్ప శ్రీనివాస్, చందు రామ్, చందు సతీష్, తాటికాయల భాస్కర్, జీవన్, , రాజు,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లనునియమించాలి.

**-లేనట్లయితే హాస్పిటల్ ముందు పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తాం.**
**-సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ డిమాండ్.**



జులై 16 భూపాలపల్లి వుదయం ప్రతినిధి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మరియు చిట్యాల రెండు మండలాల కలిపి పెద్ద దిక్కు అయినటువంటి చిట్యాల ప్రభుత్వ హాస్పిటల్ లో వెంటనే డాక్టర్లను నియమించాలి.గతంలో చిట్యాల హాస్పిటల్లో అనేక డెలివరీ కేసులు అత్యవసర కేసులకు చికిత్స అందించేవారు. అటువంటి హాస్పిటల్ నేడు దయనీయ పరిస్థితిలో ఉందని మొత్తంగా 18 మంది డాక్టర్లు ఉండవలసిన ఆస్పత్రిలో ప్రస్తుతానికి ఆరుగురు డాక్టర్లతో తూతూ మంత్రంగా వైద్య సేవలని అందిస్తున్నారని దుయ్యబట్టారు గైనిక్,, అనస్తీసియా,, పీడియాట్రిక్ డిపార్ట్మెంటులో ఇద్దరేసి డాక్టర్ల చొప్పున ఉంటూ వైద్యాన్ని అందించాల్సి ఉండగా వైద్యుల కొరత వల్ల అనేక ఎమర్జెన్సీ కేసులు ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు భూపాలపల్లి పరకాల హనుమకొండ వంటి పట్టణాలకు వెళ్లే క్రమంలో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు కొన్నిసార్లు సమయానికి వైద్యం అందక ప్రాణాలను సైతం కోల్పోతున్నారు. పరిస్థితి పూర్తి అధ్వానంగా మారింది.. ఈ విషయాన్ని స్థానిక భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావట్లేదని, పేద ప్రజల ఆరోగ్యం అంటే ఆయనకు లెక్కే లేకుండా పోతుందని మండి పడ్డారు. వెంటనే జిల్లా కలెక్టర్ నిరుపేద రోగుల పరిస్థితుల దృష్ట్యా చిట్యాల హాస్పిటల్ కు పూర్తి స్థాయిలో గైనిక్,, అనస్తీషియా,, పీడియాట్రిక్ డాక్టర్లను నియమించాలని ఆయన కోరడం జరిగింది. లేనట్లయితే చిట్యాల హాస్పిటల్ ముందు పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్థామని ఆయన హెచ్చరించారు.

# కెటిఆర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ధరణి రాజేష్



ఖానాపూర్, జూలై 16(వుదయం విలేకరి) ఖానాపూర్ నియోజకవర్గం, బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు,మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ను హైదరాబాద్ తెలంగాణ భవన్ లో బి ఆర్ ఎస్ వి జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కె టి ఆర్ మాట్లాడుతూ బి ఆర్ ఎస్ అధినేత కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా విద్యార్థుల సమస్యలపై పోరుబాట పట్టాలని ఫుడ్ ఫాయిజాన్ తో అనేక మంది విద్యార్థులు హాస్పిటల్ పాలవుతున్నారని, గురుకుల, కస్తూర్బా హాస్టల్స్ ను తనిఖీ చేసి విద్యార్థులు భవిష్యత్తుకు బాటలు వెయ్యాలని తెలిపారు.అదే విధంగా ఈ నెల 19న విద్యార్థి విభాగం కార్యకర్తలకు శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం విష ప్రచారాలు తిప్పి కొట్టే విధంగా ఆదిలాబాద్ జిల్లా నుండి విద్యార్థి విభాగం నాయకులు భారీగా తరలిరావాలన్నారు.జిల్లాలో భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగ్ పార్టీ బలోపేతానికి కృషి చెయ్యాలని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి బి ఆర్ ఎస్ పార్టీ గెలుపుకు కృషి చెయ్యాలని సూచించారు.

# 108 అంబులెన్స్ లో మహిళ ప్రసవం



నిజాంసాగర్, జుల్కె 15 (వుదయం ప్రతినిధి): నిజాంసాగర్ మండలకేంద్రానికి చెందిన బి. లక్ష్మి అనే గర్భిణీ తన 4వ కాన్పులో పురిటినొప్పులు ఎక్కువ కావడంతో వారి కుటుంబీకులు నిజాంసాగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుండి వైద్యులు బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అంబులెన్స్‌లో బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో నొప్పులు అధికం కావడంతో క్లిష్ట పరిస్థితుల్లో 108 సిబ్బంది డెలివరీ చేశ్నరు. దీంతో ఆమె మగబిడ్డకు జన్మనిచిందని, ప్రస్థుతం తల్లీ, బిడోడ క్షేమంగానే ఉన్నట్లు అంబులెన్స్ ఈఎన్‌టీ తెలిపారు. అంబులెన్స్‌లోనే సుఖ ప్రసవం చేసిన ఈఎన్‌టీ అరవింద్, పైలెట్ వెంకటేష్‌లకు వారి కుటుంబీకులు ధన్యవాదాలు తెలిపారు.

ఫొటో. అంబులెన్స్‌లో ప్రసవించిన మహిళ




# బిజినెస్



## 12 నెలల పాటు రీఛార్జ్ చేయాల్సిన అవసరం లేదు!




బీఎస్ఎన్ఎల్ తక్కువ ధరల్లో రీఛార్జ్ ప్లాన్స్‌ను తీసుకువస్తోంది. ప్రైవేట్ టెలికాం కంపెనీల రీఛార్జ్ ధరలు పెరిగిన తర్వాత లక్షలాది మంది వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఎలాంటి ధరలను పెంచకుండా 4జీ, 5జీ సేవలను అందుబాటులోకి తీసుకువస్తోంది. ప్రైవేట్ టెలికాం కంపెనీలు తమ రీఛార్జ్ ప్లాన్‌లను ఖరీదైనవిగా మార్చినప్పటి నుండి ప్రభుత్వ యాజమాన్యంలోని టెలికాం కంపెనీ BSNL మిలియన్ల మంది వినియోగదారులకు ఇష్టమైన టెలికాం కంపెనీగా మారింది. ప్రభుత్వ టెలికాం కంపెనీలు ఎల్లప్పుడూ తమ బడ్జెట్-స్నేహపూర్వక ప్లాన్‌లకు ప్రజాదరణ పొందాయి. ఇప్పుడు BSNL తన కస్టమర్ల కోసం రెండు గొప్ప వార్షిక ప్రీపెయిడ్ ప్లాన్‌లను ప్రవేశపెట్టింది. ఇవి డేటా, అపరిమిత కాలింగ్, రోజువారీ SMS సదుపాయాలతో చాలా తక్కువ ధరకు అందిస్తున్నాయి. ఈ ప్లాన్‌ల ధర రూ.1,515, రూ. 1,499. ఇందులో మీ సగటు నెలవారీ ఛార్జీ కేవలం రూ. 127. BSNL రూ.1,515 ప్లాన్: ఈ ప్లాన్‌లో మీరు ఒక సంవత్సరం చెల్లుబాటును పొందుతారు. అంటే పూర్తి 365 రోజులు. అలాగే ఈ ప్లాన్‌లో వినియోగదారులు రోజుకు 2GB హై-స్పీడ్ డేటాను పొందుతారు. ఇది మాత్రమే కాకుండా, ఈ ప్లాన్ అపరిమిత వాయిస్ కాలింగ్ సౌకర్యం, రోజుకు 100 SMSలను కూడా అందిస్తుంది. ఈ ప్లాన్‌లో ఎలాంటి OTT సబ్‌స్క్రిప్షన్ లేనప్పటికీ, వినియోగదారులు ఏడాది పొడవునా మొత్తం 720 GB డేటాను పొందుతారు. ఈ రూ.1,515 ప్లాన్‌ను 12 నెలలుగా విభజిస్తే నెలవారీ ఖర్చు కేవలం రూ.126.25 అవుతుంది. అంటే దాదాపు రూ.127 చెల్లించడం ద్వారా మీరు ఒక సంవత్సరం పాటు రీఛార్జ్ ఒత్తిడి నుండి విముక్తి పొందవచ్చు. మీరు ప్రతి నెలా రీఛార్జ్ చేయడం కష్టంగా భావిస్తే, నిరంతర కాలింగ్, ఇంటర్నెట్ ప్రయోజనాలను కోరుకుంటే ఇది మీకు ఉత్తమ రీఛార్జ్ ప్లాన్ కావచ్చు. BSNL రూ.1,499 ప్లాన్: ఈ ప్లాన్‌లో మీరు 336 రోజులు చెల్లుబాటు పొందుతారు. అంటే ఒక సంవత్సరం కన్నా కొంచెం తక్కువ. అలాగే ఈ ప్లాన్ మొత్తం 24GB డేటాను అందిస్తోంది. కానీ ఇది మొత్తం చెల్లుబాటు వరకు ఉంటుంది. అంటే, మీరు ప్రతిరోజూ కాకుండా మొత్తం మీద 24జీబీల డేటా మాత్రమే పొందుతారు. దీనితో పాటు ఈ ప్లాన్ అపరిమిత కాలింగ్‌ను కూడా అందిస్తోంది. అలాగే రోజుకు 100 SMS సౌకర్యాన్ని కూడా పొందుతారు.

## తెలుగు రాష్ట్రాల్లో తగ్గిన బంగారం ధరలు!

గోల్డ్ కొనుగోలు చేసే వారికి అదిరిపోయే వార్త. ఎవరైతే చాలా రోజుల నుంచి బంగారం కొనుగోలు చేయాలని అనుకుంటున్నారో వారికి గుడ్ న్యూస్ అందిది అనే చెప్పాలి. ఎందుకంటే? గత కొన్ని రోజుల నుంచి పెరుగుతున్న బంగారం ధరలు నేడు స్వల్పంగా తగ్గాయి. గోల్డ్ కొనుగోలు చేసే వారికి అదిరిపోయే వార్త. ఎవరైతే చాలా రోజుల నుంచి బంగారం కొనుగోలు చేయాలని అనుకుంటున్నారో వారికి గుడ్ న్యూస్ అందిది అనే చెప్పాలి. ఎందుకంటే? గత కొన్ని రోజుల నుంచి పెరుగుతున్న బంగారం ధరలు నేడు స్వల్పంగా తగ్గాయి. కాగా, నేడు అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం. జూలై 16, 2025న 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,760 గా ఉండగా,22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.91,440గా ఉంది. జూలై 15, 2025 మంగళ వారం (నిన్న)24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,770గా ఉండగా,నేడు రూ.10 తగ్గడంతో గోల్డ్ రేట్ రూ.99,760గా ఉంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర నిన్న రూ.91,450గా ఉండగా, నేడు రూ.10 తగ్గడంతో గోల్డ్ రేట్ రూ.91,440గా ఉంది. ప్రముఖ నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే.. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.99,760 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.91,440 లుగా ఉంది. ఇక నేడు సిల్వర్ ధర స్వల్పంగా తగ్గింది. కిలో వెండి పై రూ.100 తగ్గడంతో కేజీ వెండి రూ.124,900గా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,890 ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.91,560లుగా ఉంది. కిలో వెండి ధర రూ.124,900 లుగా ఉంది.వరంగల్ జిల్లాలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.99,890. 22 క్యారెట్ల ధర రూ.91,560లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.124,900లుగా ఉంది.

## ఇక సైబర్ మోసాలకు చెక్..!




డిజిటల్ చెల్లింపులు మన దైనందిన జీవితంలో ఒక భాగంగా మారాయి. కోట్లాది మంది తమ రోజువారీ లావాదేవీలను వేగంగా, సులభంగా పూర్తి చేయడానికి వీటిని ఉపయోగిస్తున్నారు. అయితే, డిజిటల్ చెల్లింపుల వాడకం పెరుగుతున్న కొద్దీ, వాటి భద్రత పట్ల అవగాహన పెంచుకోవడం చాలా ముఖ్యం. సురక్షితమైన చెల్లింపు పద్ధతులను పాటించడం ద్వారా మీ డిజిటల్ అనుభవం సురక్షితంగా ఉంటుందని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సూచిస్తోంది. డిజిటల్ చెల్లింపులు దేశ వ్యాప్తంగా కోట్లాది మందికి రోజువారీ లావాదేవీలను వేగవంతం, సులభతరం చేశాయి. వాడకం పెరిగే కొద్దీ, డిజిటల్ చెల్లింపుల భద్రత పట్ల వినియోగదారులలో అవగాహన పెరగాలి. సురక్షితమైన చెల్లింపు విధానాలను పాటించడం సులభమే, ఇవి దీర్ఘకాలంలో మీకు డిజిటల్ అనుభూతిని భద్రంగా ఉంచుతాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డిజిటల్ చెల్లింపులను సురక్షితంగా జరపడానికి 5 చిట్కాలను సూచిస్తోంది. 1. చెల్లించే ముందు ఓసారి సరిచూడండి: ఏదైనా పేమెంట్ చేసేటప్పుడు స్క్రీన్‌పైన కనిపించే పేరును తప్పకుండా తనిఖీ చేయండి. మీరు ఎవరికి డబ్బు పంపిస్తున్నారో, ఆ పేరే స్క్రీన్ మీద ఉందో లేదో నిర్ధారించుకోండి. చెల్లింపును నిర్ధారించడానికి కొన్ని సెకన్ల సమయం తీసుకోండి. తొందరపడి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త పడండి. 2. నమ్మకమైన యాప్‌లు, వెబ్‌సైట్లనే వాడండి: ఎప్పుడూ అధికారికమైన, పేరున్న యాప్‌లు లేదా వెబ్‌సైట్ల ద్వారా మాత్రమే చెల్లింపులు జరపండి. మీకు తెలియని వారు, నమ్మకం లేని వారు పంపే లింకుల ద్వారా యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దు. అటువంటి లింకులను క్లిక్ చేయకండి. 3. పిన్ లేదా ఓటీపీని ఎవరికీ చెప్పకండి: మీ యూపీఐ పిన్, ఓటీపీ (వన్ టైమ్ పాస్‌వర్డ్), లేదా బ్యాంక్ వివరాలు అత్యంత వ్యక్తిగతమైనవి, గోప్యమైనవి. మేము బ్యాంక్ నుండి కాల్ చేస్తున్నాం, లేదా పోలీసులం, లేదంటే ప్రభుత్వ కార్యాలయానికి చెందినవారం అని ఎవరైనా చెప్పినా సరే, ఈ వివరాలను ఎవరితోనూ పంచుకోకండి. 4. హడావిడిగా పేమెంట్ చేయవద్దు: వెంటనే పేమెంట్ చేయాలని లేదా మీ వివరాలను అత్యవసరంగా ఇవ్వాలని ఎవరైనా మిమ్మల్ని తొందరపెడితే, కంగారుపడకండి. కాస్త సమయం తీసుకోండి.

ఒకటికి రెండుసార్లు సరిచూసుకోండి. అవసరమైతే, వారికి తిరిగి కాల్ చేస్తానని చెప్పండి. మీకు కావాల్సినంత సమయం తీసుకోవడంలో ఎటువంటి తప్పు లేదు. 5. పేమెంట్ అలర్ట్‌లను ఆన్ చేసుకోండి: మీరు చేసే చెల్లింపులకు సంబంధించిన ఎస్ఎంఎస్, యాప్ నోటిఫికేషన్‌లను ఎప్పుడూ ఆన్ చేసి ఉంచండి. ప్రతి అలర్ట్‌ను జాగ్రత్తగా చదవండి. ఏదైనా తేడాగా అనిపిస్తే, వెంటనే మీ బ్యాంక్ లేదా పేమెంట్ యాప్‌ను సంప్రదించండి.

## టాటా EV లపై భారీ ఆఫర్లు




భారతదేశపు ప్రముఖ వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్, తమ ఎలక్ట్రిక్ వాహన శ్రేణిపై ఆకర్షణీయమైన రాయితీలను ప్రకటించింది. జూలై 2025 నెలకి ప్రత్యేకంగా అందించే ఈ ఆఫర్లలో భాగంగా, హారియర్ EV, నెక్సాన్ EV వంటి మోడళ్లపై గణనీయమైన తగ్గింపులు లభిస్తున్నాయి. విద్యుత్ వాహనాలను కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది ఒక సువర్ణావకాశం. డీలర్‌షిప్‌లు, ప్రాంతాలను బట్టి ఈ ఆఫర్లు మారవచ్చు. ఎక్స్ఛేంజ్ బోనస్, లాయల్టీ ప్రయోజనాలతో కూడిన ఈ రాయితీలు, దేశంలో EVల విస్తరణకు మరింత ఊతం ఇస్తాయని టాటా మోటార్స్ ఆశిస్తుంది. ఈ ఆఫర్ల పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం. టాటా మోటార్స్, 2025 జూలై నెలకు గాను తమ ఎలక్ట్రిక్ వాహనాలపై ప్రత్యేక రాయితీలను ప్రకటించింది. ఈ ఆఫర్లలో, సరికొత్త టాటా హారియర్ EV కి రూ.1 లక్ష వరకు లాయల్టీ బోనస్ లభిస్తుంది. అయితే, ఈ గణనీయమైన తగ్గింపు కేవలం ఇప్పటికే టాటా EVలు కలిగి ఉన్న వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుంది. ఇది ప్రస్తుతం టాటా EV ని ఉపయోగిస్తూ, మరో కొత్త టాటా EV ని కొనుగోలు చేయాలని భావిస్తున్న వారికి సంస్థ అందిస్తున్న ఒక ప్రత్యేక ప్రోత్సాహం. దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన టాటా నెక్సాన్ EV పై రూ.30,000 వరకు డిస్కౌంట్ ఇస్తున్నారు. ఈ రాయితీలో ఎక్స్ఛేంజ్ బోనస్, లాయల్టీ ప్రయోజనాలు ఉంటాయి. అంతేకాకుండా, నెక్సాన్ EV కొనుగోలుదారులకు టాటా పవర్ ఛార్జింగ్ స్టేషన్లలో ఆరు నెలల పాటు (1,000 యూనిట్ల వరకు) ఉచిత పబ్లిక్ ఛార్జింగ్ సదుపాయం కూడా అందుబాటులో ఉంది. ఇది EV వినియోగదారులకు ఒక ముఖ్యమైన ప్రయోజనం. ఎంట్రీ-లెవల్ EV విభాగంలో, టాటా టియాగో EV లాంగ్ రేంజ్, టాటా పంచ్ EV మోడల్స్‌పై సైతం ఆకర్షణీయమైన ఆఫర్లు ఉన్నాయి. ఈ వాహనాలపై రూ.20,000 నగదు తగ్గింపు, అదనంగా రూ.20,000 ఎక్స్ఛేంజ్ బోనస్ అందిస్తున్నారు. అయితే, ఈ రెండు మోడల్స్‌కు ఉచిత పబ్లిక్ ఛార్జింగ్ ఆఫర్లు వర్తించవు.

ఈ అన్ని రాయితీలు జూలై 2025 నెలకు మాత్రమే పరిమితం. డీలర్‌షిప్‌లు, ప్రాంతాన్ని బట్టి ఈ డిస్కౌంట్‌లు, ఇతర ప్రయోజనాలలో స్వల్ప మార్పులు ఉండవచ్చు. ఈ ప్రోత్సాహకాలతో, టాటా మోటార్స్ భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలను మరింతగా పెంచాలని, పర్యావరణహిత రవాణాను ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## ఈ పొరపాట్లు చేస్తే ఫాస్టాగ్‌లు బ్లాక్‌లిస్ట్‌లోకి




వాహన యజమానులు తమ ఫాస్ట్‌ట్యాగ్‌లను విండ్‌స్క్రీన్‌పై సరిగ్గా అతికించకపోవడం వల్ల టోల్ బూత్‌ల వద్ద రద్దీ, తప్పు ఛార్జ్‌బ్యాక్‌లు, టోలింగ్ వ్యవస్థను దుర్వినియోగం చేయడం మొదలైన వాటి ద్వారా ఇది మొత్తం టోలింగ్ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. చాలా మంది వాహనాలు టోల్‌గేట్ వద్దకు రాగానే ఫాస్టాగ్ పని చేయవు. ఫాస్ట్ ట్యాగ్ మీ కారు విండ్ స్క్రీన్ కు అతికించారా? లేదా అనేది నిర్ధారించుకోవాలి. మీరు హైవే టోల్ బూత్ లకు వెళ్ళినప్పుడు స్కానింగ్ చేస్తున్నప్పుడు ఫాస్టాగ్ సరిగ్గా పని చేయకుంటే ఇబ్బందులు తలెత్తుతాయి. అలాంటి ఫాస్ట్‌ట్యాగ్‌లను బ్లాక్ లిస్ట్‌లో చేర్చనున్నారు అధికారులు. ప్రభుత్వం అలాంటి నియమాన్ని రూపొందించింది. ఇటీవల విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా వదులుగా ఉన్న ఫాస్ట్ ట్యాగ్ లను బ్లాక్ లిస్ట్ చేయాలని నిర్ణయించింది. సాధారణంగా వాహనదారులు తమ ఫాస్టాగ్‌లను వాహన విండ్‌షీల్డ్‌లపై అతికించాల్సి ఉంటుంది. దీంతో టోల్‌ప్లాజాల వద్ద ఉన్న స్కానర్లు వాటిని స్కాన్ చేసేందుకు వీలుంటుంది. కానీ, కొందరు ఉద్దేశపూర్వకంగా ఫాస్టాగ్‌లను అతికించట్లేదని గుర్తించారు అధికారులు. టోల్ గేట్లు వచ్చినప్పుడు పర్సులో నుంచి తీసి చూపిస్తున్నారు. ఇలాంటి వాటినే 'లూజ్ ఫాస్టాగ్'గా పిలుస్తారు. ఇలాంటి యూజర్ల వల్ల టోల్ పాస్ నిర్వహణ సమస్యగా మారుతోందని, ప్లాజాల వద్ద రద్దీ పెరుగుతోందని ఎన్‌హెచ్ఏఐ తెలిపింది. అంతేగాక, కొందరు టోలింగ్ వ్యవస్థను దుర్వినియోగం చేసేందుకు యత్నిస్తున్నట్లు పేర్కొంది. మీ ఫాస్ట్‌ట్యాగ్ ఖాతాలో తగినంత బ్యాలెన్స్ లేకపోతే, అది బ్లాక్‌లిస్ట్‌లోకి వెళ్ళవచ్చు. మీరు మీ ఫాస్ట్‌ట్యాగ్‌ని మీ వాహనానికి సరిగ్గా అంటించకపోతే లేదా టోల్ గేట్ల వద్ద దానిని సరిగ్గా ఉపయోగించకపోతే అది బ్లాక్‌లిస్ట్ చేయవచ్చు. అంతేకాదు.. ఫాస్ట్‌ట్యాగ్ ఖాతాను ప్రారంభించిన తర్వాత మీరు KYC ప్రక్రియను పూర్తి చేయకపోతే అది బ్లాక్‌లిస్ట్ చేయవచ్చు. ఎప్పుడు కూడా మీ ఫాస్టాగ్‌లో తగినంత బ్యాలెన్స్ ఉందని నిర్ధారించుకోండి. దానిని మీ వాహనానికి సరిగ్గా అతికించి టోల్ గేటు వద్ద సరిగ్గా ఉపయోగించండి. వాహన యజమానులు తమ ఫాస్ట్‌ట్యాగ్‌లను విండ్‌స్క్రీన్‌పై సరిగ్గా అతికించకపోవడం వల్ల టోల్ బూత్‌ల వద్ద రద్దీ, తప్పు ఛార్జ్‌బ్యాక్‌లు, టోలింగ్ వ్యవస్థను దుర్వినియోగం చేయడం మొదలైన వాటి ద్వారా ఇది మొత్తం టోలింగ్ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. దీంతో టోల్ బూత్‌ల వద్ద వాహనాలు ఆలస్యం అవుతున్నాయని, దీనివల్ల ఇతర హైవే వినియోగదారులకు అసౌకర్యం కలుగుతుందని గమనించినట్లు NHAI ఒక ప్రకటనలో తెలిపింది. వాహన రకాన్ని బట్టి ఫాస్ట్‌ట్యాగ్‌లు మారుతూ ఉంటాయి. పెద్ద వాహనాలకు వేర్వేరు ఫాస్ట్‌ట్యాగ్‌లు ఉంటాయి.

## అమెరికా వార్నింగ్.. నష్టాల్లో స్టాక్‌మార్కెట్లు..

రష్యాతో వ్యాపారం చేస్తే వంద శాతం సుంకాలు విధిస్తామని భారత్, చైనాలకు నాటో దేశాలు హెచ్చరికలు చేసిన నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు త్రైమాసిక ఫలితాల సీజన్ కావడం కూడా మార్కెట్ల ఒడిదుడుకులకు కారణమవుతోంది. మంగళవారం లాభాలను ఆర్జించిన దేశీయ సూచీలు బుధవారం మళ్లీ నష్టాల బాట పట్టాయి. రష్యాతో వ్యాపారం చేస్తే వంద శాతం సుంకాలు విధిస్తామని భారత్, చైనాలకు నాటో దేశాలు హెచ్చరికలు చేసిన నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు త్రైమాసిక ఫలితాల సీజన్ కావడం కూడా మార్కెట్ల ఒడిదుడుకులకు కారణమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో కదలాడుతున్నాయి. మంగళవారం ముగింపు (82, 570)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత నష్టాల బాట పట్టింది. ఒక దశలో దాదాపు 200 పాయింట్లు కోల్పోయి 82, 371 వద్ద కనిష్టానికి చేరింది. ప్రస్తుతం ఉదయం 10:20 గంటల సమయంలో సెన్సెక్స్ 149 పాయింట్ల నష్టంతో 82, 420 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 52 పాయింట్ల నష్టంతో 25, 143 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో డిక్సన్ టెక్నాలజీస్, ఆర్బీఎల్ బ్యాంక్, పతంజలి ఫుడ్స్, పేటీఎమ్, ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. అంబర్ ఎంటర్‌ప్రైజెస్, శ్రీరామ్ ఫైనాన్స్, ఏబీబీ ఇండియా, జిందాల్ స్టీల్స్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 50 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 54 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 85.89గా ఉంది.



# జాతీయం – అంతర్జాతీయం

## రైతుల డిమాండ్లకు తలొగ్గిన కర్నాటక సర్కార్



బెంగళూరు : మూడేండ్లకు పైగా అకుంఠిత దీక్షతో, కృత నిశ్చయంతో రైతులు సాగించిన మహోద్యమంతో కర్నాటక ప్రభుత్వం తోక ముడవక తప్పలేదు. ఎన్ని బెదిరింపులు, అణచివేత చర్యలు చేపట్టినా వాటికి వెరవకుండా రైతులు కొనసాగించిన తీవ్ర వ్యతిరేకత, నిరసనల కారణంగా ఏరోస్పేస్ పార్క్ కోసం చేపట్టదలచిన వేలాది ఎకరాల భూ సేకరణ ప్రక్రియను కర్ణాటక ప్రభుత్వం ఉపసంహరించుకుంది. దేవనహళ్ళి తాలుకాలోని 13 గ్రామాల్లో 1777 ఎకరాల భూమిని పార్కు నిర్మాణం కోసం సేకరించాలని సిద్ధరామయ్య ప్రభుత్వం తలపెట్టింది. అయితే రైతులు ఈ ప్రతిపాదనను తీవ్రంగా ప్రతిఘటించారు. తక్షణమే భూ సేకరణను నిలిపివేయాంటూ రైతులు ప్రారంభించిన నిరనలు మంగళవారానికి 1198వ రోజుకు చేరాయి. ఈ పరిస్థితుల్లో రైతుల డిమాండ్‌కు తలొగ్గుతున్నట్టు ముఖ్యమంత్రి సిద్ధరాయమ్య ప్రకటించారు. బెంగళూరులో రైతు ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు.

అయితే ఈ ప్రాజెక్టు కోసం ఎవరైతే స్వచ్ఛందంగా తమ భూమిని ఇవ్వాలనకుంటున్నారో అటువంటి రైతుల నుంచి భూమిని ప్రభుత్వం సేకరిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. అధిక ధరలకు ఆ భూమిని కొనుగోలు చేయడమే కాకుండా, ఆ రైతులకు అభివృద్ధిపరిచిన భూమిలో కొంత భాగాన్ని ఇవ్వడం వంటి చర్యలు కూడా చేపడతామని ప్రకటించారు. ఈ ప్రతిపాదిత పార్కులో కొత్తగా ఫ్యాక్టరీలు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలు ఇక్కడ అవకాశం లేకపోతే పొరుగు రాష్ట్రాలకు వెళ్ళిపోయే అవకాశం వుందని అన్నారు.

అయినప్పటికీ, తమ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోరాదని గట్టిగా పట్టుబడుతున్న రైతుల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని ఇక ఈ భూ సేకరణ ప్రక్రియను పూర్తిగా నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. తమ డిమాండ్ సాధన కోసం దేవనహళ్ళి తాలుకా రైతులు చన్నరాయపట్నాలో గత 1198 రోజులుగా నిరసనలు కొనసాగిస్తున్నారు. తమ భూములన్నీ మంచి సాగుభూములని, పక్కనే బెంగళూరులోనే గల మార్కెట్లలో తమ పంటలకు మంచి గిట్టుబాటు ధర వస్తోందని, అటువంటి భూములను పార్కు కోసం ఎలా స్వాధీనం చేసుకుంటారని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పారిశ్రామికాభివృద్ధి పేరుతో సాగు భూముల స్వాధీనం చేసుకోవడంలో ఆంతర్యాన్ని వారు ప్రశ్నించారు.

## జిన్‌పింగ్‌తో జైశంకర్ భేటీ



చైనా పర్యటనలో ఉన్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మంగళవారం ఆ దేశాధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. గడచిన ఐదేండ్ల కాలంలో భారత విదేశాంగ మంత్రి చైనాలో పర్యటించడం ఇదే మొదటిసారి. తూర్పు లడఖ్‌లో నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించుకొని ద్వైపాక్షిక సంబంధాలను గాడిలో పెట్టేందుకు రెండు దేశాలు ప్రయత్నిస్తున్న తరుణంలో జరిగిన ఈ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) విదేశాంగ మంత్రుల సమావేశానికి హాజరయ్యేందుకు జైశంకర్ చైనా వచ్చారు.ద్వైపాక్షిక సంబంధాల్లో చోటుచేసుకుం టున్న తాజా పరిణామాన్ని చైనా అధినేతకు వివరించానని జిన్‌పింగ్‌తో సమావేశమైన అనంతరం జైశంకర్ తెలిపారు. 'సహచర ఎస్‌సీఓ మంత్రులతో కలిసి జిన్‌పింగ్‌తో సమావేశమయ్యాను. రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ, ప్రధాని నరేంద్ర మోడీల శుభాకాంక్షలను ఆయనకు తెలియజేశాను. ద్వైపాక్షిక సంబంధా ల్లో తాజా పరిణామాన్ని గురించి వివరించాను' అని ఆయన ట్వీట్ చేశారు. 2020 జూన్‌లో జరిగిన గాల్వన్ లోయ ఘర్షణ తర్వాత ఇరువురు నేతలు మొదటిసారిగా సమావేశమ య్యారు. సంఘర్షణలు జరిగిన డెమ్‌ఛాక్, డెప్‌శాంగ్ ప్రాంతాల్లో నిరాయుధీకరణపై గతేడాది అక్టోబరులో రెండు దేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. అప్పటి నుంచి ద్వైపాక్షిక చర్చలను పునరుద్ధరించాలని ఇరు పక్షాలు నిర్ణయించాయి. సరిహద్దులో నెలకొన్న ప్రతిష్టంభన నేపథ్యంలో రెండు దేశాల మధ్య చర్చలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. జైశంకర్ సోమవారం చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో సమావేశమై సరిహద్దు వివాదాన్ని ప్రస్తావించారు. వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వద్ద ఉద్రిక్తతలను నివారించేందుకు రెండు దేశాలు తప్పనిసరిగా ముందడుగు వేయాల్సి ఉ ందని చెప్పారు. 'ద్వైపాక్షిక సంబంధాలను సాధారణ స్థాయికి చేర్చే విషయంలో గత తొమ్మిది నెలల్లో మేం మంచి పురోగతి సాధించాం. ఉద్రిక్తతల నివారణ సహా సరిహద్దు సమస్యకు సంబంధించిన ఇతర అంశాలను ఇప్పుడు పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది' అని అన్నారు. కీలక ఖనిజాలపై చైనా విధించిన ఎగుమతి ఆంక్షలను గుర్తుచేస్తూ.. ఆంక్షలతో కూడిన వాణిజ్య చర్యలను, అవరోధాలను నివారించాలని కోరారు. అభిప్రాయబేధాలు విభేదాలు కాకూడదని, రెండు దేశాల మధ్య నెలకొన్న పోటీ ఘర్షణకు దారితీయకూడదని నొక్కి చెప్పారు. చైనా ఉపాధ్యక్షుడు హన్ జెంగ్‌తో కూడా జైశంకర్ సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాల్లో పురోగతిని వివరించారు.

తన పర్యటన సందర్భంగా చైనా నేతలతో జరుపుతున్న చర్చలు సానుకూల ఫలితాలను ఇస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్‌సీఓ అధ్యక్ష పదవికి చైనా అభ్యర్థిత్వాన్ని భారత్ బలపరుస్తుందని చెప్పారు.

## టమాటాలనూ వదలని ట్రంప్ మండిపడుతున్న డెమొక్రాట్లు

కాదేదీ సుంకానికి అనర్హం అన్నది అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధానం. ప్రజలు విరివిగా ఉపయోగించే టమాటాలను కూడా ఆయన వదలడం లేదు. మెక్సికో నుండి దిగుమతి అవుతున్న తాజా టమాటాలపై ఆయన ఏకంగా 17 శాతం సుంకం విధించారు. తద్వారా మూడు దశాబ్దాల క్రితం కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకున్నారు. యాంటీ–డంపింగ్ సుంకాల నుండి టమాటాలను మినహాయించాలని అప్పట్లో ఇరు దేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి.

అయితే ట్రంప్ ప్రభుత్వం సోమవారం ఆ ఒప్పందం నుండి వైదొలిగింది. ఆగస్ట్ 1వ తేదీ నాటికి అమెరికాతో మెక్సికో వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవాల్సి ఉంది. లేకుంటే మెక్సికో ఉత్పత్తులపై 30 శాతం సుంకం విధిస్తారు.'మా గొప్ప భాగస్వాములలో మెక్సికో కూడా ఒకటి. అయితే ఇంకెంతో కాలం అది అలా ఉండలేదు. ఆ దేశం అనుసరిస్తున్న అవాంఛనీయ వాణిజ్య విధానాల కారణంగా మా రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఆ విధానాల ఫలితంగా టమాటాల వంటి మా ఉత్పత్తుల ధరలు తగ్గిపోతున్నాయి' అని అమెరికా వాణిజ్య మంత్రి హెూవర్డ్ లత్నిక్ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఈ రోజుతో అదంతా ముగిసిపోయింది. ట్రంప్ వాణిజ్య విధానాలు, మెక్సికో పట్ల మా వైఖరి కారణంగా నిబంధనలు మారాయి' అని చెప్పారు. 90 రోజులలో ఒప్పందం నుండి వైదొలుగుతామని అమెరికా వాణిజ్య శాఖ ఏప్రిల్‌లోనే ప్రకటించింది. మెక్సికో దిగుమతుల ధరలు అన్యాయంగా ఉంటున్నాయని, వాటి నుండి అమెరికా టమాటా ఉత్పత్తిదారులను కాపాడడంలో ఈ ఒప్పందం విఫలమైందని తెలిపింది.

అమెరికాలో ఉపయోగిస్తున్న టమాటాలలో 70 శాతం వరకూ మెక్సికో నుండే సరఫరా అవుతున్నాయి. 1994లో ఇది కేవలం 20 శాతంగా ఉ ండేదని ఫ్లోరిడా టమాటా ఎక్స్ఛేంజ్ తెలిపింది. కాగా అమెరికా చర్యను మెక్సికో ఆర్థిక, వ్యవసాయ మంత్రిత్వ శాఖలు ఖండించాయి.

## గాజాపై 'ఆకలి' సంక్షోభం

### సిరియా పైనా దాడులు



పాలస్తీనాపై ఇజ్రాయిల్ దళాలు అడ్డూ అదుపూ లేకుండా విరుచుకుపడుతున్నాయి. గాజాలో మారణహెూమాన్ని సాగిస్తున్నాయి. అక్కడ నివసిస్తున్న ప్రజలకు ఆహారం, ఇంధనం, నీరు, అత్యవసర మందులు లభించకుండా అడ్డుకుంటూ తీవ్రమైన ఆంక్షలు విధిస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో దారుణమైన ఆకలి సంక్షోభం తలెత్తింది. ఇజ్రాయిల్ దళాలు జరిపిన తాజా దాడిలో 78 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. ఆహారం, తాగునీటి కోసం సహాయ కేంద్రాలకు వచ్చిన వారు సైతం మృత్యువాత పడుతున్నారు. దక్షిణ గాజాలోని రఫా నగరంలో ఆహార పంపిణీ కేంద్రం సమీపంలో సోమవారం ఇజ్రాయిల్ సైనికులు దాడి చేశారు. ఈ ఘటనలో కనీసం ఐదుగురు చనిపోయారని పాలస్తీనా అధికార వార్తా సంస్థ వఫా తెలిపింది. ఇజ్రాయిల్, అమెరికా మద్దతుతో వివాదాస్పద గాజా మానవతావాద ఫౌండేషన్ (జీహెచ్ఎఫ్) నడుపుతున్న సహాయ కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని జరుగుతున్న దాడులలో ఇప్పటివరకూ 838 మంది చనిపోయారని చెప్పింది. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌లో నిరాశ్రయులు ఆశ్రయం పొందుతున్న శిబిరంపై జరిగిన దాడిలో తొమ్మిది మంది మరణించగా పలువురు గాయపడ్డారు. సెంట్రల్ గాజాపై ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడిలో బురైజ్ శరణార్థి శిబిరంలో ఉంటున్న తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. ఇదిలావుండగా సిరియాలోని సువేరాపై ఇజ్రాయిల్ తాజాగా దాడులు జరిపింది. ఇది డ్రూజ్ ప్రజలు ఎక్కువగా నివసించే నగరం. డ్రూజ్ ప్రజలకు వ్యతిరేకంగా సిరియా పాలకులు చేపడుతున్న చర్యలను నిరసిస్తూ అక్కడి సైనికులు, ఆయుధాలను లక్ష్యంగా చేసుకొని దాడి జరిపామని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ, రక్షణ మంత్రి కట్జ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే గోలాన్ హైట్స్‌ను ఆక్రమించుకున్న ఇజ్రాయిల్ ఇప్పుడు డ్రూజ్ ప్రజలను కాపాడే పేరుతో సువేరాపై దాడికి దిగిందని, తద్వారా తన ఆధిపత్యాన్ని విస్తరించుకోవాలని అనుకుంటోందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. కాగా ఈ దాడులను ఖతార్ తీవ్రంగా ఖండించింది. ఇది బాధ్యతారాహిత్యమైన చర్య అని ఖతార్ విదేశాంగ ప్రతినిధి వ్యాఖ్యానించారు. సిరియా ప్రజల భద్రత ఇజ్రాయిల్ బాధ్యత కాదని చురక వేశారు. ఇజ్రాయిల్, హమాస్ మధ్య దోహాలో కాల్పుల విరమణపై చర్చలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. అయితే ఆయన వివరాలేవీ అందజేయలేదు.

## మారథాన్ రన్నర్ ఫౌజా సింగ్

### మృతి కేసులో కీలక పరిణామం



టర్బన్డ్ టోర్నాడో' అనే పిలువబడే 114 ఏళ్ల మారథాన్ రన్నర్ ఫౌజా సింగ్ రోడ్డు ప్రమాదంలో మరణించిన కేసులో పోలీసులు ఒకరిని అరెస్టు చేశారు. జలంధర్‌లోని కర్తాపూర్‌కు చెందిన అమృత్‌పాల్ సింగ్ ధిల్లాన్ గా గుర్తించారు. తన కుటుంబంతో కలిసి కెనడాలో నివసిస్తున్న అమృత్‌పాల్ వారం క్రితం భారతదేశానికి వచ్చాడు. సోమవారం రోడ్డు దాటుతుండగా జరిగిన కారు ప్రమాదంలో ఫౌజా తీవ్రంగా గాయపడి మరణించాడు. సీసీటీవీ ఫుటేజ్ ద్వారా అమృత్‌పాల్ కారును గుర్తించారు. ప్రమాదం జరిగిన రెండు రోజుల తర్వాత కారు డ్రైవర్ అమృత్‌పాల్‌ను అరెస్టు చేశారు. ప్రమాదానికి కారణమైన పంజాబ్ రిజిస్ట్రేషన్ కలిగిన టయోటా ఫార్చ్యూనర్ కారును కూడా స్వాధీనం చేసుకున్నట్లు మీడియా వర్గాలు తెలిపాయి. పంజాబ్‌లో జన్మించిన ఫౌజా సింగ్ 1990 నుండి బ్రిటన్‌లో నివసిస్తున్నారు. 89 సంవత్సరాల వయస్సు నుండి ఆయన పరుగును సీరియస్‌గా తీసుకుంటున్నారు. ఆయన అనేక అంతర్జాతీయ మారథాన్‌లలో పాల్గొన్నారు. ఆయన ఏప్రిల్ 1, 1911న జన్మించారు. ఆయన ఐదు సంవత్సరాల వయస్సు వరకు నడవలేని చిన్న పిల్లవాడు తరువాత రన్నర్ అయ్యారు. ఆయన తన పిల్లలతో కలిసి బ్రిటన్‌కు వెళ్లిన తర్వాతే ప్రపంచ ప్రఖ్యాత రన్నర్ అయ్యారు.

## గాజా, లెబనాన్, సిరియాలపై బాంబు దాడులు

అంతర్జాతీయ సమాజం నుండి తీవ్రంగా నిరసనలు ఎదురవుతున్నా పట్టించుకోకుండా గాజాపై తన మిలటరీ అపరేషన్‌ను కొనసాగిస్తున్న ఇజ్రాయిల్ తాజాగా లెబనాన్, సిరియాలపై కూడా బాంబు దాడులకు దిగింది. తూర్పు లెబనాన్‌లోని బెకా లోయలో శరణార్థ శిబిరంపై జరిపిన వైమానిక దాడుల్లో 12మంది చనిపోయారు. మరో 8మంది గాయపడ్డారని లెబనాన్ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. సిరియాలోని సువారుడా ప్రాంతంపై కూడా బాంబు దాడులు జరపగా ఏడుగురు సిరియన్లు మరణించారు. మంగళవారం నాటి దాడుల్లో గాజాలో 30మంది మరణించారు. ఉత్తర గాజాలోని 16 ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు తక్షణమే ఖాళీ చేసి వెళ్ళిపోవాలని ఇజ్రాయిల్ ఆర్మీ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని సెటిలర్లు బురా? గ్రామంలో పాలస్తీనియన్ల వాహనాలకు, వారి ఇండ్లకు నిప్పంటించారు. ఇజ్రాయిల్ పాల్పడుతున్న ఈ హింసకు తక్షణమే స్వస్తి పలకాలని కోరుతూ చర్చి నేతలు, 20కి పైగా దేశాల దౌత్యవేత్తలు తైబే పట్టణంలో సమావేశమయ్యారు. ఈ సమావేశం జరిగిన కొద్ది గంటలకే సెటిలర్ల హింస మొదలైంది. ఇటీవలి వారాల్లో తూర్పు జెరూసలేంతో సహా ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనియన్లపై దాడులు, వేధింపులు, వారిని హత్య చేయడం వంటివి ఉధృతమయ్యాయని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కార్యాలయం హెచ్చరించింది. ఇప్పటివరకు 964మంది పాలస్తీనియన్లు మరణించగా, దాదాపు మూడువేలకు పైగా ఇళ్ళను కూల్చివేశారు. గాజాలో ఆహార శిబిరాల వద్ద జరిగిన దాడుల్లో మరణించిన వారి సంఖ్య 875కి చేరుకుందని ఐక్యరాజ్య సమితి కార్యాలయం తెలిపింది. ప్రతి పదిమంది పిల్లల్లో ఒకరు పోషకాహార లోపంతో తీవ్రంగా బాధపడుతున్నారని యూఎన్ఆర్‌డబ్ల్యూఏ వెల్లడించింది. ఇదిలావుండగా, కాల్పుల విరమణకు ఉద్దేశించి జరుగుతున్న చర్చలు నిలిచిపోలేదని, జరుగుతున్నాయని, కానీ చాలా ప్రారంభ దశలో వున్నాయని కతార్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. రెండు పక్షాల ప్రతినిధి బృందాలు దోహాలోనే వున్నాయి.

## 50 రోజుల్లో యుద్ధం ఆపకపోతే 100 శాతం టారిఫ్ తప్పదు



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రష్యాకు హెచ్చరిక చేశారు. 50 రోజుల్లో ఉక్రెయిన్‌తో ఒప్పందం చేసుకుని యుద్ధాన్ని ఆపాలని హుకుం జారీ చేశారు. లేదంటే 100 శాతం సుంకాలతో శిక్షిస్తానని స్పష్టం చేశారు. అయితే ఈ సుంకాల అమలు ఎలా ఉంటుందనే వివరాలు మాత్రం ఆయన చెప్పలేదు. పుతిన్ బాంబులు కురిపిస్తారు! నాటో సెక్రెటరీ జనరల్ మార్క్ రుట్టేతో ట్రంప్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై ట్రంప్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పుతిన్ పగలు చాలా అందంగా మాట్లాడతారని, కానీ రాత్రైతే బాంబులు కురిపిస్తారని అన్నారు. అసలు పుతిన్ ప్రవర్తన తనకు ఏమాత్రం నచ్చట్లేదని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధం విషయంలో ట్రంప్ విధానం మారే అవకాశం ఉందనే ఊహాగానాలు వస్తున్న వేళ, ఆయన ప్రత్యేక దూతగా విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ కీత్ కెల్లోగ్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమయ్యారు.

ఈ భేటీలో తమ గగనతల వ్యవస్థల్ని బలోపేతం చేయడం, సంయుక్త ఆయుధాల ఉత్పత్తి, అమెరికా నుంచి ఆయుధాల కొనుగోలు, రష్యాపై అంతర్జాతీయ ఆంక్షల్ని మరింత కఠినతరం చేయడానికి ఉన్న అవకాశాలు, తదితర అంశాలపై ఫలప్రదంగా చర్చలు సాగినట్టు జెలెన్‌స్కీ వెల్లడించారు. మరోవైపు రష్యాకు సాయం చేసే దేశాలపై 500 శాతం టారిఫ్‌లు విధించేలా బిల్లును రూపొందించినట్టు రిపబ్లికన్ సెనెటర్ లిండ్సే గ్రాహమ్ పేర్కొన్నారు.

ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలు అందించేందుకు ట్రంప్ అంగీకరించారని, రికార్డు స్థాయిలో ఆయుధాలతో పాటు, పేట్రియాట్ గగనతల రక్షణ వ్యవస్థను కీవ్‌కు పంపించనున్నారని గ్రాహమ్ వెల్లడించారు. ట్రంప్ కూడా స్వయంగా ఉక్రెయిన్‌కు మరిన్ని గగనతల రక్షణ వ్యవస్థలను అందజేయనున్నట్టు ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇవి కీవ్‌కు చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు.

## కొత్త పార్టీ ప్రకటించిన ఇమ్రాన్ ఖాన్ మాజీ భార్య



పాకిస్థాన్ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. జర్నలిస్ట్, పీటీఐ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ మాజీ అర్ధాంగి రెహమ్ ఖాన్ రాజకీయ పార్టీని ప్రకటించారు. ప్రజల సమస్యలను లేవనెత్తడంలో సామాన్యుడి గొంతుకగా నిలబడేందుకు 'పాకిస్థాన్ రిపబ్లిక్ పార్టీ'ని ప్రారంభించినట్లు రెహమ్ తెలిపారు.తాను గతంలో ఎప్పుడూ రాజకీయ పదవులు చేపట్టలేదని పేర్కొన్న ఆమె, ఒకసారి ఒక వ్యక్తి (ఇమ్రాన్ ఖాన్‌ను ఉద్దేశిస్తూ) కోసం పార్టీలో చేరానని చెప్పారు. కానీ ఈ రోజు తాను సొంతంగా రాజకీయాల్లోకి ప్రవేశించినట్లు వెల్లడించారు. ఇది కేవలం పార్టీ మాత్రమే కాదని, రాజకీయాలను సేవగా మార్చే ఉద్యమమని తెలిపారు.ప్రస్తుతం దేశ రాజకీయాలపై ప్రజల్లో పెరుగుతున్న నిరాశ, నిస్పృహ కారణంగా తాను పార్టీని స్థాపించినట్లు వెల్లడించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడమే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు. కరాచీ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. కష్టకాలంలో ఈ ప్రదేశం తనకు అండగా నిలిచిందని పేర్కొన్నారు. 2012 నుంచి ఇప్పటి వరకు పాకిస్థాన్‌లో తాగునీరు, కనీస వసతులు కరవయ్యాయని రెహమ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది చాలా దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. తనకు అధికారం చేపట్టడం ముఖ్యం కాదని, మార్పు కోసమే తమ పార్టీ పని చేస్తుందని తెలిపారు. కుటుంబ రాజకీయాలపై ఆమె విమర్శలు గుప్పించారు. ఎవరి మద్దతు లేకుండానే తమ పార్టీని ఏర్పాటు చేశామని తెలిపారు. పార్టీ మేనిఫెస్టోను త్వరలోనే విడుదల చేస్తామని రెహమ్ ఖాన్ ప్రకటించారు.

## నిమిష ప్రియ ఉరిశిక్ష వాయిదా

న్యూఢిల్లీ : యెమన్‌లో ఉరిశిక్షకు సిద్ధమవుతున్న కేరళ నర్సు నిమిష ప్రియకు ఊరట లభించింది. ఆమె ఉరిశిక్ష అమలు ప్రస్తుతానికి వాయిదా పడింది. ఈ విషయాన్ని అధికార వర్గాలు తెలియజేశాయి. 2017లో వ్యాపార భాగస్వామిని హత్య చేశారన్న ఆరోపణపై నిమిష ప్రియకు 2018లో ఉరిశిక్ష విధించారు. శిక్ష నుంచి తప్పించుకునేందుకు ఆమె చేసిన ప్రయత్నాలన్నీ విఫల మయ్యాయి. బాధిత కుటుంబానికి పరిహారం చెల్లిస్తే శిక్ష నుంచి బయటపడే అవకాశం ఉండడంతో ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే ఆ వివరాలు మాత్రం తెలియలేదు.

# చక్కని ఆరోగ్యం

## ఒకే బ్లడ్ గ్రూప్ ఉన్న జంటలకు పిల్లలు పుట్టరా..?

వివాహానికి ముందు రక్త పరీక్ష ఉద్దేశ్యం భవిష్యత్తులో పిల్లల ఆరోగ్యాన్ని కాపాడటం మరియు జంటకు సంతోషకరమైన మరియు ఆరోగ్యకరమైన వైవాహిక జీవితాన్ని నిర్ధారించడం. ఇది ఏదైనా ప్రమాదాన్ని ముందుగానే గుర్తించడంలో సహాయపడుతుంది. దానిని సమర్థవంతంగా నిర్వహించడంలో సహాయపడుతుంది. దంపతులిద్దరికీ ఒకే బ్లడ్ గ్రూప్ ఉంటే వారు బిడ్డను కనడంలో ఇబ్బంది పడతారనే అపోహ తరచుగా ప్రజలకు ఉంటుంది. వాస్తవానికి ఇది నిజం కాదు. ఒకే బ్లడ్ గ్రూప్ ఉన్న జంటలకు సాధారణంగా బిడ్డను కనడంలో ఎటువంటి సమస్యలు ఉండవని సూచిస్తున్నారు వైద్యులు.


ఒకే బ్లడ్ గ్రూప్ ఉండటం వల్ల బిడ్డ గర్భం దాల్చడంలో ఎటువంటి సమస్య ఉండదు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, స్పెర్మ్, గుడ్డుపై బ్లడ్ గ్రూప్ యాంటిజెన్‌లు ఉండవు. అందువల్ల ఇది పిండం ఫలదీకరణం, అభివృద్ధిపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపదు. ప్రధాన సమస్య రక్త వర్గం Rh కారకానికి సంబంధించినది. అలాగే ప్రధాన రక్త వర్గం (A, B, AB, O)కు సంబంధించినది కాదు. తల్లి బ్లడ్ గ్రూప్ Rh- నెగటివ్, తండ్రి బ్లడ్ గ్రూప్ Rh- పాజిటివ్ అయినప్పుడు ఈ సమస్య వస్తుంది. ఈ పరిస్థితిలో శిశువు Rh- పాజిటివ్ అయితే తల్లి శరీరం శిశువు రక్తాన్ని నెగటివ్ గ్రూప్‌గా గుర్తించి, ప్రతిరోధకాలను ఉత్పత్తి చేయడం ప్రారంభించవచ్చు. ప్రభావం: ఇది సాధారణంగా మొదటి గర్భధారణలో పెద్ద సమస్య కాదు. కానీ భవిష్యత్తులో గర్భధారణలో ఈ ప్రతిరోధకాలు శిశువు ఎర్ర రక్త కణాలను నాశనం చేస్తాయి. దీని వలన Rh- అనుకూలత అనే తీవ్రమైన పరిస్థితి ఏర్పడుతుంది. శిశువుపై ప్రభావం: ఇది శిశువులో రక్తహీనత, కామెర్లు లేదా కొన్ని సందర్భాల్లో మెదడు సంబంధిత సమస్యలను కలిగిస్తుంది. చికిత్స: ఈ రోజుల్లో ఈ సమస్యను Rh- నెగటివ్ గర్భిణీ స్త్రీలకు ఇచ్చే యాంటీ-డి ఇమ్యునోగ్లోబులిన్ ఇంజెక్షన్ ద్వారా సులభంగా నిర్వహించవచ్చు. వివాహానికి ముందు రక్త పరీక్ష చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తద్వారా తలెత్తే ఆరోగ్య సమస్యలను గుర్తించి నివారించవచ్చు లేదా నిర్వహించవచ్చు. దీనికి ప్రధాన కారణం రక్త గ్రూపు అనుకూలత కంటే చాలా ఎక్కువ.

Rh గ్రూప్ అనుకూలత: పైన చెప్పినట్లుగా ఇది చాలా ముఖ్యమైన అంశాలలో ఒకటి. తల్లి Rh- నెగటివ్, తండ్రి Rh- పాజిటివ్ అయితే శిశువు ఆరోగ్యంపై ప్రభావాలను నివారించడానికి ముందుగానే దీనిని తెలుసుకోవడం ముఖ్యం. తలసేమియా: ఇది తీవ్రమైన రక్త రుగ్మత. తల్లిదండ్రులు ఇద్దరూ తలసేమియా బాధితులైతే వారి బిడ్డకు తలసేమియా మేజర్ వచ్చే అవకాశం 25% ఉంటుంది. ఇది శిశువుకు ప్రాణాంతకం కావచ్చు. ఈ పరీక్ష ద్వారా దీనిని గుర్తించవచ్చు. సికిల్ సెల్ అనీమియా: ఇది కూడా జన్యుపరమైన రక్త రుగ్మత.



దీనిని వివాహానికి ముందు కూడా పరీక్షిస్తారు. లైంగికంగా సంక్రమించే అంటువ్యాధులు: HIV, హెపటైటిస్ B, హెపటైటిస్ C, సిఫిలిస్, గోనేరియా మొదలైన ఇన్ఫెక్షన్లను పరీక్షిస్తారు.

తద్వారా వాటికి చికిత్స చేయవచ్చు. అలాగే భాగస్వామికి లేదా బిడ్డకు ఇన్ఫెక్షన్ వ్యాపించకుండా నిరోధించవచ్చు. సాధారణ ఆరోగ్య తనిఖీ: ఏదైనా ఆరోగ్య సమస్యను గుర్తించడానికి హిమోగ్లోబిన్ స్థాయి (రక్తహీనత), రక్తంలో చక్కెర, మూత్రపిండాలు, కాలేయ పనితీరు మొదలైన వాటి సాధారణ పరీక్షలు కూడా చేస్తారు. వివాహానికి ముందు రక్త పరీక్ష ఉద్దేశ్యం భవిష్యత్తులో పిల్లల ఆరోగ్యాన్ని కాపాడటం మరియు జంటకు సంతోషకరమైన మరియు ఆరోగ్యకరమైన వైవాహిక జీవితాన్ని నిర్ధారించడం. ఇది ఏదైనా ప్రమాదాన్ని ముందుగానే గుర్తించడంలో సహాయపడుతుంది. దానిని సమర్థవంతంగా నిర్వహించడంలో సహాయపడుతుంది.



## వాకింగ్ తర్వాత ఎంతసేపటికీ నీరు తాగాలి?

నడక లేదా ఏదైనా వ్యాయామం ముగించిన 20-30 నిమిషాల తర్వాత మాత్రమే నీరు తాగాలి. ఈ సమయంలో కాసేపు కూర్చోవడం లేదా తేలికపాటి సాగదీయడం ద్వారా మీ శరీరాన్ని చల్లబరచండి. ఉదయం నడక లేదా ఏదైనా వ్యాయామం తర్వాత తరచుగా దాహం వేస్తుంది. చాలా మంది ఆలోచించకుండా వెంటనే నీరు తాగుతారు. కానీ నడక తర్వాత వెంటనే నీరు తాగడం మీ ఆరోగ్యానికి మంచిది కాదని మీకు తెలుసా? వ్యాయామం తర్వాత నీరు తాగడానికి సరైన సమయం, మార్గం ఉందని చాలా మందికి తెలియదు. మనం నడిచినప్పుడు లేదా వ్యాయామం చేసినప్పుడు మన శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. మనకు చెమట పడుతుంది. ఈ సమయంలో మన రక్త ప్రసరణ పెరుగుతుంది. శరీరం చల్లబడటానికి కొంత సమయం పడుతుంది. మనం వెంటనే నీరు తాగితే అనేక సమస్యలు తలెత్తుతాయి.

వేడిగా లేదా చల్లగా ఉండవచ్చు: శరీర ఉష్ణోగ్రత అకస్మాత్తుగా తగ్గడం వల్ల మీరు జలుబు లేదా గొంతు నొప్పి వంటి సమస్యలను ఎదుర్కోవచ్చు. కడుపు నొప్పికి కారణం కావచ్చు: తీవ్రమైన దాహం కారణంగా ఒకేసారి ఎక్కువ నీరు తాగడం వల్ల కడుపు నొప్పి లేదా తిమ్మిర్లు వస్తాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, నడక లేదా ఏదైనా వ్యాయామం ముగించిన 20-30 నిమిషాల తర్వాత మాత్రమే నీరు తాగాలి. ఈ సమయంలో కాసేపు కూర్చోవడం లేదా తేలికపాటి సాగదీయడం ద్వారా మీ శరీరాన్ని చల్లబరచండి. మీ పల్స్ రేటు సాధారణమైనప్పుడు, చెమట ఆగిపోయినప్పుడు నీరు తాగడం సరైనది. గోరువెచ్చని నీరు: చల్లటి నీరు తాగడం మానుకోండి. గోరువెచ్చని నీరు తాగడం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. హైడ్రేటెడ్ గా ఉండండి: మీ శరీరం ఎల్లప్పుడూ హైడ్రేటెడ్ గా ఉండటానికి, మీ నడక తర్వాత మాత్రమే కాకుండా, రోజంతా పుష్కలంగా నీరు తాగండి. మీరు ఎక్కువగా చెమట పడుతుంటే మీరు సాదా నీటికి బదులుగా కొబ్బరి నీరు లేదా నిమ్మకాయ నీరు కూడా తాగవచ్చు. సరైన సమయంలో సరైన పద్ధతిలో నీరు తాగడం వల్ల మీ శరీరం కోలుకోవడంలో సహాయపడుతుంది. మీకు ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. అందుకే తదుపరిసారి నడక నుండి తిరిగి వచ్చినప్పుడు కొంతసేపు వేచి ఉండి, ఆపై నెమ్మదిగా నీరు తాగాలి.

## వందలాది వ్యాధులకు మొనగాడి మెడిసిన్

ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మంచి ఆహారాన్ని తీసుకోవడం, అలాగే.. ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంభించడం ముఖ్యం.. అయితే.. అలాంటి మంచి ఆహారాల్లో మన పెరట్లో పెరిగే మునగ ఒకటి.. మునగ చెట్టును ఇంటి ముందు.. చిన్న స్థలంలో కూడా సులభంగా పెంచుకోవచ్చు.. మునగ కాయ మాత్రమే కాదు.. దాని ఆకులు కూడా తినడానికి చాలా రుచికరంగా ఉంటాయి. ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మంచి ఆహారాన్ని తీసుకోవడం, అలాగే.. ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంభించడం ముఖ్యం.. అయితే.. అలాంటి మంచి ఆహారాల్లో మన పెరట్లో పెరిగే మునగ ఒకటి.. మునగ చెట్టును ఇంటి ముందు.. చిన్న స్థలంలో కూడా సులభంగా పెంచుకోవచ్చు.. మునగ కాయ



మాత్రమే కాదు.. దాని ఆకులు కూడా తినడానికి చాలా రుచికరంగా ఉంటాయి. మునగ కాయతోపాటు.. మునగ ఆకుల్లో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. ముఖ్యంగా మునగ ఆకుల్లో యాంటీఆక్సిడెంట్లు, క్లోరోఫిల్, విటమిన్ సి, ప్రోటీన్, కాల్షియం మొదలైన శరీరానికి అవసరమైన అనేక పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి.. అందుకే.. ఈ ఆకులను పోషకాల నిధిగా పేర్కొంటారు.. మునగాకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. ఇది విటమిన్లు, ఖనిజాలు.. యాంటీఆక్సిడెంట్ల మంచి వనరు. మునగాకు రక్తపోటును నియంత్రించడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుందని..

ఇంకా, ఇది నొప్పిని తగ్గించడానికి, చర్మం.. జుట్టును సంరక్షించడానికి కూడా ఉపయోగపడుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఇలా.. అనేక పోషకాలతో నిండిన మునగాకులను మన రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల మధుమేహం, అధిక బిపి, గుండె జబ్బులు, కంటి సమస్యలు, ఆర్థరైటిస్ వంటి ఆరోగ్య సమస్యల నుండి మనల్ని దూరంగా ఉంచవచ్చని చెబుతున్నారు. అయితే.. మునగాకు ప్రధానంగా ఏ తీవ్రమైన ఆరోగ్య సమస్యల నుండి మనల్ని దూరంగా ఉంచుతుందో ఇప్పుడు తెలుసుకుందాం..

డయాబెటిస్:మునగాకులను డయాబెటిస్ ఉన్నవారికి దేవుడిచ్చిన వరంలా భావిస్తారు. దీని యాంటీ-డయాబెటిక్ లక్షణాలు శరీరంలో రక్తంలో చక్కెరను తగ్గించడంలో.. చక్కెరను నియంత్రణలో ఉంచడంలో ప్రభావవంతమైన సహజ ఔషధంగా పనిచేస్తాయి. అధిక రక్తపోటు: మునగాకుల్లో పొటాషియం పుష్కలంగా లభిస్తుంది. ఇది రక్త నాళాలు సరిగ్గా పనిచేయడానికి సహాయపడటం ద్వారా అధిక రక్తపోటును నియంత్రించడంలో ప్రయోజనకరంగా ఉంటుందని నిరూపించబడింది. క్యాన్సర్ వంటి తీవ్ర వ్యాధులను నియంత్రిస్తుంది:పాలకూరలో యాంటీఆక్సిడెంట్లు, జింక్, విటమిన్ సి వంటి ముఖ్యమైన పోషకాలు ఉన్న మునగాకును తినడం వల్ల క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులను నివారించవచ్చు. క్యాన్సర్ రోగులు దీనిని తినడం ద్వారా క్యాన్సర్ కణాలతో సమర్థవంతంగా పోరాడవచ్చు. జీర్ణవ్యవస్థ బాగుంటుంది: మునగాకులో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల, దాని వినియోగం జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఇది పొట్టలో పుండ్లు, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది.

## సమోసా, జిలేబికి కూడా సిగరెట్ తరహా హెచ్చరికలు



స్థానిక విక్రేతలు విక్రయించే ఆహార పదార్థాలపై ఆరోగ్య మంత్రిత్వ శాఖ సలహాలో ఎటువంటి హెచ్చరిక లేబుల్‌లు లేవని పీఐబీ స్పష్టం చేసింది. సాంప్రదాయ భారతీయ స్నాక్స్‌ను నిర్దిష్టంగా లక్ష్యంగా చేసుకోవడం లేదని కూడా ఇది ధృవీకరించింది. సమోసాలు, జిలేబీలు, లడ్డూలు వంటి ప్రసిద్ధ భారతీయ చిరుతిళ్లపై కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆరోగ్య హెచ్చరికలు జారీ చేసిందని ఇటీవల మీడియాలో వచ్చిన వార్తలను ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్-చెక్ యూనిట్ మంగళవారం తోసిపుచ్చింది. స్థానిక విక్రేతలు విక్రయించే ఆహార పదార్థాలపై ఆరోగ్య మంత్రిత్వ శాఖ సలహాలో ఎటువంటి హెచ్చరిక లేబుల్‌లు లేవని పీఐబీ స్పష్టం చేసింది. సాంప్రదాయ భారతీయ స్నాక్స్‌ను నిర్దిష్టంగా లక్ష్యంగా చేసుకోవడం లేదని కూడా ఇది ధృవీకరించింది. వీటిపై కేంద్ర మంత్రిత్వశాఖ హెచ్చరిక లేబుల్ జారీ చేసిందని సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని పేర్కొంది. ఈ మేరకు పీఐబీ Xలో ఒక పోస్ట్‌లో పేర్కొంది. కొన్ని మీడియా నివేదికలు సమోసాలు, జిలేబీ, లడ్డూ వంటి ఆహార ఉత్పత్తులపై ఆరోగ్య హెచ్చరిక జారీ చేసిందని పేర్కొన్నాయని, ఇలాంటి సమాచారంలో ఎలాంటి నిజం లేదని తెలిపింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సలహాలో విక్రేతలు విక్రయించే ఆహార ఉత్పత్తులపై ఎటువంటి హెచ్చరిక లేబుల్‌లు జారీ చేయలేదని తెలిపింది. అయితే జంక్ ఫుడ్ ను సిగరెట్ల వలె ప్రమాదకరమని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ లెబుల్ జారీ చేసిందని, పెరుగుతున్న ఊబకాయాన్ని ఎదుర్కోవడానికి, ఆరోగ్య మంత్రిత్వ శాఖ సమోసాలు, జిలేబీలు వంటి డీప్-ఫ్రై చేసిన స్నాక్స్‌లకు సిగరెట్ ప్యాక్‌లపై ఉన్నటువంటి ఆరోగ్య హెచ్చరికలను ఆదేశించిందని సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై పీఐబీ స్పందించి క్లారిటీ ఇచ్చింది. ఇందులో నిజం లేదని తెలిపింది.

## బోడకాకరతో బోలెడు లాభాలు!



బోడ కాకరకాయ తెలియని వారు ఎవరుంటారు చెప్పండి. వీటితో కర్రీ వండితే ఉండే టేస్ట్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అయితే బోడ కాకర కర్రీతో రుచి మాత్రమే కాదండోయ్, అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంట. బోడ కాకర కాయను కూరగాయల్లోనే కింగ్ అంటారు. ఎందుకంటే చికెన్, మటన్‌లో లభించనన్ని పోషకాలు ఇందులో లభిస్తాయి. అందుకే చాలా మంది బోడ కాకర కాయ తినాలని చెబుతుంటారు. మరీ ముఖ్యంగా వర్షకాలంలో ఇవి ఎక్కువగా లభిస్తుంటాయి. అయితే ఈ సీజన్‌లో బోడ కాకర తినడం వలన వైరల్ ఇన్ఫెక్షన్స్ దరి చేరవంట. ఇందులో అన్నిరకాల విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. అందుకే ప్రతి ఒక్కరూ ఈ కాకరను మీ డైట్‌లో చేర్చుకోవాలని చెబుతుంటారు. బోడ కాకరలో శరీరానికి కావాల్సిన అనేక పోషకాలు లభిస్తాయి. విటమిన్స్,అమైనో ఆమ్లాలు, ఫ్లేవనాయిడ్స్, పోటాషియం, ఫాస్పరస్, ఇవన్నీ ఉంటాయి. అందుకే వర్షకాలంలో తప్పకుండా వీటిని తినాలంటారు. అదే విధంగా డయాబెటీస్ ఉన్న వారు వర్షాకాలంలో బోడ కాకర కాయను తినడం వల ఇది రక్తంలోని చక్కర స్థాయిలను నియంత్రిస్తుందంట. ఇందులో గ్లైసెమిక్ ఎక్కువగా ఉండటం వలన ఇది డయాబెటీస్ రోగులకు చాలా మేలు చేస్తుందంట. అదేవిధంగా బోడకాకరలో విటమిన్ సీ పుష్కలంగా ఉంటుంది. అలాగే ఆల్కలాయిడ్స్, ఫ్లేవనాయిడ్స్, ఫాస్పరస్ వంటివి ఎక్కువ మోతాదులో ఉంటాయి. అందు వలన బోడ కాకరను తినడం వలన క్యాన్సర్ వంటి సమస్యలు దరి చేరవంట. అంతే కాకుండా ఇది రక్త పోటు ప్రమాదాన్ని తగ్గించి, గుండె సమస్యలు రాకుండా చేస్తుందంట. అలాగే బోడ కాకరలో విటమిన్ సి, కాల్షియం పుష్కలంగా ఉంటుంది. అందువలన ఇది ఎముకల బలానికి చాలా మంచిది. అలాగే దీనిని వర్షాకాలంలో తినడం వలన వైరల్ ఇన్ఫెక్షన్స్, జలుబు, దగ్గు , వైరల్ ఫీవర్స్ నుంచి రక్షణ కలిపిస్తుందంట. అంతే కాకుండా బోడ కాకరలో ఎక్కువ మోతాదులో పొటాషియం ఉండటం వలన ఇది రక్తపోటు సమస్యతో బాధపడే వారికి మంచి ఔషధం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. బరువు తగ్గాలి అనుకునే వారికి కూడా బోడ కాకర చాలా మంచిదంట. దీనిని ప్రతి రోజూ తినడం వలన ఇది బరువును నియంత్రిస్తుందంట. ఎందుకంటే? బోడ కాకరలో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. అందువలన దీనిని ప్రతి తీరోజూ తీసుకుంటే, ఇది కడుపు నిండిన భావన కలిగి అధిక ఆకలిని నియంత్రిస్తుంది. జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది.

## ఈ సీజనల్ పండుతో ఎన్నో లాభాలు..

అటువంటి వాటిల్లో నేరేడు పండ్లు ముఖ్యమైనవి. వీటిల్లో విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. ఆయుర్వేద నిపుణుల అభిప్రాయం ప్రకారం..నేరేడు పండు తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. ఇది శరీరాన్ని చల్లగా ఉంచడంలో సహాయపడుతుంది. నేరేడు పండులో విటమిన్ సి, బి12, ఐరన్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి.

ఖనిజాలు, ఫైబర్‌కు ఇవి మూలం. ఈ పండును క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. నేరేడు పండ్లలో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. నేరేడు పండ్లు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.

ఈ పండ్లలో ఆంథోసైనిన్లు ఉంటాయి. ఇవి శరీరంలోని కణాలకు చాలా మంచివని నిపుణులు చెబుతారు. ఈ పండ్లలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తహీనతను తగ్గిస్తుంది. నేరేడు పండ్లలో కేలరీలు చాలా తక్కువగా ఉండటం వల్ల, బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇవి సహాయపడతాయి.

ఇందులో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఫలితంగా, దీనిని తిన్న తర్వాత కడుపు నిండినట్లు అనిపిస్తుంది. ఇది అతిగా తినే అలవాటును నియంత్రించడంలో సహాయపడుతుంది. కాబట్టి బరువు తగ్గడంలో హెల్ప్ చేస్తుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఆరోగ్యకరమైన వ్యక్తి రోజులో దాదాపు 200 గ్రాముల వరకు నేరేడు పండ్లు తినవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# సినిమా




## అతడి మాటల్ని తప్పుగా అర్థం చేసుకుంటున్నారు

తన మాటలు, చేతలతో కాంట్రవర్సీలకు కేరాఫ్ అయిన విజయ్ దేవరకొండ ప్రస్తుతం చాలా సైలెంట్ అయిపోయాడు. మరో 15 రోజుల్లో ఇతడు నటించిన 'కింగ్డమ్' సినిమా థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నెమ్మదిగా ప్రమోషన్లు మొదలుపెట్టారు. నిర్మాత నాగవంశీ లేటెస్ట్‌గా ఓ ఇంటర్వ్యూ ఇచ్చారు. చిత్ర విశేషాలతో పాటు విజయ్ దేవరకొండని నెటిజన్లు టార్గెట్ చేయడం గురించి కూడా మాట్లాడారు. కారణం లేకుండానే అలా చేస్తున్నారని తన అభిప్రాయాన్ని చెప్పుకొచ్చారు. 'విజయ్ దేవరకొండని అందరూ తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. అలానే కారణం లేకుండా అతడిని ఎందుకు టార్గెట్ చేస్తున్నారో నాకు అర్థం కావట్లేదు. 'రెట్రో' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్?లో కావొచ్చు, రీసెంట్‌గా బాలీవుడ్ ఇంటర్వ్యూలో కావొచ్చు.. అతడు మాట్లాడింది వేరే అర్థం వచ్చేలా మార్చేస్తున్నారు' అని నాగవంశీ చెప్పుకొచ్చాడు. విజయ్ దేవరకొండ విషయానికొస్తే కెరీర్ ప్రారంభంలో పెళ్లి చూపులు, అర్జున్ రెడ్డి, గీతగోవిందం తదితర సినిమాలతో సక్సెస్ అందుకున్నాడు. దీంతో తర్వాత సినిమాల ప్రీ రిలీజ్ ఫంక్షన్లలో ఆటిట్యూడ్‌తో మాట్లాడేవాడు. ఈ విషయమై సోషల్ మీడియాలో గట్టిగానే ట్రోల్స్ వచ్చేవి. అందుకు తగ్గట్లు గత కొన్నేళ్లుగా ఇతడు చేసిన సినిమాలన్నీ బాక్సాఫీస్ దగ్గర ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయాయి. మరీ ముఖ్యంగా గత రెండు చిత్రాలు లైగర్, ఫ్యామిలీ స్టార్ అయితే ఘోరమైన రిజల్ట్ అందుకున్నాయి. అందుకే ఇప్పుడు విజయ్ పూర్తిగా సైలెంట్ అయిపోయాడు. హిట్ కొట్టిన తర్వాత మాట్లాడుదాం అనుకుంటున్నారు. 'కింగ్డమ్'.. జూలై 31న థియేటర్లలోకి రానుంది. మరోవైపు రాహుల్ సంక్రిత్యాన్ తోఓ సినిమా, దిల్ రాజు నిర్మాణంలో 'రౌడీ జనార్ధన్' అని మరో మూవీ విజయ్ దేవరకొండ చేస్తున్నాడు. ఈ మూడు కూడా సక్సెస్ అయితేనే విజయ్ కెరీర్ పరంగా నిలబడతాడు. లేదంటే మాత్రం రేసులో వెనకబడిపోతాడు.



## గ్లామరస్ లుక్‌లో అదరగొడుతున్న శ్రేయా చౌదరి

## ఆర్ఆర్ఆర్ చూసి.. 'వీళ్లతోనేనా నేను యాక్ట్ చేసింది' అని ఫీలయ్యా



జెనీలియా..ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్. ఆమె కోసమే సినిమాకు వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి. బాయ్స్, సత్యం, బొమ్మరిల్లు, హ్యాపీ, రెడీ, ఢీ చిత్రాలు సూపర్ హిట్‌గా నిలవడంలో జెనీలియా కీలక పాత్ర పోషించింది. ముఖ్యంగా బొమ్మరిల్లు బ్లాక్ బస్టర్ హిట్ అయిందంటే కారణం.. హాసిని పాత్రలో జెనీలియా కనబర్చిన నటననే. ఇప్పటికీ జెనీలియా అనగానే అందరికి హాసిని పాత్రే గుర్తొస్తుంది. ఆ ఒక్క సినిమాతో జెనీలియా స్టార్ హీరోయిన్‌గా మారిపోయింది. ఆ తర్వాత ఎన్టీఆర్, బన్నీ, రామ్ చరణ్, రామ్ పోతినేని..ఇలా అప్పటి యంగ్ హీరోలందరితోనూ నటించింది. కెరీర్ పీక్స్‌లో ఉండగానే పెళ్లి చేసుకొని సినిమాలకు దూరమైంది. దాదాపు పదమూడేళ్ల తర్వాత మళ్లీ తెలుగు తెరపై కనిపించబోతుంది ఈ అల్లరి బ్యూటీ. ప్రముఖ వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా నటిస్తున్న తొలి సినిమా 'జూనియర్'లో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా జెనీలియా మీడియాతో మాట్లాడుతూ.. టాలీవుడ్ స్టార్ హీరోలైన ఎన్టీఆర్, రామ్ చరణ్, అల్లు అర్జున్‌లపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వారితో కలిసి నటించినప్పుడు ఇంత గొప్ప స్టార్స్ అవుతారని ఊహించలేదని చెబుతోంది. ఇప్పుడు వాళ్లను స్టార్ హీరోలుగా చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. 'ఆర్ఆర్ఆర్ సినిమాలో ఎన్టీఆర్, రామ్ చరణ్‌లను చూసి.. 'వీళ్లతోనేనా నేను నటించాను' అనుకున్నా. ఎన్టీఆర్ చాలా గొప్ప నటుడు అని ఎప్పుడు చెబుతుంటాను. నిజంగా ఆయన సినిమా ఇండస్ట్రీకి ఒక వరం అని చెప్పాలి. మూడు పేజీల డైలాగుని కూడా సింగిల్ టేక్‌లో చెబుతుంటాడు. రామ్ చరణ్ అమెజింగ్. అతనితో కలిసి ఆరెంజ్ సినిమా చేశాను. ఆర్ఆర్ఆర్‌లో ఆయన ఫెర్ఫార్మెన్స్ బాగుంది. ఇక అల్లు అర్జున్.. చాలా ఎనర్జిటిక్ పర్సన్. హ్యాపీ సినిమా షూటింగ్ సమయంలో ఆయన చాలా హుషారుగా ఉండేవాడు. ఇప్పుడు వీరందరిని పాన్ ఇండియా స్టార్స్‌గా చూస్తుంటే చాలా హ్యాపీగా ఉంది' అని జెనీలియా చెప్పుకొచ్చింది. అలాగే ఇటీవల మరణించిన కోటా శ్రీనివాస్‌రావు గురించి మాట్లాడుతూ.. 'ఆయన గొప్ప నటుడు. బొమ్మరిల్లు సినిమా షూటింగ్ సమయంలో ఆయన నుంచి చాలా నేర్చుకున్నాను. ఎలా నటించాలో చెప్పేవారు. ఆయనతో కలిసి రెడీ కూడా చేశాను. ఆయన మరణవార్త వినగానే దిగ్భ్రాంతికి గురయ్యాను. అంతగొప్ప నటుడితో స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం రావడం నా అదృష్టం' అని జెనీలియా చెప్పింది.

## వార్2లో ఆ సీన్‌కి బొమ్మ చిరిగిపోవడం ఖాయమట.. నాగ వంశీ కామెంట్స్‌కి అంచనాలు పీక్స్‌కి

ఇండియన్ సినిమా స్థాయిని అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లే లక్ష్యంతో యష్ రాజ్ ఫిలింస్ నిర్మిస్తున్న భారీ మల్టీ స్టారర్ చిత్రం వార్ 2. ఇప్పుడు ఈ మూవీ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కలిసి నటిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి తాజా వివరాలు సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. ఇప్పటికే సినిమా షూటింగ్ పూర్తి కాగా, టీజర్ విడుదల తరువాత కొంత మేర నెగెటివ్ రెస్పాన్స్ వచ్చింది. ప్రమోషన్స్ ముమ్మరంగా మొదలవకపోవడం కూడా అభిమానుల్లో నిరాశ కలిగించింది. తాజాగా ఈ సినిమాను తెలుగులో విడుదల చేయనున్న సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీ చేసిన కామెంట్లు మళ్లీ హైప్‌ను క్రియేట్ చేశాయి. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో నాగవంశీ మాట్లాడుతూ, ఎన్టీఆర్ ఇంట్రడక్షన్ సీన్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఆ సీన్ బాగా వచ్చింది. స్క్రీన్ చిరిగిపోతుంది!" అంటూ ఎన్టీఆర్ మాస్ ఎంట్రీపై భారీ క్రేజ్‌ను క్రియేట్ చేశారు. అభిమానులు ఆ సీన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అంతేకాదు, ఈ సినిమా రైట్స్ ఎందుకు దక్కించుకున్నారనే ప్రశ్నకు ఆయన ఇచ్చిన సమాధానం మరింత ఆసక్తికరంగా ఉంది. "హృతిక్ – ఎన్టీఆర్ స్క్రీన్ షేర్ చేసుకుంటారనే ఆలోచనే నాకు బేస్. వారిద్దరి మధ్య వార్ ఎలా ఉంటుందో చూడాలని ఈ సినిమాను తీసుకున్నాను అని నాగవంశీ వెల్లడించారు. ఈ సినిమాకు 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నాడు.



# బనకచర్లతో ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం ఉండదు

-మొదటిపేజీ తరువాయి

గంటన్నరపాటు సీఎస్‌లు, నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు.

**బనకచర్లతో ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం ఉండదు: ఏపీ**

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు అనుసంధానం సింగిల్ పాయింట్ అజెండాను ప్రతిపాదించిన ఏపీ.. ఈ ప్రాజెక్టు లక్ష్యాలను నివేదిక రూపంలో సమర్పించింది. సముద్రంలో వృథాగా కలిసే జలాలనే వినియోగిస్తామని వివరించింది. ఈ సందర్భంగా గోదావరిలో వందేళ్ల సరాసరి ప్రవాహాల గణాంకాలను పేర్కొంది. ఏటా 3వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని తెలిపింది. బనకచర్ల ద్వారా గరిష్ఠంగా 200 టీఎంసీలే తరలిస్తామని వివరించింది. ఈ ప్రాజెక్టు వల్ల ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం ఉండదని..11 ఏళ్లుగా తెలంగాణలో కట్టిన ఏ ప్రాజెక్టుకూ అభ్యంతరం చెప్పలేదని పేర్కొంది. దిగువ రాష్ట్రంగా తమ చర్యలను తెలంగాణ, కేంద్ర ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరింది.

**తెలంగాణ ప్రతిపాదించిన 13 అంశాలివే..**

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకానికి అనుమతులు ఇవ్వాలి.

శ్రీశైలం నుంచి వేరే బేసిన్‌కి ఆంధ్రప్రదేశ్ నీటి తరలింపు పనులను వెంటనే ఆపేయాలి



ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రారంభించిన ప్రాజెక్టులకు సహకరించేలా కృష్ణా ట్రైబ్యునల్‌లో మద్దతుగా వాదించేలా ఏపీని ఒప్పించాలి

కృష్ణానదీ జలాలను వేరే బేసిన్‌కు తరలించకుండా కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు చర్యలు తీసుకునేలా ఆదేశించాలి. కృష్ణా జలాలను అక్రమ తరలింపును అడ్డుకునేందుకు టెలిమెట్రీలను ఏర్పాటు చేసేందుకు ఏపీ అంగీకరించాలి.

తుంగభద్ర బోర్డు నీటి తరలింపుపై చర్చించాలి.

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై ఎన్జీటీ ఉత్తర్వులను అమలు చేసే విధంగా కేంద్ర జలశక్తి శాఖ చర్యలు తీసుకోవాలి. ఈ పథకంపై చట్టపరంగానే ముందుకు వెళ్లాలి.

శ్రీశైలం కుడి కాలువ ద్వారా ఎక్కువ నీటి తరలింపును నియంత్రించాలి.

శ్రీశైలం ప్రాజెక్టులో కొత్త ప్రాజెక్టులు హంద్రీనీవా, వెలిగొండ, గురు రాఘవేంద్ర నిర్మాణాలను నియంత్రించాలి.

శ్రీశైలం డ్యాం సేఫ్టీకి తగిన చర్యలు తీసుకోవాలి.

శ్రీశైలం నుంచి నీటి తరలింపు ద్వారా విద్యుత్ ఉత్పత్తికి తీవ్ర విఘాతం కలుగుతోంది.. దీనిని అడ్డుకోవాలి.

పోలవరం ప్రాజెక్టు తరహాలోనే ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలి. ఇచ్చంపల్లి నుంచి కావేరికి గోదావరి జలాల తరలింపుకు మేము సిద్ధం. అందులో 200 టీఎంసీల నీటిని వాడుకునేందుకు అనుమతులు ఇవ్వాలి.

సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వాలి.

ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు ఏఐబీపీ కింద నిధులు ఇవ్వాలి. మహారాష్ట్ర ప్రభుత్వంతో కేంద్ర ప్రభుత్వమే చర్చలు జరిపి తుమ్మిడి హట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి సహకరించాలి.

# మళ్లీ యనమల యాక్టివ్

**కాకినాడ :** సీనియర్ నేత మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిలో మళ్లీ ఆశలు పెరిగాయి. మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజుకు గవర్నర్ పదవి దక్కడంతో తనకు కూడా పార్టీ హైకమాండ్ ఏదో ఒక పదవి ఖచ్చితంగా ఇస్తుందన్న నమ్మకం పెరిగిపోయిందట. అశోక్ గజపతిరాజు లాగానే తాను కూడా పార్టీలో సీనియర్ నేత కావడంతో పాటు క్లిష్ట సమయంలో చంద్రబాబు కు అండగా నిలబడటంతో తనకు ఖచ్చితంగా పదవి లభిస్తుందన్న భావనలో ఉన్నారు. అశోక్ గజపతి రాజు కుమార్తె ఆదితి గజపతి రాజుకు కూడా గత ఎన్నికల్లో విజయనగరం టిక్కెట్ ఇవ్వగా, యనమల కుమార్తె దివ్యకు తుని నియోజకవర్గం టిక్కెట్ ఇచ్చింది. తునిలో యనమల దివ్య గెలిచింది. సుదీర్ఘకాలం తర్వాత తుని నియోజకవర్గంలో టీడీపీ గెలిచింది. ఎమ్మెల్సీ పదవి ఇవ్వకపోవడంతో తనకు పెద్దల సభకు పంపాలని యనమల రామకృష్ణుడు బలంగా కోరుకుంటున్నారు. పార్టీ కోసం ఇప్పటి వరకూ తాను చేసిన కృషి, పడిన శ్రమను హైకమాండ్ గుర్తించకపోతుందా? అని యనమల బలంగా నమ్ముతున్నారు. అందుకే ప్రస్తుతం యనమల రామకృష్ణుడు మౌనంగానే ఉంటున్నారు. అదే సమయంలో తుని నియోజకవర్గానికే పరిమితమయ్యారు. అలాగని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మీద విమర్శలు మానుకోలేదు. అంటే ఖచ్చితంగా చంద్రబాబు తనవైపు చూస్తారని యనమల గట్టిగా విశ్వసిస్తున్నారు. తనలాంటి సీనియర్ నేతలను, సామాజివర్గానికి చెందినవారిని పక్కన పెట్టే అవకాశం లేదని కూడా అంచనా వేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ... ఆయన వయసుతో పాటు కొన్ని ప్రత్యేక పరిస్థితులు టీడీపీ అధినాయకత్వం మంత్రిపదవికి దూరం పెట్టింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ యనమల రామకృష్ణుడు మంత్రి పదవిలో ఉంటారు. ఆయనకు తూర్పు గోదావరి జిల్లా నుంచి నియోజకవర్గం ఫిక్స్ అయినట్లేనని



ఎవరైనా లెక్కలు వేసుకుంటారు. పైగా చంద్రబాబుకు యనమల అత్యంత సన్నిహితుడిగా ముద్రపడింది. అనేక కష్ట సమయాల్లో పార్టీకి అండగా నిలిచారన్న పేరు కూడా పార్టీలో యనమల రామకృష్ణుడికి ఉంది. సీనియర్ నేత అయినా ఆయన సేవలను ఉపయోగించుకుంటారని అందరూ భావించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యనమల రామకృష్ణుడుకు మంత్రివర్గంలో చోటు దక్కకపోవడంతో అప్పుడే కొంత సందిగ్ధత మొదలయింది.. గత వైసీపీ హయాంలో మూడు రాజధానుల ప్రతిపాదన పెట్టినప్పుడు యనమల రామకృష్ణుడు శాసనమండలిలో తన రాజకీయ చతురతను ఉపయోగించి బిల్లు ఆమోదం పొందకుండా అడ్డుకోగలిగారు. ఇలా ఎలా చూసినా యనమల రామకృష్ణుడికి పదవి గ్యారంటీ అన్న ప్రచారం ఊపందుకుంది. మరొక వైపు అశోక్ గజపతిరాజుకు కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన ఏడాది తర్వాత గోవా గవర్నర్ గా నియమించడంతో ఇక తనను కూడా ఇటు రాజ్యసభ కు కాని, అటు గవర్నర్ గా పంపుతారన్న నమ్మకం యనమల రామకృష్ణుడి వర్గంలో పెరిగిపోయింది. అందుకే ఇక యనమల రానున్న రోజుల్లో మరింత యాక్టివ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరి హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటున్నది భవిష్యత్ లో తేలనుంది.

# లిక్కర్ ఫైల్స్ కొలిక్కి వచ్చినట్టేనా ఇవాళ చార్జ్‌షీట్ దాఖలు

**విజయవాడ :** అసలు ఎపిసోడ్ ఇప్పుడే స్టార్ట్ అయింది. అరెస్టులు, విచారణలు, కస్టడీలు..ఇవన్నీ ఆల్‌మోస్ట్ కంప్లీట్ అయినట్లే. కానీ కీలక దశలో ఉన్న లిక్కర్ కేసులో నిందితులకు బెయిల్ రాకుండా అడ్డుకోవడమే సిట్ ముందున్న ప్రధాన లక్ష్యం. అందుకోసం కోర్టులో సబ్‌మిట్ చేసేందుకు పకడ్బందీగా ఆధారాలు సేకరిస్తోందట సిట్. ముడుపుల వ్యవహారం ఏంటి..ఎవరెవరికి లింకులు ఉన్నాయి..ఏ నెంబర్ కార్లు వాడారు..ఫోన్ సంభాషణలు ఏంటి..ఇలా ప్రతీ ఒక్కటి పక్కా స్కెచ్ ప్రకారం జరిగిందని ప్రూవ్ చేసేందుకు తీవ్ర కసరత్తే చేస్తోందట సిట్ టీమ్. లేటెస్ట్ టెక్నాలజీతో మద్యం ముడుపుల వీడియోలను సేకరించినట్లు తెలుస్తోందిడెన్లలో దాచిన డబ్బులు, వాటిని నిందితులు సెల్‌ఫోన్లలో షూట్ చేసిన వీడియోలు దొరికినట్లు చెబుతున్నారు. నిందితుల నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్ల నుంచి ఈ వీడియోలను స్వాధీనం చేసుకున్నారని అంటున్నారు. ఎన్నికల తర్వాత నిందితులు ముందు జాగ్రత్తగా తమ సెల్‌ఫోన్ల నుంచి ఆ వీడియోలను డిలీట్ చేశారట. అధికారులు ఆ సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి పంపి డిలీట్ చేసిన వీడియోలను రిట్రీవ్ చేశారని చెప్పుకుంటున్నారు.మద్యం డీలర్ల నుంచి ముడుపులు వసూలు చేశాక పెద్దలకు చేరవేసేవరకు..అంతా లిక్కర్ స్కామ్‌లో కీలక సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డి డైరెక్షన్‌లో జరిగిందట. నిందితులు లిక్కర్ సొమ్ము పంపిణీకి ముందు వీడియోలు తీశారని అంటున్నారు. డెన్లలో దాచిన డబ్బుల వివరాలను సెల్‌ఫోన్లలో వీడియోలు తీసి పెట్టుకున్నారట. ఎన్నికల తర్వాత అలర్ట్ అయిన రాజ్ కసిరెడ్డి తాను ఏర్పాటు చేసుకున్న వసూళ్ల నెట్‌వర్క్‌లోని ప్రతి వ్యక్తినీ హైదరాబాద్‌కు పిలిపించి వారి సెల్‌ఫోన్లు తీసుకున్నాడని విచారణలో తేలిందంటున్నారు.ప్రతి ఫోన్‌కూ కనీసం లక్ష రూపాయలకు తగ్గకుండా ఇచ్చి కొత్త ఫోన్ తీసుకోవాలని సూచించాడట. ఇక లిక్కర్ ఆర్డర్లు పెట్టిన కంప్యూటర్లను డిపోల్లో ధ్వంసం చేశారట. అయినా కొన్ని వీడియో ఫుటేజ్‌లతో పాటు చాటింగ్‌లు, ఫొటోలు బయటపడ్డట్లు తెలుస్తోంది. సిట్ అధికారులు త్వరలో దాఖలు చేయనున్న చార్జిషీట్‌లో ఈ ఆధారాలను పొందుపరచనున్నట్లు తెలుస్తోంది.లిక్కర్ కేసులో ఓ స్కెచ్ ప్రకారం దోపిడీ జరిగిందని విచారణలో తేలిందంటున్నారు. సిట్ ఇప్పటి వరకూ 40 మందిని నిందితులుగా చేర్చింది. రాజ్ కసిరెడ్డితో పాటు మాజీ సీఎం జగన్ సెక్రటరీ ధనుంజయ్ రెడ్డి, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు తొమ్మిది మందిని అరెస్టు చేసింది. సాక్షులు, అనుమానితులను 200మందికి పైగా విచారించింది. ఈ కేసులో భాగస్వామ్యం ఉన్న పది మందికిపైగా విదేశాలకు పారిపోయారు. ఈ కేసు విచారణలో మూడు నెలలకు పైగా సిట్ సేకరించిన ఆధారాలు ఈ నెల 17న విజయవాడ ఏసీబీ కోర్టుకు చేరనున్నాయి.మద్యం ముడుపుల వసూళ్లు, డెన్‌లలో దాచడం, కీలక వ్యక్తులకు పంపడం, ఎన్నికల్లో అభ్యర్థులకు పంపిణీ చేయడం, కీలక వ్యక్తుల పాత్ర, బినామీల ఆస్తులు, హవాలా మార్గంలో విదేశాలకు తరలించడం వంటివి చార్జిషీట్‌లో మెన్షన్ చేసే అవకాశం ఉందంటున్నారు. పది రోజులకు పైగా ఇదే పనిలో బిజీగా ఉన్న సిట్ అధికారులు లీగల్ ఎక్స్‌పర్ట్స్‌తో చర్చిస్తున్నారట. సూత్రధారులెవరు, పాత్రధారులెవరనే దానిపై టెక్నికల్ ఎవిడెన్స్‌తో పక్కా ఆధారాలను సేకరించి కోర్టులో చార్జిషీట్ వేయబోతున్నారట.ఎక్సైజ్ అధికారులు, గత ప్రభుత్వ పెద్దలు, వైసీపీ నేతల పాత్రపై కూడా ఇప్పటివరకు తాము కలెక్ట్ చేసి అన్ని ఎవిడెన్స్‌ను సిట్ కోర్టుకు సబ్‌మిట్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 21 నాటికి రిమాండ్ ఖైదీగా రాజ్ కసిరెడ్డి జ్యుడీషియల్ కస్టడీ 90 రోజులు పూర్తి అవుతుంది. ఈ లోపు చార్జిషీట్ వేయకపోతే డిఫాల్ట్‌గా బెయిల్ వస్తుంది. దీంతో ప్రధాన నిందితుడిగా అలిగేషన్స్ ఫేస్ చేస్తున్న రాజ్‌కసిరెడ్డి బయటికి వస్తే..కేసు మొత్తం తారుమారైపోతుందని సిట్ భావిస్తోందట. అందుకే చాలా పకడ్బందీగా..లీగల్ ఎక్స్‌పర్ట్స్ ఒపీనియన్‌తో చార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు సమాచారం.ఓ వైపు విజయసాయిరెడ్డి సిట్ విచారణ బాకీ ఉంది. ఇప్పటికే ఆయన ఓ సారి సిట్ ముందుకెళ్లి..ఇన్ అండ్ ఔట్ అంతా చెప్పేసి..అందరినీ ఇరకాటంలో పెట్టేశారు. ఇప్పుడు మరోసారి ఆయన సాక్షిగా సిట్ ముందు హాజరుకాబోతున్నారు. ఈసారి విజయసాయి ఏం చెప్తారనే టెన్షన్ ఓ వైపు కొనసాగుతూనే ఉంది. ఇక ఇప్పుడు ఛార్జిసీట్ అంశం ఇంకా ఉత్కంఠ రేపుతోంది. రాజ్‌కసిరెడ్డికి బెయిల్ రావడం..రాకపోవడం పక్కన పెడితే..ఆయనతో ఎవరికి లింకులు ఉన్నాయని సిట్ ఆరోపిస్తుందో..ఎలాంటి ఆధారాలను బయటపెడుతుందోనన్న ఆందోళన అయితే ఫ్యాన్ పార్టీ పెద్దల్లో కనిపిస్తుందం టున్నారు.

## ఏడాదిలో 10లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం

-మొదటిపేజీ తరువాయి

చాలా అవకాశాలు ఉన్నాయి. విశాఖ, విజయవాడ, తిరుపతి వ్యాపారానికి అనుకూల నగరాలు. విశాఖకు గూగుల్ రాబోతోంది. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం పీ-4 పాలసీ తీసుకొచ్చాం" అని చంద్రబాబు వివరించారు.

## కరేడు రైతులను తరిమేయాలని చూస్తున్నారు

-మొదటిపేజీ తరువాయి

అనుబంధ పరిశ్రమ గుడ్లూరు మండలం చేవూరు, రావూరులో భూములు ఇచ్చేందుకు రైతులను ఒప్పించాం. ఇందుకోసం ఇండోసోల్ కంపెనీతోనే సుమారు రూ.500 కోట్లు రైతులకు పరిహారంగా ఇప్పించాం. ఆ భూముల్లో ఆ కంపెనీ ఏర్పాటవుతున్న దశలో కూటమి ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోంది. వారి డబ్బుతో వారికి కేటాయించిన భూములను వారికి ఇవ్వకుండా కరేడుకు వెళ్లిపొమ్మంది. కరేడులో సారవంతమైన, ఏటా రెండు పంటలు పండే భూములు ఇవ్వాలని రైతులపై ఒత్తిడి తెస్తోంది. రైతులకు ఆ భూములు ఇవ్వడం ఏమాత్రం ఇష్టం లేకపోయినా ఇవ్వాల్సిందేనని బలవంతం చేస్తోంది. ఇది ఎంత మాత్రం సరికాదు. ఇండోసోల్‌కు కేటాయించిన భూములను బీపీసీఎల్‌కు ఇచ్చి, ఇండోసోల్‌కు పొగ పెట్టి పొమ్మంటోంది. బీపీసీఎల్‌కు ఇవ్వాలనుకుంటే ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాలో ప్రభుత్వ భూములు సరిపడా ఉన్నాయి. అలా చేయకుండా రైతులకు ఏమాత్రం ఇష్టం లేని భూములు కేటాయిస్తున్నామని చెప్పి ప్రభుత్వం వివాదం రాజేసింది. ఇది ముమ్మాటికీ కుట్రే. సారవంతమైన భూములు కోల్పోతామని కరేడు రైతులు ఎంతగానో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇండోసోల్ సొంత ఖర్చుతో ప్రభుత్వం సేకరించిన భూములను వారికి ఇవ్వకుండా, మరోచోటుకు వెళ్లమనడం పరిశ్రమలను తరిమేసే కుట్రే అవుతుంది. చంద్రబాబుకు పరిశ్రమలను ఏర్పాటు చేయాలనే ఉద్దేశం లేదు. పరిశ్రమలను పెట్టే వారిని బెదిరించి డబ్బులు దండుకునే ప్రయత్నం చేస్తున్నారు అని చెప్పుకొచ్చారు. కరేడు రైతులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది. ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుంది అని హామీ ఇచ్చారు.

**కావాలనే నా సెక్యూరిటీ తగ్గించారు: వైఎస్ జగన్**

చంద్రబాబు ప్రతీ ఆలోచనలోనూ కుట్రే ఉంటుందని ఆరోపించారు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్. కుట్రలతోనే తన పర్యటనల్లో కావాలని ఉద్రిక్తతలు.. తన సెక్యూరిటీ తగ్గించారని వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు. చంద్రబాబు ఆదేశాలతోనే పోలీసులు మాకు సహకరించలేదు.. జెడ్ ప్లస్ కేటగిరి సెక్యూరిటీ ఉన్నప్పటికీ ఇవ్వలేదు అంటూ మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ..'ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు రాజకీయ పార్టీలకు ఉండదా?. ప్రజలను చైతన్యవంతుల్ని చేయడం, మీటింగ్‌లు పెట్టుకోవడం.. ఇవన్నీ హక్కులే కదా. మరి రాజకీయ పార్టీకి ఉండాల్సిన మౌలిక హక్కులు నలభై ఏళ్ల రాజకీయానుభవం ఉన్న చంద్రబాబుకి తెలీదా?. కుట్రలతోనే నా పర్యటనల్లో ఉద్రికత్తలు చోటుచేసుకుంటున్నాయి. చంద్రబాబు ఆదేశాలతోనే పోలీసులు మాకు సహకరించలేదు. నాకు జెడ్ ప్లస్ కేటగిరి సెక్యూరిటీ ఉన్నప్పటికీ ఇవ్వడం లేదు. చంద్రబాబుకు నచ్చినప్పుడు సెక్యూరిటీ ఇస్తాడు.. ఇష్టం లేకపోతే సెక్యూరిటీ ఇవ్వడు అని తెలిపారు. పెడనలో సభ పెట్టిన నేతలందరిపై కేసులు పెట్టారు. నా పర్యటనలు అయ్యాక తప్పుడు కేసులు పెడుతున్నారు. మిర్చి యార్డుకు వెళ్లి రైతులకు సంఘీభావం తెలపడం తప్పా?. పొగాకు రైతులకు సంఘీభావంగా వెళ్తే కేసులు పెట్టారు. మా పార్టీ కార్యకర్త కురుబ లింగయ్యను చంపి, మా పార్టీ నేత తోపుదుర్తిపై కేసు పెట్టారు. మా వాళ్లను మేం పరామర్శించినా కేసులు పెడుతున్నారు. మళ్లీ చంద్రబాబే దాన వీర కర్ణ సినిమా రేంజ్‌లో యాక్టింగ్ చేస్తున్నారు. చంద్రబాబు యాక్టింగ్‌లో ఎన్టీఆర్ యాక్టింగ్ కూడా దిగదుడుపే' అని సెటైర్లు వేశారు.

## కృష్ణ,గోదావరి నదీ జలాలపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చలు సఫలం

-మొదటిపేజీ తరువాయి

నిర్ణయాలు తీసుకున్నా రన్నారు. అందులో మొదటిది ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని రిజర్వాయర్ల నుంచి కాలువలకు వెళ్లే అవుట్ ఫ్లో కు సంబంధించి టెలిమీటర్లు ఏర్పాటు చేయాలనే నిర్ణయంపై ఇరు రాష్ట్రాలు అంగీకారం తెలిపాయి. రెండవది తెలుగు జాతి సంపద అయిన శ్రీశైలం ప్రాజెక్టును ఆంధ్ర, తెలంగాణ రెండు రాష్ట్రాలు కలసి కాపాడుకోవాలి. ఈ ప్రాజెక్టు మరమ్మతుల విషయంలోనూ, ప్లంజ్ పూల్ రక్షణ విషయంలోనూ సిడబ్ల్యూసి సిఫార్సులు, నిపుణుల సూచనలు సత్వరమే పాటించి చర్యలు తీసుకోవాలనే అంశంపై ఇరు రాష్ట్రాలు ఏకాభిప్రాయం వ్యక్తం చేసి అంగీకారం తెలిపాయి. మూడో అంశమైన కృష్ణా రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ ( కె ఆర్ ఎం బి ) అమరావతి లోను, గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డ్( జి ఆర్ ఎం బి ) హైదరాబాదులోను ఉండాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి రామానాయుడు వివరించారు. అలాగే మరో ముఖ్యాంశమైన పోలవరం బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన నివేదిక పైన , తెలంగాణ ప్రభుత్వం చెప్పిన అభ్యంతరాల పైన సానుకూల స్పందన వ్యక్తం అయినట్లు మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అనేక సాంకేతిక అంశాలు ముడిపడి ఉన్నందున..ఇరు రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఒక కమిటీ వేయాలని ఉభయ రాష్ట్రాలు నిర్ణయించినట్లు నిమ్మల స్పష్టం చేశారు. ఈ కమిటీలో సాంకేతిక నిపుణులు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు ఉభయ రాష్ట్రాలకు సంబంధించి ఉంటారని ఆయన చెప్పారు. ఈ కమిటీ సిడబ్ల్యుసి ఆధ్వర్యంలో పనిచేస్తుందన్నారు. కాలయాపన లేకుండా వచ్చే సోమవారం లోపునే కమిటీ నియామకం జరుగుతుందన్నారు. అలాగే గోదావరి నది నుంచి ఏటా సముద్రంలో కలసిపోతున్న 3000 టీఎంసీల నీటి వృధాపై కూడా కమిటీ ఆరా తీసి తమ నివేదికలో పొందుపరుస్తుందని మంత్రి రామానాయుడు చెప్పారు. రాష్ట్రాలు వేరైనా, పార్టీలు వేరైనా తెలుగుజాతి ఒకటేనన్న స్నేహపూర్వక వాతావరణం లో ఢిల్లీ సమావేశం జరగటం గొప్ప శుభ పరిణామంగా జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అభివర్ణించారు.

## వైసీపీ నేతల నిందల్ని మోస్తూ సేవాతత్వంతో ముందుకు

**నెల్లూరు :** ఏపీలో సుపరిపాలన తొలి అడుగు పెద్ద ఎత్తున జరుగుతోందని.. సూపర్ సిక్స్ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ఈరోజు (బుధవారం) మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. మర్రిపాడు మండలంలో రూ.4.62 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరిగాయన్నారు. ఆత్మకూరులో 42 వేల కుటుంబాలను కలిశామని.. మిగిలిన కుటుంబాలను కూడా కలుస్తామని తెలిపారు. మెట్ట ప్రాంతమైన ఆత్మకూరుకు తాగు, సాగునీరు అందించేందుకు రూ.1800 కోట్లతో హైలెవల్ కెనాల్ తెచ్చామని చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వం పనులు నిలిపేయగా, ఇప్పుడు మళ్లీ పనులు ప్రారంభించామన్నారు. హై లెవల్ కెనాల్‌తో లక్ష కుటుంబాలకు సాగునీరు, తాగునీరు అందించవచ్చని మంత్రి వెల్లడించారు. రూ.549 కోట్లతో వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి అనుమతులు వచ్చాయన్నారు. కడప, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని పలు మెట్ట ప్రాంతాలకు వెలుగొండతో మేలు జరుగుతుందన్నారు. కేంద్రం జలజీవన్ మిషన్‌కు గతంలో రూ.28 వేల కోట్ల నిధులు ఇచ్చిందని.. కానీ గత ప్రభుత్వం దున్నపోతు మీద వానపడ్డట్టు వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. ప్రధాని మోదీతో చర్చించి, మరో రెండేళ్ల కాలం పొడిగించేలా చేశారని తెలిపారు. సోమశిల నీటిని మర్రిపాడు ప్రజలకు అందించి, వారి కళ్లలో ఆనందం చూడటమే లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రూ.10.5 లక్షల కోట్ల భారం ఇచ్చి వెళ్లిందని... ఓ వైపు ఆ అప్పులు తీరుస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు. హింద్రీనీవా ప్రాజెక్ట్‌కు రూ.3900 కోట్లు కేటాయించారని.. హింద్రీనీవాను కుప్పం వద్ద కావేరీ నదిలో కలపబోతున్నామని చెప్పారు. వైసీపీ నేతల నిందల్ని మోస్తూ సేవాతత్వంతో ముందుకు సాగుతున్నామన్నారు. రౌడీయిజం, గూండాయిజం, గంజాయి బ్యాచ్‌లు, మాఫియాలు పెట్రేగిపోతున్నాయని... వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రధానంగా కాలేజీలు, స్కూళ్ల వద్ద తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. పాలిటెక్నిక్ కాలేజీలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని... యువత ఉపాధికి గండికొట్టిందని మండిపడ్డారు. ఆత్మకూరులో ఆగస్టు 1న 50 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామని తెలిపారు. 1200 నుంచి 1400 మందికి స్పాట్‌లో ఉద్యోగాలు ఇవ్వనున్నారని.. యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at Sai Sree Offset Printers, # 7-17-166, 3rd line, Srinagar, Guntur - 522002 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : SIRIKONDA MARIA, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.